ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 5
జిల్లా వార్తలు
మంగళవారం 2, ఏప్రిల్ 2024



ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారంతోపాటు అసమ్మతి సెగ అధికమవుతోంది. క్రమేపీ పరిస్థితులు చక్కబడతాయని భావించిన వైసీపీ నాయకత్వం ఊహ తల్లకిందులవుతోంది. అసలే అసంతృప్తివాదుల అలకల అలజడిలో ఉన్న ఆ పార్టీ అభ్యర్థులకు ఎంపీ అభ్యర్థి వ్యక్తిగత బృందాలు మరింత తలనొప్పిగా తయారయ్యాయి. వారిని నియోజకవర్గాలకు పంపించడాన్ని అభ్యర్థులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో వైసీపీని అసమ్మతి బెడద వేధిస్తుండగా, ప్రతిపక్ష టీడీపీకి ఒక్క స్థానంలో మాత్రమే అలాంటి పరిస్థితి ఉంది. ఇప్పటికే పన్నెండు అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులను వైసీపీ ప్రకటించి రంగంలోకి పంపగా, టీడీపీ కూడా ఆ కసరత్తును పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులపై రెండు పార్టీల అధినాయకులు ఆరా తీస్తున్నారు.



అసమ్మతితో సతమతం

- అధికార వైసీపీలో పదిచోట్ల మంటలు
- ఫలించని బెదిరింపులు, బుజ్జగింపులు
- చెవిరెడ్డి ప్రత్యేక దళంపై ఎమ్మెల్యే అభ్యర్థుల్లో వ్యతిరేకత
- టీడీపీకి కందుకూరులోనే సమస్య
- లోకేష్ ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికను ప్రధాన పక్షాలైన టీడీపీ, వైసీపీ ఇప్పటికే పూర్తి చేశాయి. ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాలతోపాటు జిల్లాతో సంబంధం ఉన్న మూడు పార్లమెంట్ స్థానాలను వైసీపీ ముందుగా ప్రకటించింది. టీడీపీ కూడా గతం కన్నా వేగంగానే ఆ ప్రక్రియను పూర్తి చేసింది. అభ్యర్థుల ఎంపిక విషయమై వైసీపీలో సమస్యలు అధికంగా ఎదురుకాగా, టీడీపీ ఆ విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకుంది. స్థానికంగా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలపై ఉన్న వ్యతిరేకతలను నివారించే ఉద్దేశంతో వైసీపీ ఎక్కువ మంది అభ్యర్థులను మార్పుచేసింది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి మినహా మిగిలిన ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలకు వారు ప్రాతినిథ్యం వహించే స్థానాల్లో ఎక్కడా సీట్లు ఇవ్వలేదు. ముగ్గురు ఎమ్మెల్యేలను పూర్తిగా పక్కన పెట్టగా మరో నలుగురు ఎమ్మెల్యేలకు స్థానచలనం కల్పించింది. చీరాల ఎమ్మెల్యే స్థానంలో ఆయన కుమారుడిని రంగంలోకి తెచ్చింది. సంతనూతలపాడు, అద్దంకి నియోజకవర్గాలకు గుంటూరు జిల్లా నాయకులను దిగుమతి చేసింది. స్థానికంగా ఉన్న అసమ్మతులను, విభేదాలను సవరించుకునే లక్ష్యంతో ఆ కొత్త ప్రక్రియను వైసీపీ చేపట్టగా అది ఆచరణలో ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. పది స్థానాల్లో అసమ్మతి నేతలతో వైసీపీ అభ్యర్థులు సతమతమవుతుండటం అందుకు నిదర్శనం. ఇక టీడీపీ ముగ్గురు సిటింగ్ ఎమ్మెల్యేలతోపాటు ఎనిమిది స్థానాల్లో ఇన్‌చార్జిలుగా ఉన్నవారినే రంగంలోకి దింపింది. ఒక్క కందుకూరులో కొద్దిపాటి సమస్యలు మినహా మిగిలిన చోట్ల ఆపార్టీ అభ్యర్థుల ఎంపికపై కేడర్‌లో సానుకూలత వ్యక్తమైంది.

ఎస్‌ఎన్‌పాడులో కనిపించని సుధాకర్

ఎస్‌ఎన్‌పాడులో మంత్రి నాగార్జునతో కలిసి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఇంతవరకు ప్రచారంలో పాల్గొనలేదు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి ఆయన్ను ఒంగోలు లోక్‌సభలోని కొన్ని ప్రాంతాల్లో ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. చీమకుర్తి మండలంలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి వ్యతిరేకవర్గం దగ్గరకు రాలేదు. పైగా కొందరు నాయకులతో మీరు మాట్లాడినా తాను ఒప్పుకోనని శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించినట్లు సమాచారం. ఎన్‌జీపాడు మండలంలో ఒక గ్రూపు నాయకులు నాగార్జున ప్రచారానికి పూర్తి దూరంగా ఉన్నారు.

వైసీపీలో లుకలుకలు

వైసీపీలో ప్రస్తుతానికి ఒంగోలు, మార్కాపురంతో పాటు మిగిలిన పది స్థానాల్లో అభ్యర్థులకు అసమ్మతి బెడద అధికమైంది. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు వర్గం వారి నుంచి ఆశించిన సహకారం అభ్యర్థి నాగార్జునరెడ్డికి లభించడం లేదు. నిన్నటికి నిన్న కంభం, అర్ధవీడు మండలాల నుంచి టీడీపీలో చేరిన స్థానిక సంస్థల ప్రతినిధులు, వైసీపీ నాయకులంతా గతంలో అన్నా రాంబాబుతో నడిచిన వారే. ఇక అనూహ్యంగా స్థానికేతరులు అన్న సమస్యను నాగార్జునరెడ్డి ఎదుర్కొంటున్నారు. గిద్దలూరు వైసీపీ టికెట్ ఆశించి భంగపడిన వారిలో ఒకరిద్దరు నాయకులు అంటీముట్టనట్లు తిరుగుతుండగా, ఐదుగురు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. ఎర్రగొండపాలెంలో గతంలో మంత్రి సురేష్ అనుకూల, వ్యతిరేకంగా వ్యవహరించిన గ్రూపుల వారు కలిసి పయనించేందుకు ససేమిరా అంటున్నారు. అభ్యర్థి చంద్రశేఖర్ ఒకరిని చేరదీస్తే మరొకరు గుడ్‌బై చెబుతున్నారు. ఆయన మంత్రి సురేష్ వ్యతిరేక వర్గం వారితో సన్నిహితంగా ఉండగా, సన్నిహిత వర్గం వారు పోలోమని టీడీపీలో చేరుతున్నారు. పుల్లలచెరువు మండలంలో కీలకమైన ఆ పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డితోపాటు అన్ని గ్రామాల్లోని సురేష్ అనుచరులు టీడీపీలో చేరడం అందుకు నిదర్శనం. దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వర్గీయులు అక్కడి అభ్యర్థి శివప్రసాద్‌రెడ్డికి దూరంగానే ఉన్నారు. ఒకరిద్దరు కలిసిపోయినా ఆయన నుంచి సరైన ఆదరణ లభించడం లేదంటూ తిరుగుముఖం పడుతున్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి కూడా శివప్రసాద్‌రెడ్డి విషయంలో రాజీ లేదనే సంకేతం ఇవ్వడంతో అనేక గ్రామాల్లో వేణుగోపాల్ అనుచరులు శివప్రసాద్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

కలవని గ్రూపులు, వర్గాలు

అద్దంకి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గరటయ్య, ఆయన కుమారుడు చైతన్యతోపాటు వారి గ్రూపు అంతా టీడీపీలోకి వెళ్లిపోయింది. గతంలో టీడీపీ అభ్యర్థి రవికుమార్‌తో ఉండి గత మూడేళ్లలో వైసీపీలో చేరిన వారంతా తిరిగి రవికుమార్ దగ్గరకు వెళ్లి మద్దతు ప్రకటిస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి దూకుడు మనస్తత్వం, దురుసు మాటతీరును భరించలేక ఇటీవల అనేక గ్రామాల్లో నాయకులు ప్రచారానికి దూరమయ్యారు. పర్చూరులో ఒకవర్గం నాయకులు, వారి అనుచరులంతా అభ్యర్థి బాలాజీకి దూరంగానే ఉన్నారు. బాలాజీ అభ్యర్థిగా రాగానే గతంలో ఉన్న గ్రూపులకతీతంగా ఆయన వద్దకు వెళ్లిన నాయకులకు ఎదురైన చేదు అనుభవాలతో సైలెంట్ అయిపోయారు. చీరాలలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి, ఆయన అనుచరులు వైసీపీ అభ్యర్థి వెంకటేష్ తరపున ప్రచారానికి దూరంగా ఉన్నారు. బీసీ నాయకుడు, మాజీ మంత్రి పాలేటి రామారావు గుడ్‌బై చెప్పడం కూడా వైసీపీకి శాపంగా మారింది. కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తనను కలిసిన వైసీపీ నాయకులు, అభ్యర్థి బుర్రాకు మాటలు చెప్పి పంపడమే తప్ప ఇంతవరకు ప్రచారానికి హాజరుకాలేదు. ఆయన వర్గీయుల్లో చాలామంది ఇప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. తటస్థవాదులు, కొన్ని గ్రామాల్లోని నాయకులు టీడీపీలో చేరిపోయారు.

కందుకూరుపై టీడీపీ అధిష్ఠానం దృష్టి

టీడీపీ విషయానికి వస్తే కందుకూరు నియోజకవర్గంలో ఆపార్టీ అసమ్మతి, అసంతృప్తుల సమస్యలను ఎదుర్కొంటోంది. అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు తాను సహకరించబోనని చెప్పడమే కాక స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ ప్రకటించి తిరుగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా టీడీపీ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే కేడర్‌ను కలుపుకొని పోవడంలో అభ్యర్థి సఫలీకృతులయ్యారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆ నియోజకవర్గంపై దృష్టి సారించారు. రాజేష్‌ను గురువారం హైదరాబాద్ పిలిపించుకొని మాట్లాడారు. చీరాలలోనూ టీడీపీలోని ఒక వర్గం నాయకులు అలకబూని ఉండగా లోకేష్ వారితో మాట్లాతున్నారు.

కనిగిరి, కొండపిలో దూరందూరం

కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రాను మర్యాదకోసమైన వైసీపీ అభ్యర్థి దద్దాల ప్రచారానికి ఆహ్వానించలేదు. దీంతో మధుసూదన్‌యాదవ్ అనుచరులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. నిన్న మొన్నటివరకు బుర్రాకు వ్యతిరేకంగా చక్రంతిప్పిన కొందరు నాయకులే ప్రస్తుత అభ్యర్థిపై పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో దాదాపు అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే అనుచరులు అభ్యర్థికి దూరంగా ఉండిపోయారు. బుర్రా కందుకూరులో పోటీలో ఉన్నందున కొందరు నాయకులు పేరుకు సమావేశాలకు వెళ్తున్నప్పటికీ మనస్ఫూర్తిగా మద్దతు ఇవ్వడం లేదని దద్దాల ఇప్పటికే అధినాయకులకు ఫిర్యాదు చేశారు. దద్దాల కూడా అప్పుడే గెలిచానన్న అహంభావంతో వ్యవహరిస్తూ చిన్నచూపు చూస్తున్నారని ఎమ్మెల్యే అనుచరులు వైసీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. కొండపిలో మంత్రి సురేష్‌కు అందరూ సహకరిస్తున్నట్లు కనిపిస్తున్నా మండల, గ్రామస్థాయిలోని చాలామంది నాయకులు దూరంగా ఉంటున్నారు. మాజీ ఇన్‌చార్జి వెంకయ్య ప్రచారంలో కనిపించడం లేదు. ఆయన అనుచరులు కూడా గ్రామాల్లో పట్టున్నా ముందుకు రావడం లేదు. ఇటీవల మరో మాజీ ఇన్‌చార్జి అశోక్ వర్గీయులు కూడా కొన్ని గ్రామాల్లో సురేష్ ప్రచారానికి దూరంగా కనిపించారు. టీడీపీలో చేరిన ఎంపీ మాగుంటతో బలమైన నాయకులు కొందరు ఆ పార్టీలోకి వెళ్లిపోయారు.

మండే ఎండ!

- రాష్ట్రంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదు
- పీసీపల్లిలో అత్యధికంగా 42.67.. పశ్చిమాన చాలాచోట్ల 40 డిగ్రీలపైనే
- తల్లడిల్లుతున్న జనం



ఒంగోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వారంక్రితం వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 నుంచి 38 డిగ్రీల వరకు ఉండగా తర్వాత పెరుగుతూ వస్తున్నాయి. నాలుగురోజుల క్రితం 40 డిగ్రీలు దాటగా సోమవారం మరింత పెరిగాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటడమే కాక రాష్ట్రంలోనే అత్యధికం జిల్లాలో నమోదయ్యాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండతీవ్రత కనిపించింది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు అధికంగా ఉంది. ఈ సమయంలో రాష్ట్రంలోనే అత్యధికంగా మండల కేంద్రమైన పీసీపల్లిలో 42.67 డిగ్రీలు నమోదైంది. బేస్తవారపేట మండలం మోక్షగుండంలో 42.40, మార్కాపురం మండలం దరిమడుగులో 42.30, గుండ్లాపల్లిలో 42.03, దొనకొండలో 41.88, దోర్నాల మండలం వై.చెర్లోపల్లిలో 41.80, ఆకవీడులో 41.84, నందనమారెళ్లలో 41.63, మేకలవారిపల్లిలో 41.43, బొట్లగుడూరులో 41.42, వెలిగండ్లలో 41.25, అమానిగుడిపాడులో 41.23, సంతనూతలపాడులో 41.23, కొమరోలులో 41.11 డిగ్రీల ఎండ కాచింది. పశ్చిమప్రాంతంలోని ఎక్కువచోట్ల 40 డిగ్రీలకుపైగా నమోదైంది. ఒంగోలులోనూ ఉష్ణోగ్రతలు పెరిగాయి. వారంరోజులుగా ఇక్కడ 35 నుంచి 36 డిగ్రీలు ఉంటుండగా సోమవారం 37 డిగ్రీలు దాటింది. దీంతో జనం ఇబ్బందులు పడ్డారు. ఏప్రిల్ ఆరంభంలోనే ఈస్థాయి ఎండలు ఉండటంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.


టెంట్ కింద అవస్థ పడుతున్న విద్యార్థులు

టెంట్ కింద చదువులు

విద్యార్థుల అవస్థ

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 1 : నగరంలో డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్ విద్యార్థులు షామియానాల కింద తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్కూల్‌లో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. దీంతో ఆ పాఠశాలలో 6 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను స్థానిక సంతపేటలోని వీఎస్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. అయితే అక్కడ తరగతి గదులు ఖాళీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోని కొద్దిపాటి ఖాళీస్థలంలో టెంట్లను వేసి విద్యార్థులను కుక్కారు. నాలుగు తరగతులు చదువుతున్న వందలాది మంది బాలబాలికలు ఎండకు చెమటలు కారుకుంటూ షామియానాల కిందే కూర్చోవాల్సి వచ్చింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ ఇరుకులోనే మధ్యాహ్న భోజనం కూడా కానిచ్చారు. విద్యార్థులు కార్పెట్ల మీదే కూర్చోవాల్సి వచ్చింది. తరగతి వారీగా వేర్వేరుగా కూర్చోబెట్టేందుకు కూడా టీచర్లు శ్రమించాల్సి వచ్చింది.



ఇంటి వద్దకే పింఛన్?

- సచివాలయ సిబ్బందితో ఇప్పించాలని ప్రభుత్వ నిర్ణయం
- రేపటి నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- నేటికీ జిల్లాకు విడుదల కాని నిధులు
- సెల్‌ఫోన్లను అప్పగించిన వలంటీర్లు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 1 : ప్రభుత్వం మళ్లీ నిర్ణయం మార్చుకుంది. సచివాలయ సిబ్బందితో లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేయాలని ఆదేశించినట్లు సమాచారం. తొలుత ఈనెల 3వ తేదీ నుంచి సచివాలయాల్లో పింఛన్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం విదితమే. వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్మును పంపిణీ చేయించవద్దని, సంక్షేమ పథకాల్లో వారి భాగస్వామ్యం వద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జిల్లాలోని వలంటీర్లు సోమవారం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను, ట్యాబ్‌లు, బయో మెట్రిక్ పరికరాలను తిరిగి సచివాలయాలకు అప్పగించారు. పింఛన్ పంపిణీ బాధ్యతను అక్కడి సిబ్బందికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల మూడో తేదీ నుంచి పంపిణీ చేయాలని మార్చిలోనే నిర్ణయించింది. కాగా దీనిపై ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి లేఖరాశారు. లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ సొమ్మును పంపిణీ చేయాలని కోరారు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించి సచివాలయ సిబ్బందినే లబ్ధిదారుల ఇళ్లకు పంపించి పింఛన్లను అందజేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలు మంగళవారం ఉదయం రావచ్చని డీఆర్‌డీఏ, వైసీపీ అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 2,94,888 పింఛన్లు ఉండగా వీరికి పంపిణీ చేసేందుకు జిల్లాకు రూ.88.22 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులు ఇంకా రాలేదు. ప్రభుత్వం మూడో తేదీనే బ్యాంకులకు నిధులను జమ చేయనుంది. వాటిని సచివాలయ సిబ్బంది డ్రా చేసుకుని వచ్చి పంపిణీ చేయాలి. ఆ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అది కూడా ప్రభుత్వం మూడో తేదీన బ్యాంకులకు జమచేస్తేనే ఆ సొమ్మును పింఛన్ల పంపిణీకి డ్రాచేసుకునే వీలుంటుంది. నిధులు విడుదల చేయడంలో జాప్యం జరిగితే మూడో తేదీన, లేదా నాలుగో తేదీన కూడా పంపిణీకి అవకాశం ఉండదని అంటున్నారు.

రాత్రికి రాత్రే మాయం చేశారు!


సీజ్ చేసిన డంప్ నుంచి తరలించగా మిగిలి ఉన్న ఇసుక

- నేరేడుపల్లిలో ఇసుక మాఫియా బరితెగింపు
- అధికారులు సీజ్ చేసిన డంప్ తరలింపు
- ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్థులు

పీసీపల్లి, ఏప్రిల్ 1 : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఇసుక మాఫియా బరితెగించింది. మొన్నటిదాకా వాగు వంకల్లో యంత్రాలతో ఇసుకను తోడి తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు ఇప్పుడు ఏకంగా అధికారులు సీజ్ చేసిన ఇసుకనే రాత్రికి రాత్రి ట్రాక్టర్ల ద్వారా మాయం చేశారు. వివరాల్లోకి వెళితే. గ్రామ సమీపంలోని నేరెళ్లవాగులో గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులు ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వాగులు, వంకల్లో ఉన్న ఇసుకను యంత్రాలతో తరలిస్తుండడంతో భూగర్భజలాలు సముద్ర మట్టానికంటే దిగువకు పడిపోతున్నాయి. దీంతో ఆందోళనకు గురైన గ్రామస్థులు ఇసుక అక్రమ తవ్వకాలపై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఈక్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది గత ఏడాది డిసెంబర్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. డిసెంబరు 23న విజిలెన్స్ ఏడీ వీరేష్ తన సిబ్బందితో నేరెళ్లవాగును సందర్శించి వాగు ఒడ్డున సుమారు 300 టన్నుల ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం దానిని వీఆర్వోకు అప్పగించారు. అయితే ఇసుకను సీజ్ చేసి మూడు నెలలు దాటినా తరలించకుండా అక్కడే ఉంచారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా సీజ్ చేసిన ఇసుకను మాయం చేశారని గ్రామస్థులు తెలిపారు. దీనిపై స్థానిక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రేషన్ పంపిణీ అరకొర

- కందిపప్పు కోటా కనుమరుగు
- గోధుమపిండిని తీసుకునేందుకు డీలర్ల నిరాకరణ
- గ్రామీణ ప్రాంతాల్లో సర్వర్ సమస్య

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 1 : జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమైంది. తొలిరోజు అరకొరగానే జరిగింది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలు కందిపప్పును మర్చిపోయారు. కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. గత పది నెలల నుంచి ప్రభుత్వం జిల్లాకు కందిపప్పు అరకొరగా కేటాయిస్తుండటంతో దాన్ని తీసుకుని కొద్ది మందికి ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వకపోతే ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో డీలర్లు తీసుకోవడం లేదు. మరోవైపు గోధుమపిండిని కూడా తీసుకునేందుకు డీలర్లు సుముఖత చూపడం లేదు. పంపిణీ సమయంలో కొంతమంది కార్డుదారులు గోధుమపిండిని తీసుకునేందుకు ఆసక్తిచూపడం లేదు. మిగిలిన పిండిని మరుసటి నెలలో ఇచ్చే సమయంలో డ్యామేజీ వస్తుండటంతో నష్టపోతున్నామని డీలర్లు దానిని తీసుకోవడం లేదు. జిల్లాలో 6,70,571 తెల్లరేషన్ కార్డులు ఉండగా తొలిరోజైన సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయానికి కేవలం 26,842 (4శాతం) మందికి మాత్రమే రేషన్ సరుకులు అందాయి. పంపిణీలో రాష్ట్రంలో జిల్లా 22వస్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో కార్డుదారులు గంటల తరబడి వాహనాల వద్దనే పడిగాపులు కాయాల్సి వచ్చింది.




వాగుపోరంబోకులో పార్కు కోసం ఏర్పాటు చేసిన ముఖద్వారం, ప్రహరీ

నీ దుంపాతెగ!

- ఎస్‌ఎన్‌పాడులో నిబంధనలు వర్తించవు
- ఎన్నికల కోడ్ ఉన్నా వాగుపోరంబోకులో పార్క్ పనులు
- పంచాయతీ తీర్మానం చేయాలని ఒత్తిడి
- గతంలో ఆర్‌బీకే కడుతుండగా హైకోర్టు స్టే
- అయినా మారని అధికారపార్టీ నేత తీరు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : 'అధికారం ఇంకా మా చేతుల్లోనే ఉంది. ఇక్కడ మేము చెప్పిందే వేదం. నిబంధనలు పట్టించుకోం.. మేము చెప్పినట్లు చేయాల్సిందే. వాగు పోరంబోకు స్థలమైనా మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. మేము చెప్పినట్లు విని పంచాయతీ తీర్మానం చేసి నిధులు కేటాయించాల్సిందే..' అంటూ అధికార పార్టీ నేత బరితెగించాడు. ఏకంగా పంచాయతీపైనే పెత్తనం చేస్తూ ఎన్నికల కోడ్‌లోనూ అక్రమాలకు పాల్పడుతున్నాడు. అధికారులకు అంతా తెలిసినా వైసీపీలో కీలక నేత కావడంతో చర్యలకు భయపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సంతనూతలపాడులోని జగనన్న లేఅవుట్ సమీపంలో వాగుపోరంబోకు స్థలం ఉంది. జగనన్న లేఅవుట్‌కు ఆ స్థలం నుంచే రాకపోకలు ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాగు పోరంబోకు స్థలంలో గతంలో రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే) నిర్మిస్తుండగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. స్టే ఇవ్వడంతో అక్కడ నిర్మాణం నిలిచిపోయింది.

కోర్టు స్టే ఇచ్చినా.. కోడ్ ఉన్నా లెక్కలేదు

తాజాగా వాగుపోరంబోకు స్థలంలోనే పార్కు ఏర్పాటు చేసేందుకు అధికారపార్టీ ముఖ్యనేత ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. గతంలో హైకోర్టు స్టే ఇచ్చినా మాకేంటి అన్నట్లు ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా ఒక కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించారు. సాధారణంగా ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే రెవెన్యూ ద్వారా స్థలం కేటాయించిన తర్వాత పంచాయతీ తీర్మానం అవసరం. కానీ అందుకు భిన్నంగా నిర్మాణ పనులు ప్రారంభించి ఇప్పుడు పంచాయతీ తీర్మానం చేసి రూ.15లక్షల నిధులు కేటాయించాలని అధికారులపై ఒత్తిడి పెంచినట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండగా తాము తీర్మానం ఏవిధంగా చేస్తామని పంచాయతీ ఉద్యోగులు చెప్తున్నా ఆ అధికారపార్టీ నేత మాత్రం అన్నీ తాను చూసుకుంటానని, చెప్పినట్లు చేయండి అంటూ బలవంతం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు గతంలో ఆర్‌బీకే నిర్మాణాన్ని పీఆర్ ద్వారా కొంత పనులు చేయగా ఈ నిర్మాణాన్ని కూడా తొలగించి పార్కు పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ ఉద్యోగులపై సదరు నేత దౌర్జన్యాన్ని అడ్డుకుని నిబంధనలు అమలయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఇంటింటి ప్రచారంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

కొత్తపట్నంలో టీడీపీ ఇంటింటి ప్రచారం

కొత్తపట్నం(ఒంగోలు నగరం) ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరుతూ కొత్తపట్నంలో సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. యువతకు నిరుద్యోగ భృతి, పాఠశాలకు వెళ్లేప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, రైతుకు ఏటా రూ.20 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారని, బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు గేనం సుబ్బారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేడా సుబ్బారావు, పోలురాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య సంఘాల ప్రతినిధులు

7న ఉగాది కవిసమ్మేళనం

ఒంగోలు (కల్చరల్),ఏప్రిల్ 1:ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె ఇతర సాహిత్య సంస్థల ప్రతినిధులతో కలిసి సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని నరసం కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థానిక రాజాపానగల్ రోడ్డులోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో కవి సమ్మేళనం ఉంటుందని, సుమారు 40 మంది కవులు ఇందులో పాల్గొని తమ కవితలు వినిపిస్తారని అన్నారు. కళామిత్ర మండలి (తెలుగు లోగిలి), నరసం సంయుక్త నిర్వహణలో ఏర్పాటుచేసే ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని అరుణ కోరారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, మిడసల మల్లికార్జున రావు, కుర్రా ప్రసాద్ బాబు, సింహాద్రి జ్యోతిర్మయి, ఎం.సూర్యకుమారి, బీరం అరుణ, శాంతిలత పాల్గొన్నారు.

ఖజానా ఖాళీతోనే పెన్షన్లు నిలుపుదల

టీడీపీ, ఎన్నికల కమిషన్‌పై నిందలు వేయడం తగదు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : ప్రభుత్వ ఖజానా ఖాళీ అయినందున పెన్షన్ల పంపిణీ నిలిచిపోయిందని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేసేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి వద్దకే రూ.4వేలు పెన్షన్ అందిస్తుందని తెలిపారు. మార్చి నెలలో చివరి 15 రోజుల్లో రూ. 13వేల కోట్లు తమ అనుకూల కాంట్రాక్టర్లకు బిల్లులు చేసి ఖజానా ఖాళీ చేసింది నిజం కాదా? అని మాగుంట ప్రశ్నించారు. వలంటీర్లను ప్రజాసేవ కార్యక్రమాలకు కాకుండా పార్టీ కార్యక్రమాలకు వినియోగించుకోవడం సమంజసమా? అని మాగుంట ప్రశ్నించారు. అందువల్లనే ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధుల నుంచి దూరం పెట్టిందని మాగుంట స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెర్ప్ సీఈవోలు పెన్షన్లు త్వరగా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాగుంట డిమాండ్ చేశారు.



పురస్కారం అందుకుంటున్న మాధవరావు

మద్దాలికి జాతీయ ఉగాది పురస్కారం

ఒంగోలు (కల్చరల్),ఏప్రిల్ 1:శ్రీ అభయ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవ రావును హోప్ ఇంటర్నేషనల్, ఎమ్మెన్నార్ ఫౌండేషన్ సంస్థలు పద్మ కమల రత్న జాతీయ ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించాయి. స్థానిక లాస్యప్రియ పబ్లిక్ స్కూలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిర్వహణ సంస్థల ప్రతినిధులు ఆయనకు పురస్కార జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేసి, శాలువతో సత్కరించారు తనకు ఇటువంటి అత్యున్నత పురస్కారం లభించటం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా డాక్టర్ మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.బుచ్చేశ్వర రావు, డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ కొలకలూరు రవిబాబు, డాక్టర్ ఎండ్లూరి జేరుష జాస్మిన్, డాక్టర్ పావని చైతన్య, ఎస్.శ్రీనివాస ప్రసాద్, తిరుమలశెట్టి వెంకట దత్తేశ్వరి తదితరులు పాల్గొని డాక్టర్ మాధవ రావు సేవలను కొనియాడారు.

శిద్దా వెంకటకృష్ణారావుకు ఘననివాళులు



నివాళులు అర్పిస్తున్న శిద్దా రాఘవరావు

చీమకుర్తి, ఏప్రిల్1: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా వెంకటకృష్ణారావుకు సోమవారం వైకుంఠ సమారాధన సందర్భంగా పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.శిద్దా పాండురంగారావు, శిద్దా నాగేశ్వరరావు, శిద్దా హనుమంతరావు, శిద్దా సుధాకర్, కుటుంబ సభ్యులు శిద్దా కాశీవిశ్వేశ్వరావు,శ్రీనివాసరావు,రామకృష్ణ తదితరులు నివాళులు అర్పించారు.

వెంకటేశ్వర్లుకు నివాళులర్పించిన బీఎన్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 1 : చవటపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కాట్రగడ్డ వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సోమవారం నిర్వహించారు. సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్ పాల్గొని వెంకటేశ్వర్లు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషయ్య, స్వర్ణ కిషోర్, వెంకటేశ్వర్లు ధనూష్ సాయి చరణ్ పాల్గొన్నారు.

వైసీపీలో ఆ నలుగురూ ఓ మోసపు ముఠా..!

వారి నీచరాజకీయాలను ప్రజలకు వాస్తవాలతో వెల్లడిస్తా

జగన్, బాలినేని, అన్నా, కుందుర్రులపై విమర్శలు చేసిన పెద్దిరెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 1 : వైసీపీ నేతలంతా ఓ మోసపు ముఠా అని, ఎమ్మెల్యే బాలినేనికి, వైసీపీకి వీర విధేయుడుగా ఉన్న తనను అన్ని విధాలుగా అణగ దొక్కారని, తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. వైఎస్. రాజశేఖర్ రెడ్డి నుంచి తాను వైఎస్సార్ కుటుంబానికి విధేయుడుగా, అభిమానిగా పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేశానన్నారు. అయితే వైసీపీలో కొనసాగిన తాను వాస్తవాలను చాలా దగ్గరగా చూశానని అన్నారు. జగన్ రెడ్డి నవరత్నాలు పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. తాను టీడీపీలో చేరడానికి, వైసీపీకి రాజీనామా చేయడానికి రెండు కారణాలు ఉన్నాయన్నారు. వంచించే నేతల మధ్య ఇమడలేక బయటకు వచ్చానని అన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటున్న బాలినేని 2009లో తాను దర్శి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తే అడ్డుకున్నారని అన్నారు. గత నాలుగేళ్ళ నుంచి మార్కాపురంలో పోరాటం చేస్తున్నానని, అక్కడ దోపిడీలు, దారుణాలు ప్రజల ముందుకు తెచ్చే ప్రయత్నం చేశానని తెలిపారు. వినుకొండ ప్రాంతం వెనుకబడి ఉండగా, దానిని అభివృద్ధి చేయాలని, మార్కాపురం జిల్లాను చేయాలని స్వపక్షంలో విపక్ష పాత్ర పోషించానని తెలిపారు. అయితే నేడు జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు హద్దులేకుండా పోయిందన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులుగా ఉన్న సమయంలో బాలినేని, ఆదిమూలపు సురేష్ పశ్చిమప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారని, వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి, టీడీపీ నేతలు

బాలినేనివి నీచరాజకీయాలు

మాటలు రాని మౌనమునిగా ఉండే బాలినేని ఎవరిని ఎదగనివ్వడని, ఎవరైనా ఎదిగితే ఓర్చుకోలేడని పెద్దిరెడ్డి దుయ్యబట్టారు. గతంలో తన పుట్టిన రోజు సందర్భంగా నగరంలో ఫ్లెక్సీలు ఉంటే వాటిని తొలగించిన అహంకారి బాలినేని అని అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే సీఐ భక్తవత్సల రెడ్డిపై కేసు పెట్టి బదిలీ చేయించాలని డిమాండ్ చేశారు. నమ్ముకున్నవారిని, బంధువులను నిలువునా మోసం చేసే బాలినేని ఓటమే లక్ష్యంగా తాను పని చేస్తానని పెద్దిరెడ్డి పేర్కొన్నారు. బాలినేని, ఆయన తనయుడు అరాచకాలు ప్రజలందరికి తెలుసునని అన్నారు. తాను బాలినేని ఓటమే లక్ష్యంగా, దామచర్ల గెలుపు కోసం గడప గడప తిరుగుతానని తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబును భారీ మెజారిటీతో గెలిపిస్తే ఆయన డేరా బాబాగా మారాడని, నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కుందుర్రు నాగార్జున రెడ్డి, ఆయన తమ్ముడు చోటా నయీమ్‌లుగా ఆక్రమణలు, భూదందాలు చేశారన్నారు. తన సొంత స్థలాన్ని ఆక్రమించారని, తాను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు. వైసీపీ కోసం అహర్నిశలు కష్టపడిన తనకు పార్టీలో తీరని అన్యాయం జరిగిందని, అంతే కాకుండా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇన్నాళ్ళు నమ్ముకున్న పార్టీలో ఇంత దారుణాలు జరుగుతున్నాయని, వాటిని ప్రశ్నించినందుకు తనను పార్టీ వ్యతిరేకిగా చూస్తున్నారన్నారు. అందుకే వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరానని తెలిపారు. మీడియా సమావేశంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి బొల్లినేని వాసుకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వెళ్లండి.. కష్టపడి పనిచేయండి

కమ్మపాలెంలో నేతలతో దామచర్ల, రియాజ్ ఆత్మీయ సమావేశం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 1 : 'సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరకు వచ్చేసింది. సైకో పాలనకు శాశ్వతంగా గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమయింది. ఈ రెండు నెలలు అందరూ కష్టపడి పనిచేయండి, ప్రజల్లో వెళ్ళి టీడీపీ అభివృద్ధిని, సూపర్ సిక్స్ పథకాలను వివరించాలని' ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం నగరంలోని 7వ డివిజన్‌లోని కమ్మపాలెంలో నిర్వహించిన టీడీపీ, జనసేన శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మహిళలు, పార్టీ నేతలతో దామచర్ల, జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఎన్నికల సమయం మరో యాభై రోజులే ఉంది. వైసీపీ పాలనలో ఇన్నాళ్ళు అనేక ఇబ్బందులు పడ్డారు. కక్షసాధింపు చర్యలు, అక్రమ కేసులు, సంక్షేమ పథకాలు తొలగింపులు తదితర సమస్యలతో సతమతమైన పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి, వాస్తవాలను వివరించాలని సూచించారు. రాష్ట్రం బాగుండాలన్నా, నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా తెలుగుదేశం ప్రభుత్వ రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. తాను కూడా ప్రతి డివిజన్‌లోను పర్యటిస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులు ఆయా డివిజన్‌లలోని సమస్యలను గుర్తించడంతోపాటు, గతంలో తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. మేలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అందుకు అనుగుణంగా అందరం కష్టపడి పనిచేయాలని తెలిపారు. జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలందరూ ఒకే కుటుంబంగా పనిచేసి కూటమి గెలుపు కోసం పనిచేయాలన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలన అంతమొందించడానికే మూడు పార్టీలు ఒక్కటయ్యాయని, ఆ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్‌లు దాచర్ల వెంకటరమణయ్య, సంద్రపాటి వర్ష్ వర్త్, బైరపునేని తిరుపతిరావు, కాట్రగడ్డ సింగయ్యతో పాటు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో 12వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు బడేషా టీడీపీలో చేరగా, దామచర్ల పార్టీ జెండాలు కప్పి ఆహ్వానించారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, పక్కన జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ తదితరులు



టీడీపీలో చేరిన బడేషాతో నేతలు



ముప్పావారిపాలెంలో టీడీపీలో చేరినవారితో బీఎన్ విజయ్‌కుమార్



తిమ్మసముద్రంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బీఎన్

అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతా...

ముప్పావారిపాలెంలో టీడీపీలోకి భారీగా చేరికలు

చీమకుర్తి, ఏప్రిల్1 :'నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతాను..ఈ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించండి' అంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కోరారు. బాబు ష్యూరిటి - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని ముప్పావారిపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల వెంకట్రావు, చింతపట్ల బ్రహ్మయ్య, కృష్ణారావు, బక్కా కోటయ్య ఆధ్వర్యంలో దాదాపు 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు కప్పి విజయ్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను అందించి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి మన్నం ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, బాపట్ల పార్లమెంట్ రైతుకమిటీ కార్యనిర్వహణ కార్యదర్శి ఎనికపాటి లక్ష్మీనరసయ్య, సర్పంచ్ బొడ్డు రవి, బొడ్డు రామారావు, బ్రహ్మజీ, ఎనికపాటి కృష్ణ, వేల్పుల శ్రీను, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 1 : తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తిమ్మసముద్రం గ్రామంలోని అంబేడ్కర్ నగర్, క్రిస్టియన్ పాలెంలోని వైసీపీకి చెందిన ఆడే సుబ్బారాయుడు, ఈదర చిట్టెయ్య, గోళ్ళ మాణిక్యరావు, జాలాది రాంబాబు, ఏజర్ల ఆదాం, ఏజర్ల ఇస్సాకు, మరో 30 కుటుంబాలు సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్ సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి విజయ్ కుమార్ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలు అందకుండా తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, అక్రమ కేసులు బనాయించాడని పార్టీలో చేరిన వారు బీఎన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జెండాలు మోసిన తమకే ఆ పార్టీలో గౌరవం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ అందుకే ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరామని తెలిపారు. బీఎన్ విజయ్ కుమార్ గెలుపు కోసం అహర్నిశలు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, తిమ్మసముద్రం గ్రామ పార్టీ అధ్యక్షులు మంగమూరి మధుబాబు, గోళ్ళ బాబురావు, తేళ్ళ శేషు, కందుల శ్రీనివాసరావు, తేళ్ళ వీరయ్య, రామోజీరావు, గంటా అనిల్, రాయపాటి సాయి, తదితరులు పాల్గొన్నారు.

టి.కృష్ణ ద్వారానే హీరోగా ఖ్యాతి

నటుడు సుమన్

ఒంగోలు (కల్చరల్),ఏప్రిల్ 1: జిల్లాకు చెందిన సంచలన దర్శకుడు దివంగత టి.కృష్ణ ప్రోత్సాహంతోనే నేను చిత్రసీమలో హీరోగా సుస్థిర స్థానాన్ని పొందానని హీరో సుమన్ అన్నారు. సోమవారం స్థానిక బీకేఎన్‌క్లేవ్‌లోని ప్రాణిక్ హీలింగ్ నిపుణులు కొణిజేటి రోశయ్య గృహానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు సుమన్‌కు ఘన స్వాగతాన్ని పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టి.కృష్ణ నిర్మించిన నేటిభారతం చిత్రం ద్వారా తనకు ఎంతో పేరు వచ్చిందని, ఆ తర్వాత పది భాషల్లో 800 చిత్రాలలో నటించానన్నారు. అన్నమయ్య సినిమాలో శ్రీ వేంకటేశ్వరునిగా, శ్రీరామదాసులో రాముడిగా నటించటం తనకు లభించిన అదృష్టంగా భావిస్తున్నానని సుమన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వేంకట శ్రీనివాసులు, ప్రజా గాయకుడు నూకతోటి శరత్, షేక్ హుమయూన్ బాషా, రాజా దివ్య, సులోచన తదితరులు పాల్గొని సుమన్‌ను ఘనంగా సత్కరించారు.



సుమన్‌ను సత్కరిస్తున్న అభిమానులు

ఎన్డీఏ కూటమి సమన్వయ కమిటీ ఇన్‌చార్జిగా యోగయ్య

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి బీజేపీ సమన్వయ కమిటీ ఇన్‌చార్జిగా వైసీ యోగయ్యయాదవ్ నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతృత్వంలో ఏర్పడిన కూటమిని సమన్వయం చేసే దిశగా రాష్ట్ర కమిటీలు చర్యలు తీసుకున్నాయి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న యోగయ్య యాదవ్‌ను సమన్వయ కమిటీ ఇన్‌చార్జిగా నియమితులు కాగా బీజేపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ శెగ్గం శ్రీనివాసరావులను ప్రత్యేక ఆహ్వానితులుగా, కో కన్వీనర్‌గా సీతారామయ్య నియమితులయ్యారు.

దివ్యాంగులకు సక్షం యాప్‌తో ఓటింగ్ సులభతరం

ఒంగోలునగరం, ఏప్రిల్ 1: దివ్యాంగులకు ఓటింగ్ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను సులభంగా అధిగమించేందుకు ఎన్నికల సంఘం సక్షం యాప్‌ను అందుబాటులో తెచ్చిందని జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఓటింగ్ సమయంలో వీల్ చైర్ కొరకు, బూత్ మార్పు, ఇతర సమస్యలు ఉన్నా యాప్‌లో నమోదు చేయటం ద్వారా తగిన సహాయం పొందవచ్చని ఆమె తెలిపారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.



మాజీ సైనికుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల నిర్వహణలో మాజీ సైనికులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : జిల్లాలో మే 13వతేదీన జరిగే సాధారణ ఎన్నికలలో మాజీ సైనికుల సేవలను వినియోగించుకోనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. కనీసం 1500 మంది అవసరమని తెలిపారు. ఈదిశగా మాజీ సైనికులను సన్నద్ధం చేసేందుకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మాజీ సైనికుల సంఘాలతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పోలీసు సేవలతో పాటు ఇతర యూనిఫాం సిబ్బందిని కూడా ఎన్నికల విధులలో వినియోగించుకొనేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పెద్ద సంఖ్యలో మాజీ సైనికులు ఉన్నందున వారి సేవలను కూడా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధులలో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు రెండు రోజుల పాటు సేవలను వినియోగించుకుంటామన్నారు. అందుకోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు గౌరవ వేతనాన్ని కూడా చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు. దేశ భద్రతలో సేవలందించిన సైనికులకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న సాధారణ ఎన్నికలలోనూ మరోసారి సేవచేసే అవకాశం వచ్చిందన్నారు. జిల్లాలోని మాజీ సైనికులు తమవంతుగా ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఈ దిశగా ఆయా మండలాల స్థాయిలో మాజీ సైనికులతో సమావేశాలు నిర్వహించాలని పోలీస్ ఎస్‌హెచ్‌వోలను కూడా ఆదేశిస్తామన్నారు. స్థానిక నియోజకవర్గాల్లోనే వారికి విధులను కేటాయిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో మాజీ సైనికులను సమీకరించిన సంఘాలకు జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, సైనిక సంక్షేమాధికారి ఎం. రజనీకుమారి, ఇతర శాఖల అధికారులతో పాటు మాజీ సైనికుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో పంచాయతీ కార్యదర్శి

ఒంగోలు(క్రైం),ఏప్రిల్1: పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ వైసీపీ నాయకుడిలా ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్న తన్నీరు శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన శ్రీనివాసరావు మార్టూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఆయన స్థానికంగా వైసీపీ కార్యక్రమాలలో పాల్గొంటూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆదే గ్రామానికి చెందిన తుల్లూరి బోసు బాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అంతే కాకుండా శ్రీనివాసరావు వైసీపీ నాయకులతో కలిసి ఉన్న ఫొటోలు కూడా ఫిర్యాదుతో జతపరిచారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టూటౌన్ సీఐ జగదీష్

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 1 : మండుతున్న ఎండలతో వేసవి తాపంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కమ్మపాలెంకు చెందిన ఎన్‌ఆర్‌ఐ బైపనేని పవన్ చొరవ చూపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్ నుంచి కమ్మపాలెం వెళ్ళే మార్గంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, టుటౌన్ సీఐ జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగాపవన్ ఆలోచనలను సీఐ అభినందించారు. అలాగే నిర్వాహకులు పవన్ మాట్లాడుతూ బస్టాండ్ సెంటర్ కావడంతో రోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, అలాగే, వృద్ధులు, చిన్నారులు దాహార్తికి తల్లడిల్లే అవకాశం ఉన్నందున తన అమ్మమ్మ జ్ఞాపకార్థం ఉచితంగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమ్మపాలెంకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : ఎన్నికల విధులపై పీవోలు, ఏపీవోలకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్నికల నిర్వహణపై ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్వోలు, ఏఆర్వోలకు ఇప్పటికే జిల్లా స్థాయిలో శిక్షణ నిర్వహించామన్నారు. క్షేత్ర స్థాయిలో పోస్టల్ బ్యాలెట్స్, హోమ్ ఓటింగ్ టీంలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పీవోలకు, ఏపీవోలకు విధుల నిర్వహణపై ఈనెల 5, 7 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది అందిరికీ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎన్నికల ప్రధానాధికారి మీనా మాట్లాడుతూ పీవోలు, ఏపీవోల విధులు, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ నిర్వహణలో తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో ఆర్. శ్రీలత ఉన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బేబిరాణి

అన్ని అంశాలపై సమగ్రంగా శిక్షణ పొందాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : కొత్తగా నియమితులైన పశువైద్య సహాయకులు అన్ని అంశాలపై సమగ్రంగా శిక్షణ పొందాలని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ కే బేబిరాణి అన్నారు. స్థానిక డీఎల్‌డీఏ సమావేశపు హాలులో సోమవారం పశువైద్యసహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 45 రోజుల పాటు పలు అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పశువైద్య సహాయకులకు ఇచ్చే కరదీపికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి, ఏడీఎల్‌డీఏ డాక్టర్ ఎస్‌కే కాలేషా, ఒంగోలు డివిజన్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బసవ శంకరరావు, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ సాహితి, డాక్టర్ అనిల్, డాక్టర్ స్వాతి తదితరులు ఉన్నారు.

చరిత్ర, రాజనీతి శాస్త్ర అధ్యాపకులకు శిక్షణ

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 1 : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం చరిత్ర, రాజనీతి శాస్త్రం అధ్యాపకుల శిక్షణ ప్రారంభమైంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన 36 మంది అధ్యాపకులు శిక్షణకు హాజరయ్యారు. ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి శిక్షణ తరగతులను ప్రారంభించారు. శనివారం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయి. డిగ్రీ మేజర్ సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్, క్రెడిట్స్‌కు సంబంధించిన విషయాలపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, నోడల్ రిసోర్స్ సెంటర్ డాక్టర్ ఎన్. మంజుల భారతి, బిట్రగుంట శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మృతి చెందిన శ్రీకాంత్

అద్దంకి టౌన్, ఏప్రిల్ 1: గోతుల రోడ్డు ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. అద్దంకి మండలంలోని కుంకుపాడుకు చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్(29) గత నెల 19వ తేది రాత్రి మోటర్ సైకిల్‌పై తాళ్ళూరు వైపు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు పై గోతులను గుర్తించకపోవడంతో మోటర్ సైకిల్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి తరువాత రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

ఎండ వేడిమికి కార్మికుడు మృతి

మార్టూరు, ఏప్రిల్ 1: ఎండ వేడిమికి కొమ్మూరి వెంకటేశ్వర్లు(55) అనే కార్మికుడు సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు మార్టూరులోని పడమర బజారున నివసిస్తున్నాడు. కుటుంబసభ్యుల కథనంమేరకు .. నాగరాజుపల్లి రోడ్డులోని ఓ పొగాకు కంపెనీలో ఆయన పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో వ్యక్తిగత పని నిమిత్తం మార్టూరు సెంటరులో తిరుగుతూ ఉండగా ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక షాపు ముందు సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు అతని ముఖంపై నీటిని చల్లినప్పటికీ తేరుకోక సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అతని భార్య గతంలోనే చనిపోగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 1 : వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాయిపాలేనికి చెందిన బుచ్చమ్మ(55) మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని అక్కయిపాలేనికి చెందిన పలువురు మహిళలు వేరుశనక్కాయల మిషన్ ట్రాక్టర్‌పై గ్రామం నుంచి పాపాయిపాలెం వెళుతున్నారు. ట్రాక్టర్‌కు ఇరువైపులా అమర్చిన రేకులపై వారు కూర్చున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలో ఒకవైపు రేకు విరిగి దానిపై కూర్చున్నవారు కింద పడిపోయారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. వారిలో బుచ్చమ్మ(55) మృతి చెందింది. మిగిలిన వారిలో బుర్ల శారద, మరో ఇద్దరు మహిళలకు బలమైన గాయాలయ్యాయి. వీరితో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి కొండయ్య, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌లు ఏరియా వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

కొండపి విద్యార్థికి నవోదయ సీటు

కొండపి, ఏప్రిల్ 1 : కొండపికి చెందిన యనమద్ది నిఖిత్ వర్మ నవోదయలో సీటు సాధించా రు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ని ఖిత్ వర్మ మెరుగైన మార్కులతో సీటు పొందా రు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి నిఖిత్‌వర్మ గ్రంథపాలకుడు కోటేశ్వరరావు అభినందించారు.

కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌పై కోర్టుకెళతాం!

- మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు


కలెక్టర్ ఇచ్చిన అప్రూవల్ ఆర్డర్‌ను చూపుతున్న పాలేటి రామారావు

చీరాల, ఏప్రిల్ 1 : వేటపాలెం మండలం కొత్తపేట పరిధిలో పార్కు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కలెక్టర్ ఇచ్చిన అప్రూవల్ ఆర్డర్‌పై తాము కోర్టుకు వెళతామని టీడీపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు చెప్పారు. స్థానిక డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణను పాలేటి తన సహచరులతో సోమవారం ఆ యన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కుందేరు స్థలంలో జరిగిన పార్కు నిర్మాణాన్ని వెంటనే పగలగొట్టాలని డి మాండ్ చేశారు. పార్కు నిర్మాణంతో కుందే రు నీటి ప్రవాహం సక్రమంగా జరగదనిక చెప్పారు. భవిష్యత్‌లో జనావాసాలు పెరిగి పారుదలలేక ముంపు సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందుకు చెన్నై, ముంబయి, హైదారాబాద్‌లలో పరిస్థితులను వివరించారు. ఈనేపథ్యంలో పాలేటి, ఈఈ మురళీకృష్ణ మధ్య ఒకింత వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో పంచారాజ్‌శాఖకు కలెక్టర్ అప్రూవల్ ఆర్డర్ ఇచ్చారని, ఆ నిర్మాణాన్ని పగులగొట్టే అధికారం తనకు లేదని ఈఈ చెప్పారు. దీంతో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌పై కోర్టుకు వెళతామని పాలేటి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కటకం శ్రీనివాసరావు, నాగేశ్వరరెడ్డి, గుమ్మడి ఏసురత్నం, నాగరాజు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. నగదుతో పరారీ

- పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

- బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే ఏలూరి


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు సాంబశివరావు, గొట్టిపాటి

పర్చూరు, ఏప్రిల్ 1: ఓ యువకుడిపై దాడి చేసి నగదుతో పరారైన సంఘటన సోమవారం పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పర్చూరుకు చెందిన ఆకుల మధుబాబును ఆదివారం రాత్రి పర్చూరు - చిలకలూరిపేట ఆర్‌అండ్‌బీ రహదారిలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అతని వద్దఉన్న రూ.40 వేల నగదుతోపాటు, సెల్‌ఫోన్, బైక్‌తో పరారయ్యారు. దుండగుల దాడిలో గాయపడిన క్షతగాత్రుడు స్నేహితుల సహకారంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పర్చూరు సీఐ సీతారామయ్య, ఎస్సై రమేష్ తన సిబ్బందితో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. యువకుడిపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించారు. సోమవారం పర్చూరులోని బాధితుడు ఆకుల మధుబాబు నివాసానికి వెళ్ళి పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించినవారిలో ఏలూరితోపాటు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టివేత.. ఇద్దరు అరెస్టు

పామూరు, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన బోర్డర్ చెక్‌పోస్టు నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి నుంచి 46 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సోమవారం తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎస్‌ఐ ఎం.సైదుబాబుతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద చూడగా అక్రమంగా తీసుకెళ్తున్న 46 బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.1.46 లక్షలు పట్టివేత

ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం చెక్ పోస్టు వద్ద సోమవారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా నరసరావుపేటకు చెందిన పీ శ్రీనివాసరావు, మరో ఇద్దరి వద్ద రూ 1.46 లక్షలు పట్టుబడినట్లు ఎస్‌ఐ పీ ఆంజనేయులు తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేసేటప్పుడు సంబందిత డబ్బు వివరా లు సక్రమంగా తెలపక పోవటం వల్ల సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ అంకారావు, సిబ్బంది ఉన్నారు.

కందులూరులో వైసీపీకి షాక్

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే స్వామి

టంగుటూరు, ఏప్రిల్ 1 : మండలంలోని కందులూరులో వైసీపీకి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గృహానికి వెళ్లిన వారు ఆయన సమక్షంలో సైకిలెక్కారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. వారి సంక్షేమం కోసం అనేక పథకాలు, కార్యక్రమాలను గత తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిందన్నారు. దళితుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు తాము అమలు చేసిన 27 సంక్షేమ పథకాలన్నింటినీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ క్రిస్మస్ కానుకలు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, పెళ్లి కానుక తదితర పథకాలను అటకెక్కించిన జగన్ దళితుల పొట్టకొట్టాడని విమర్శించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే దళిత సంక్షేమ పథకాలన్నింటినీ పునఃప్రారంభిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. జగన్ పెద్ద దళిత వినాశకుడని, ఆయన పాలనలో ఎస్సీ, ఎస్టీల హత్యలు, దాడులు, దోపిడీలు నిత్యకృత్యమయ్యాయని ధ్వజమెత్తారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని జగన్ తన వద్దనే ఉంచుకొని సిగ్గు విడిచి తిరుగుతున్నాడని మండిపడ్డారు. ఈ సందర్భంగా కందులూరు టీడీపీ నాయకులు దామచర్ల బసవయ్య, దామచర్ల యలమంద, బత్తిన శ్రీను, వెంకట్రావు నాయకత్వంలో పంచాయతీ వార్డు సభ్యుడు పసుమర్తి కోటయ్యతోపాటు 30 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే స్వామి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

మాగుంట, స్వామి గెలుపునకు కృషి

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన రమేష్


మార్కాపురంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పల్లపోతు రమేష్

పొన్నలూరు (కొండపి) : టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కొండపి అసెంబ్లీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గెలుపునకు కృషి చేస్తానని పొన్నలూరుకు చెందిన వైసీపీ మాజీ నాయకుడు పల్లపోతు రమేష్ తెలిపారు. మార్కాపురంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన టీడీపీ అధినేత నారా చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిన రమేష్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. త్వరలో పొన్నలూరులో తన అనుచరులతో భారీగా టీడీపీలోకి చేరికల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య సహకారంతో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం

పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు స్వాములు


మాట్లాడుతున్న అడకా స్వాములు

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 1 : టీడీపీ హయాంలోనే బీసీలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని ఆపార్టీ కొండపి నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు అన్నారు. మండలంలోని దావగూడూరులో సోమవారం రాత్రి పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావమే బీసీల పునాదులపై ఏర్పడిందని, పార్టీ ఏర్పాటు నుంచి బలహీనవర్గాల వారు మద్దతు ఇస్తున్నారన్నారు. ఎన్టీఆర్ బీసీలకు రక్షణగా పార్టీని ఏర్పాటు చేస్తే అదే ఒరవడిని చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. బీసీ కులాల వారికి ఆదరణ పథకం కింద గతంలో పనిముట్లు ఇచ్చి కుల వృత్తులకు చంద్రబాబు అండగా నిలిచారన్నారు. తిరిగి అధికారంలోకి రాగానే కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించి బీసీలకు ఆధునిక పరికరాలు, వృత్తిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి శ్రీను, బీసీ సెల్ నాయకుడు ఎం.బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ పేముల విజయనిర్మల, నాయకులు వెంకటస్వామి, సుధాకర్, సుబ్బారెడ్డి, బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే టీడీపీపై బురద

మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

ఒంగోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీపై రాజకీయ లబ్ధికోసం టీడీపీపై బురదజల్లుతూ వైసీపీ చీప్ రాజకీయం చేస్తున్నదని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఆరోపించారు. స్థానిక మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఉన్న నిధులను తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీకావడంతో పింఛన్లు సకాలంలో ఇవ్వలేక వలంటీర్ల పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో ఒక్కరోజులోనే పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉందన్నారు. కానీ నిధులు లేని విషయాన్ని మభ్యపెట్టి టీడీపీపైనా, ఎన్నికల కమిషన్‌పైనా బురదజల్లే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయానికి వలంటీర్లు, పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ వాస్తవాన్ని ప్రజలు గమనించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రూ.4వేల పింఛన్‌ను ఇళ్ల వద్దనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఆలాగే వలంటీర్లను కూడా టీడీపీ ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. తక్షణం పింఛన్లు ఇళ్ల వద్దనే లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వాన్ని బీఎన్ డిమాండ్ చేశారు. పింఛన్లను సకాలంలో పంపిణీ చేయకపోతే సీఎం జగన్‌రెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈఓ మురళీధర్‌రెడ్డిలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు.

రాజకీయ అవినీతికి ప్రజలే కారణం

-హీరో సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు


మాట్లాడుతున్న హీరో సుమన్

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 1: రాజకీయ నాయకులలో అవినీతి పెరిగిపోవటానికి కారణం ప్రజలే అంటూ హీరో సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒంగోలు నగరంలోని ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన ఆయన సోమవారం ఉదయం స్థానిక రైలుపేట నేతాజీ పబ్లిక్ స్కూలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రాజకీయ నాయకులు దొంగలు అని ప్రజలు తిడుతుంటారని, అయితే వారు అన్ని పార్టీల నాయకుల దగ్గర డబ్బులు తీసుకుని తమకు ఇష్టమైన వారికి ఓట్లు వేస్తుంటారన్నారు. ఈ విధంగా నాయకులు ఎన్నికలలో డబ్బులు ఖర్చుపెట్టడం వల్లే వారు అవినీతికి పాల్పడాల్సి వస్తోందని ఇందుకు ప్రజలే కారణమన్నారు. తనకు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి లేదని, వచ్చినా ఉపయోగం లేదన్నారు. తాను సమాజ సేవలోనే ఉంటానని సుమన్ అన్నారు. అదేవిధంగా ఏపీ రాజకీయాలు తనకు అవసరం లేదంటూనే ఎన్నికల ఫలితాల తర్వాత చాలా మార్పులు వస్తాయన్నారు. సమావేశంలో స్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ అనుపమ పాల్గొన్నారు.

మీ దయాదాక్షిణ్యాలపైనే.. నా రాజకీయ భవిష్యత్

యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సురేష్

ఆశించిన స్థాయిలో హాజరుకాని ఆ సామాజికవర్గం వారు


మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ, ఏప్రిల్ 1 : 'మీ దయాదాక్షిణ్యాలపైనే నా రాజకీయ భవిష్యత్ ఆధారపడి ఉంది. నా తలరాతను రాసే అధికారం కొండపి ప్రజల చేతుల్లోనే ఉంది' అని మంత్రి ఆదిమూలపు సురేష్ బేల వాఖ్యలు చేశారు. సోమవారం స్థానిక గంజివారి కల్యాణ మండపంలో నిర్వహించిన వైసీపీ కొండపి నియోజకవర్గ స్థాయి యాదవుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదలకు రాజకీయంగా పెద్దపీట వేసింది వైసీపీనేనన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలోని యాదవులు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర విద్యాభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ యనమల నాగార్జున యాదవ్ మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు, అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల కేటాయింపులో జగన్ యాదవులకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. ఇదిలా ఉండగా సమ్మేళనానికి యాదవుల నుంచి ఆశించిన స్పందన కరువైంది. నియోజకవర్గంలో 16 వేలకుపైగా యాదవులు ఉండగా 1000 మంది ఆ సామాజికవర్గంలోని వైసీపీ మద్దతుదారులు హాజరవుతారని అంచనా వేశారు. కానీ ఆరు మండలాల నుంచి కేవలం 250 మంది లోపే వచ్చారు. వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాచగర్ల పిచ్చయ్య యాదవ్, టంగుటూరు ఎంపీపీ కోటేశ్వరమ్మ, వైసీపీ నేతలు యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, డాక్టర్ కార్తీక్ యాదవ్, పామర్తి మాధవ రావు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకనానికి టీచర్లు డుమ్మా

284 మందికి సంజాయిషీ నోటీసులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 1 : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక డీఆర్‌ఆర్ఎం హైస్కూలులో ప్రారంభమైంది. మూల్యాంకన విధులకు మొత్తం 1200 మంది హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించారు. వాస్తవ అవసరానికి మించి 20శాతం మందిని అదనంగా నియమించినా లాభం లేకుండా పోయింది. నాలుగు సబ్జెక్టుల్లో కనీస అవసరానికి పరిపడా కూడా టీచర్లు హాజరుకాలేదు. దీంతో మూల్యాంకన విధులకు గైర్హాజరైన టీచర్లతోపాటు టీచర్లను రిలీవ్ చేయని హైస్కూలు హెచ్ఎంలు, ఎంఈవోలకూ మొత్తం 284 మంది సంజాయిషీ నోటీసులు జారీ చేసినట్లు పరీక్షల పరిశీలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ తెలిపారు. తెలుగులో ఏడుగురు, హిందీలో 15 మంది, బయాలజికల్ సైన్స్‌లో 25మంది, సోషల్ స్టడీస్‌లో 15మంది స్కూలు అసిస్టెంట్లు, 121 మంది స్పెషల్ అసిస్టెంట్ల(ఎస్‌జీటీ)కు సంజాయిషీ నోటీసులు జారీచేశారు మూల్యాంకన విధులకు హాజరు విషయంలో అధికారుల హెచ్చరికలు బేఖాతరయ్యాయి. డీఆర్‌ఆర్ఎం హైస్కూలులోకి ప్రవేశించే ప్రధాన ద్వారం మూసివేసి దూరంగా ఉన్న మరో ద్వారాన్ని తెరవడంతో టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మూల్యాంకన విధులకు హాజరైన టీచర్లను కార్యక్రమం ముగిసే వరకు కేంద్రం నుంచి బయటకు అనుమతించలేదు. మధ్యాహ్న భోజనం తెచ్చుకున్న వారు మినహా మిగతా వారు కేంద్రంలోని క్యాంటిన్‌లోనే భోజనం చేయాల్సి వచ్చింది. టీచర్లకు కూలింగ్ వాటర్, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య ఆరోగ్యశాఖ బృందాన్ని ఏర్పాటు చేశారు.

దర్శిలో టీడీపీ దూకుడు

భారీగా మద్దతు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు 8 వైసీపీకి

చేయలేమంటూ మద్దిశెట్టికి తేల్చి చెప్పిన అనుచరులు

కౌన్సిలర్లతోపాటు మండల నేతలు టీడీపీ వైపు

(ఆంధ్రజ్యోతి ఒంగోలు)

దర్శి నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వలసలు జరగబోతున్నాయి. సోమవారం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనుచరులువైసీపీకి మద్దతు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికే మ ద్దతు ఇస్తామ ని ప్రకటించినట్లు తెలిసింది. అంతేగాక నియోజకవర్గంలోని ఆయా మం డలాలకు చెందిన వైసీపీలో ఉన్న అసంతృప్తవాదులంతా గొట్టిపాటి లక్ష్మి భర్త అనంత్‌కు టచ్‌లోకి రావడం విశేషం. కొందరు కౌ న్సిలర్లు కూడా వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరబోతున్నారు. వివిధరకాల పరిణామాల అనంతరం దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచిటీడీపీ అభ్యర్థిని రంగంలోకి దించిన విషయం తెలిసిందే. దివంగత నేత గొట్టిపాటి నరసయ్య కుమార్తె డాక్టర్ లక్ష్మి అభ్యర్థి కావడంతో టీడీపీ, బీజేపీ, జనసేనలో జోష్ పెరిగింది. నిన్న మొన్నటి వరకూ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అనుచరులు ఏదో పార్టీ నుంచి ఆయన నరంగంలోకి వస్తారని ఎదురుచూశారు. టీడీపీ అభ్యర్థిగా లక్ష్మి రంగంలోకి రావడంతో ఎమ్మెల్యే వేణుగోపాల్ ఈ పర్యాయం ఎన్నికలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే సోదరుడు శ్రీధర్ దర్శి వెళ్లారు. వారి గృహంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా అనుచరులంతా తాము వైసీపీకి మద్దతు ఇవ్వలేమని, టీడీపీఅభ్యర్థికే మద్దతు ఇవ్వాలని భావిస్తున్నామని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీం తో ఆయన కూడా మీ ఇష్టం అంటూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇప్పటికి అందిన సమాచారం మేరకు.. దర్శి నగర పంచాయతీ పరిధిలోని మద్దిశెట్టి అనుచరులలోని సాంబయ్య అనే నేత మినహా నియోజకవర్గం మొత్తంలో ఆయన అనుచర వర్గం దూరంగా ఉంది. వారిలో కౌన్సిలర్‌తోపాటు ఆయా మండలాల కీలక నేతలు పలువురు టీడీపీ అభ్యర్థి భర్తకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. సోమవారం దర్శిలో టీడీపీ, జనసేన, బీజేపీ పరిచయ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఎం పీ అభ్యర్థి కుమారుడు రాఘవ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ పాల్గొన్నారు. మూడు పార్టీల వారు హాజరు కావడం విశేషం. మా జీ ఎమ్మెల్యే పాపారావు తోపాటు పలువురు నేతలు హాజరయ్యారు.

చంద్రబాబు రాక

దర్శి నియోజకవర్గంలో ప్రజాగళం సభలో పాల్గొనేందుకు చంద్రబాబు రానున్నారు. ఆ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని దర్శి, చీరాలలో తన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని బాబు సూచించినట్లు తెలిసింది. ఈ నెల 7వ తేదీన చంద్రబాబు పర్యటన ఖరారయ్యే అవకాశముందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 1 : దర్శి పట్టణంలో శ్రీ సువర్చలా సమేతా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి విఘ్నేశ్వరపూజ, అభిషేకం, లక్షతమలార్చన మహనైవేద్య సమర్పణ తదితర పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, నారపుశెట్టి పాపారావు, జిల్లా టీడీపీ తెలుగు యువత నాయకుడు మాగుంట రాఘవరెడ్డిలు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భం గా దర్శి పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం వద్ద క్యూలైన్లు కిటకిటలాడాయి. మహిళలు ఆలయం వద్ద పొం గళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రిపూట భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ డ్రామాలు

- ఖజానా ఖాళీ చేసి నగదులేక టీడీపీపై అసత్య ప్రచారం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జగన్‌రెడ్డికి చేతగాక టీడీపీపై అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతేగాని ఎన్నికల కమిషన్, తెలుగుదేశం పార్టీ కాదన్నారు. ఖజానాలో నిధులులేకనే జగన్‌రెడ్డి ఒకటో తేదీ పింఛన్ల పంపిణీకి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. 1.3 లక్షల సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ సాధ్యమేనని చెప్పారు. సీఎం జగన్‌స్వార్థ రాజకీయం వలనే పింఛన్‌దారులు నష్టపోతున్నారన్నారు. పింఛన్లు ఆపమని ఎలక్షన్ కమిషన్ ఎక్కడా చెప్పలేదన్నారు. ఒకటో తేదీ పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించిందన్నారు. పింఛన్లు పంపిణి చేయాల్సిన నగదును జగన్‌రెడ్డి తన అనుకూల కాంట్రాక్టర్‌లకు ఊడ్చి పెట్టారన్నారు. దీంతో ఖజానాలో డబ్బులు లేక వైసీపీ ప్రభుత్వం కొత్తనాటకానికి తెర లేపిందని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. పింఛన్ల పంపిణీకి మేము వ్యతిరేకం కాదన్నారు. పింఛన్లను పెంచింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. జగన్‌రెడ్డిలా దశలవారీగా పింఛన్ల పెంపు చేయలేదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పింఛన్‌ను ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల చేత ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ చేశారు.

టీడీపీలోకి వలసల జోరు


మాగుంట, కందుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న మాజీ సర్పంచ్ గోపి

- మాగుంట, కందుల సమక్షంలో పార్టీలో చేరిన నేతలు
- రాష్ట్రాభివృద్ధి కోసం పార్టీ మారినట్లు వెల్లడి

పొదిలి, ఏప్రిల్ 1 :మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ ఉలవా గోపి ఆధ్వర్యంలో 200ల కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరు ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు ర్యాలీగా తరలివెళ్లారు. స్థానిక నేత గోపితోపాటు 200ల కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన తనయుడు రాఘవ రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ కండువాలు కప్పి వారు సాధరంగా ఆహ్వానించారు. అనంతరం గోపి మాట్లాడుతూ వైసీ పీ కోసం అలుపెరుగని కృషి చేశానని అయితే తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీతోనే సాధ్యమౌతుందన్నారు. దీంతోనే టీడీపీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా పని చేయాలని కోరారు.

మార్కాపురం : మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వ్యాపారవేత్త డీవీ కృష్ణారెడ్డి వైసీపీ ని వీడి టీడీపీలో చేరారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీవీ కృష్ణారెడ్డి తో పాటు యేరువ నాగిరెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.


కృష్ణారెడ్డిని పార్టీలోనికి ఆహ్వానిస్తున్న శ్రీనివాసులురెడ్డి

వాహనాలు తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డీఎస్పీ బాలసుందరరావు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డు కూడలిలోని జాతీయ రహదారి 565పై వెళుతున్న వాహనాలను, పట్టణంలోకి ప్రవేశిస్తున్న వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలను చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నగదును వాహనాలలో పెద్ద మొత్తంలో తీసుకెళ్లే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి, తగిన రసీదులు, బిల్లులు లేకుండా సామాగ్రిని తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్క వాహనదారులు ఎన్నికల కమిషన్ ఆదేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ తనిఖీలో ఆయన వెంట సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీ

గిద్దలూరు : ప్రకాశం, కడప జిల్లాల సరిహద్దుల్లో ఆదిమూర్తిపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం అర్ధరాత్రి వేళ రిటర్నింగ్ అధికారి బి.నాగజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పగలు, రాత్రి అనే వ్యత్యాసం లేకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీ చేసే కార్యక్రమాన్ని వీడియో తీయాలని, తనిఖీ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- ట్యాంకరుకు జగన్ ఫొటోతో మంచినీటిని సరఫరా



గణపవరంలో జగన్ ఫొటోతో ఉన్న మంచినీటి ట్యాంకరు

త్రిపురాంతకం, ఏప్రిల్ 1: పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. అయినప్పటికీ, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో స్థానిక వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న మంచినీటి ట్యాంకురుకు వైసీపీ రంగులతోపాటు ముఖ్యమంత్రి జగన్, మంత్రి సురేష్, వైఎస్ఆర్ ఫోటోలు కూడా ఉన్నాయి. ఈ ట్యాంకరుతో ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఆవైపు కన్నెత్తి చూడలేదు. యథేచ్ఛగా నియమావళి ఉల్లంఘన జరుగుతున్నా పట్టించుకోని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

మనిషికి మందు.. బండికి పెట్రోలు

చెవిరెడ్డి ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో స్థానిక నేతల నజరానా


మోటారు సైకిల్‌యాత్రకు వెళుతూ మద్యం సేవిస్తున్న కార్యకర్తలు



పెట్రోలు స్లిప్

మార్కాపురం, ఏప్రిల్ 1: చంద్రగిరి ఎమ్మెల్యే, వైసీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయ పరిచయ కార్యక్రమం సోమవారం మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు, మార్కాపురంలలో జరిగింది. మార్కాపురంలో చివరిగా పట్టణంలోని పూలసుబయ్యాలకాలనీ వద్ద నుంచి ఎస్వీకేపీ కళాశాల వరకూ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అందులో పాల్గొనడానికి కార్యకర్తలు నిరుత్సాహం వ్యక్తం చేశారు. దీంతో మోటర్‌సైకిల్‌కి పెట్రోలు స్లిప్పులు, మనిషి మందు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం పలికారు. దీంతో దారినపోయే ప్రతి ఒక్కరూ స్లిప్పులు, మందు తీసుకొని ర్యాలీ ప్రారంభం వరకూ ఉన్నారు. తర్వాత తాము తీసుకున్న మందుకు న్యాయం చేయడం కోసం వెళ్లిపోయారు.


స్లిప్పులు ఇచ్చి పెట్రోలు పోయించుకుంటున్న వైసీపీ కార్యకర్తలు

సమస్యల పరిష్కారం కోసం నిరాహారదీక్ష


నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

పొదిలి, ఏప్రిల్ 1 : ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పొదిలి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిరాహారదీక్ష చేపట్టారు. ఆ సంఘం రీజినల్ కార్యదర్శి పిడుగు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిపోలో ఎన్నో సమస్యలు ఉన్నాయని ఎన్నిసార్లు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు ఏ సమస్య వచ్చినా అధికారులతో సంప్రదించి పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. కక్ష సాధింపుగా ఉండడం ఏమిటన్నారు. ఎన్నోసార్లు డ్యూటీ చార్టులు వేయాలని విన్నవించినా ఇంతవరకు ఎలాంటి సమాధానం లేదన్నారు. అక్రమ బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దీక్ష కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు ఓబులయ్య, పి ఓబులేసు, ఎస్‌కె భాష కండక్టర్ చెన్నయ్య పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

కళ తప్పిన గంటవానిపల్లె చెరువు

- 600 ఎకరాల సాగు ప్రశ్నార్థకం
- వెలిగొండ ప్రారంభం నుంచి రెండుకార్లు పంటసాగు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 1: మండలంలోని గంటవానిపల్లెచెరువు జలకళ తప్పి ఒట్టిపోయింది. రెండు దశాబ్దాలుగా నీటితో నిండుకుండలా దర్శనమిస్తూ 500 ఎకరాల ఆయకట్టుకు ఈ చెరువు నీరందిస్తోంది. పరిసర బోరుభావులకు పుష్కలంగా నీరందించడంతో రైతులు రెండు కార్లు పంటలు పండించుకున్నారు. అంతేగాక మత్స్యకారులకు చేపల సాగుతో ఆర్థికాభివృద్ధికి దోహదపడింది. పైగా కొత్తూరు, గంటవానిపల్లె గ్రామాలకు చెందిన మేకలు, గొర్రెలు, పశువులు, సమీప నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు దాహార్తిని తీర్చింది. అయితే నేడు ఈ చెరువు నీరు లేక ఒట్టిపోయింది. ఓటి కుండను తలపిస్తోంది. దీంతో చెరువు పరిధిలో తొలిసారిగా కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. వివరాల్లోకి వెళితే గంటవానిపల్లె చెరువు వెలిగొండ ప్రాజెక్టుకు సమీపంలో ఉంది. దీంతో సొరంగాల నిర్మాణాలతో వచ్చే ఊట నీరు ఆ చెరువుకు మళ్లించారు. గడచిన ఇరవయ్యేళ్లుగా ఈ చెరువుకు ఊట నీరు వచ్చి చేరేది. ఎంతటి తీవ్రమైన వర్షాభావం నెలకొన్నా మండలంలోని చెరువులన్నీ ఎండినా ఈ చెరువు మాత్రం జలకళతో జీవం ఉట్టిపడుతుండేది. చెరువు ఎప్పుడూ నీటితో నిండుగా ఉండడంతో ఆయకట్టు భూములు 500ఎకరాలతో పాటు అదనంగా మరో వంద ఎకరాలకు సాగు నీరు లభించేది. ఇక ఈ ప్రాంతంలో బోరు బావులకు పుష్కలంగా నీరు వస్తుండడంతో రైతులు రెండుకార్లు, కొందరు మూడు పంటలు పండించుకున్నారు. మూగజీవాలు దాహార్తి తీర్చుకున్నాయి. మత్స్యకారులు చేపలపెంపకం చేపట్టారు. కాగా ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రాజెక్టు లో పెండింగ్ పనులు ఎన్ని ఉన్నా.. సొరంగాలు ప్రాథమికంగా పూర్తయ్యాయి. దీంతో ఇక్కడ నుంచి వస్తున్న కొద్దిపాటి ఊట నీటిని కూడా ఫీడర్ కెనాల్‌కు మళ్లించారు. దీంతో చెరువు ఒట్టిపోయి నెర్రెలు బారింది. కొన్ని నెలల వరకు బోరుబావులకు నీరొచ్చినా వర్షాభావం నెలకొంటే అడుగంటడంతో చెరువు ఆయకట్టు భూముల్లో సాగు ప్రశ్నార్థకం కానుంది. దీంతో ఈ ప్రాంతం రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రస్తుతం ఒట్టిపోయిన చెరువు


గతంలో జలకళ సంతరించుకున్న చెరువు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 1 : ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం తాను కృషి చేస్తానని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం రాచర్ల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో నెమలిదిన్నె ఈశ్వర్‌రెడ్డి, పెద్దిరెడ్డి నరేంద్రరెడ్డి, పెరుమారెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కనుమర్ల వెంకటరెడ్డి, నెమలి దిన్నె నడిపి సత్యం, పెరుమారెడ్డి నవీన్‌కుమార్ రెడ్డి, పులుగొండు రాముడు, మతకపల్లి రామ లింగారెడ్డి, తమ్మిశెట్టి సత్యం, అట్లా పాండు రంగా రెడ్డి, మొగల్ హుస్సేన్, మొగల్ ఖాశింపీరా తదితరులు పాల్గొన్నారు. బీసీ నాయకులు నల్లబోతుల శ్రీనివాసులు ఆధ్వర్యంలోనూ 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

రాచర్ల మండల పర్యటనలో భాగంగా తొలుత సత్యవోలులోని రామలింగేశ్వరస్వామి దేవాలయం నందు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యవోలులో పలువురు మహిళలతో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గిద్దలూరులో రాజకీయ ఉద్రేకతలను ప్రేరేపిస్తున్నారన్నారు. ఇటీవలే టీడీపీ నాయకుడు పాముల మునయ్యను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్ 4వేలు చేస్తామన్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు సత్యవోలు, ఒద్దులవాగుపల్లి, గుడిమెట్ట, యడవల్లి, సోమిదేవిపల్లె, పాలకవీడు, కాలువపల్లె ముత్తుముల అశోక్‌రెడ్డి పర్యటించారు. ఆయా కార్యక్రమాలలో మండల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, మండలపార్టీ నాయకులు జీవనేశ్వర్‌రెడ్డి, రెడ్డి కాశిరెడ్డి, యడవల్లి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన కార్యకర్తలతో అశోక్‌రెడ్డి


కందులపురంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

అంగరంగ వైభవంగా తిరునాళ్ల

కొనకనమిట్ల, ఏప్రిల్ 01 : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండలో లక్ష్మి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరునాళ్ల వైభవంగా జరిగాయి. ఉదయం నుండి వెంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి దర్శనార్థం భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తలనీలల ఇచ్చి క్యూలైన్లలో వెళ్లి లక్ష్మీఅలవేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకొని భక్తులు తమ తీర్చుకున్నారు. అనంతరం కొండపై వెలసిన లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకొన్నారు. గోవింద నామస్మరణలతో పుణ్యక్షేత్రం మార్మోంగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఈఓ చెన్నకేశవ రెడ్డి, చైర్మన్ తిరుపతరెడ్డి పర్యవేక్షించారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ ఆదేశాలతో పొదిలి సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలంయలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ నాలుగు ప్రాకార గోపురాల శంకుస్థాపన కార్యక్రమాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు శ్రీపతి అనంతాచార్యులు, అప్పనాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, వాస్తుహోమం, శివాలయ శుద్ధి నిర్వహించారు. అంకురార్పణ హోమం, లక్ష్మీహయగ్రీవ హోమం, గోపర కల శాలకు జలాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్టుబోర్డు చైర్మన్ కేశవరావు, ఈవో శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పెద్దదోర్నాల : మండలంలోని ఐనముక్కల గ్రామం కొండారెడ్డి కాలనీలో శ్రీ గణపతి సహిత శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ, కలశ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కాకర్ల ప్రసాద్ పర్యవేక్షణలో ప్రతిష్ఠాపకులు పండితశ్రీ సీతారామ శర్మ వేదపండితులు ప్రత్యేక పూజలు,హోమాలు, అభిషేకాలు పలు క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు హాజరై జై శ్రీరాం అంటూ భక్తిపారవశ్యంతో తిలకించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.


సీతారాములస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


చెన్నయ్య చెంత హోమాలు, పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

వైసీపీలో ఆ నలుగురూ ఓ మోసపు ముఠా..!

- వారి నీచరాజకీయాలను ప్రజలకు వాస్తవాలతో వెల్లడిస్తా
- జగన్, బాలినేని, అన్నా, కుందురులపై విమర్శలు చేసిన పెద్దిరెడ్డి


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 1 : వైసీపీ నేతలంతా ఓ మోసపు ముఠా అని, ఎమ్మెల్యే బాలినేనికి, వైసీపీకి వీర విధేయుడుగా ఉన్న తనను అన్ని విధాలుగా అణగ దొక్కారని, తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. వైఎస్. రాజశేఖర్ రెడ్డి నుంచి తాను వైఎస్సార్ కుటుంబానికి విధేయుడుగా, అభిమానిగా పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేశానన్నారు. అయితే వైసీపీలో కొనసాగిన తాను వాస్తవాలను చాలా దగ్గరగా చూశానని అన్నారు. జగన్ రెడ్డి నవరత్నాలు పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. తాను టీడీపీలో చేరడానికి, వైసీపీకి రాజీనామా చేయడానికి రెండు కారణాలు ఉన్నాయన్నారు. వంచించే నేతల మధ్య ఇమడలేక బయటకు వచ్చానని అన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటున్న బాలినేని 2009లో తాను దర్శి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తే అడ్డుకున్నారని అన్నారు. గత నాలుగేళ్ళ నుంచి మార్కాపురంలో పోరాటం చేస్తున్నానని, అక్కడ దోపిడీలు, దారుణాలు ప్రజల ముందుకు తెచ్చే ప్రయత్నం చేశానని తెలిపారు. వినుకొండ ప్రాంతం వెనుకబడి ఉండగా, దానిని అభివృద్ధి చేయాలని, మార్కాపురం జిల్లాను చేయాలని స్వపక్షంలో విపక్ష పాత్ర పోషించానని తెలిపారు. అయితే నేడు జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు హద్దులేకుండా పోయిందన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులుగా ఉన్న సమయంలో బాలినేని, ఆదిమూలపు సురేష్ పశ్చిమప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారని, వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని విమర్శించారు.

బాలినేని నీచరాజకీయాలు చేస్తారు

మాటలు రాని మౌనమునిగా ఉండే బాలినేని ఎవరిని ఎదగనివ్వడని, ఎవరైనా ఎదిగితే ఓర్చుకోలేడని పెద్దిరెడ్డి దుయ్యబట్టారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా నగరంలో ఫ్లెక్సీలు ఉంటే వాటిని తొలగించిన అహంకారి బాలినేని అని అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే సీఐ భక్తవత్సల రెడ్డిపై కేసు పెట్టి బదిలీ చేయించాలని డిమాండ్ చేశారు. నమ్ముకున్నవారిని, బంధువులను నిలువునా మోసం చేసే బాలినేని ఓటమే లక్ష్యంగా తాను పనిచేస్తానని పెద్దిరెడ్డి పేర్కొన్నారు. బాలినేని, ఆయన తనయుడు అరాచకాలు ప్రజలందరికీ తెలుసునని అన్నారు. తాను బాలినేని ఓటమే లక్ష్యంగా, దామచర్ల గెలుపు కోసం గడప గడప తిరుగుతానని తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబును భారీ మెజారిటీతో గెలిపిస్తే ఆయన డేరా బాబాగా మారాడని, నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కుందుర్రు నాగార్జున రెడ్డి, ఆయన తమ్ముడు చోటా నయీమ్‌లుగా ఆక్రమణలు, భూ దందాలు చేశారన్నారు. తన సొంత స్థలాన్ని ఆక్రమించారని, తాను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు. వైసీపీ కోసం అహర్నిశలు కష్టపడిన తనకు పార్టీలో తీరని అన్యాయం జరిగిందని, అంతే కాకుండా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇన్నాళ్ళు నమ్ముకున్న పార్టీలో ఇంత దారుణాలు జరుగుతున్నాయని, వాటిని ప్రశ్నించినందుకు తనను పార్టీ వ్యతిరేకిగా చూస్తున్నారన్నారు. అందుకే వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరానని తెలిపారు. మీడియా సమావేశంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి బొల్లినేని వాసుకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

10 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవం

గిద్దలూరు, ఏప్రిల్ 1 : మండలంలోని కెఎస్‌పల్లి గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ దేవాలయంలో ఈ నెల 10 నుంచి 14వ తేది వరకు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అంబటి బాలిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10న ప్రత్యేక పూజలు, హోమాలు, 11న హోమాలు, సాయంత్రం కులుకు భజన, 12న చెండీ హోమం, సాయంత్రం కోలాట ప్రదర్శన, 13న హంపీ పీఠాధిపతి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం కూచిపూడి, భర్తనాట్య ప్రదర్శన, 14న హంపీ పీఠాధిపతి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అంబటి బాలిరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు. 5 రోజులు భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కెఎస్‌పల్లిలోని శ్రీపోలేరమ్మ దేవాలయంలో మహాకుంబాభిషేకం సందర్భంగా బండలాగుడు పోటీలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త అంబటి బాలిరెడ్డి, నియోజకవర్గ దేవాలయాల కమిటీ కన్వీనర్ చేరెడ్డి యర్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10న రెండుపళ్ల విభాగంలో, 11న ఆరుపళ్ల విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందచేస్తామన్నారు. 12న సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో బండలాగుడు పోటీలు నిర్వహించి మొదటి విజేతకు రూ.1.20 లక్షలు, రెండవ బహుమతి 1లక్ష, 3వ బహుమతి రూ.80వేలు, 4వ బహుమతి రూ.60వేలు, 5వ బహుమతి రూ.40వేలు, 6వ బహుమతి రూ.30వేలు, 7వ బహుమతి రూ.20వేలు, 8వ బహుమతి రూ.10వేలు ఇవ్వడం జరుగుతుందని, ఎంట్రీ ఫీజులు చెల్లించి పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఉద్యోగులపై వేటు

గిద్దలూరు, ఏప్రిల్ 1 : కోడ్ ఉల్లంఘించిన 12 మందిని విధుల నుంచి తొలగించినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పత్రికలలో, సామాజిక మాధ్యమాలలో, రాజకీయ పార్టీల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని విచారణ చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎనిమిది మంది వలంటీర్లను, ముగ్గురు చౌకడిపో డీలర్లను, మధ్యాహ్న భోజన పథకం కార్మికుడిని విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై మరిన్ని ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కూడా విచారించి సంబంధిత అధికారుల నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

జగన్ స్వార్థంతోనే నిలిచిన పింఛన్ల పంపిణీ

- పింఛన్ల డబ్బులను సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు
- వై.పాలెం టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, ఏప్రిల్ 1: సీఎం జగన్ స్వార్థంతోనే అవ్వాతాతల పింఛన్లు సకాలంలో ఇవ్వకుండా ఫించన్ల డబ్బులు స్వంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని వై.పాలెం నియోజకవర్గ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు ధ్వజమెత్తారు. సోమవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డి టీడీపీపైనా నిందలు వేసి ఎన్నికల్లో తీవ్ర లబ్ధిపొందేందుకు ప్రయత్నం చేస్తున్నార న్నారు. ఎన్నికల కమిషన్ వెంటనే జోక్యం చేసుకొని రాష్ట్రంలోని 1.32 లక్షల మంది సచివాలయ సిబ్బందితో ఇంటింటికి ఫించన్లు పంపిణీ చేయించాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే అవ్వాతాతలకు ఇంటింటికి వెళ్లి రూ.4 వేల పింఛన్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య,వేగినాటి శ్రీను,మంత్రు నాయక్, ఆదిరెడ్డి,సత్య నారాయణగౌడ్, చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధం

- టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి


మాట్లాడుతున్న కందుల రామిరెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 1: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను గద్దె దించేందుకు జనం సిద్ధమయ్యారని టీడీపీ పోల్‌మనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాగళం బహిరంగ సభకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరైన మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బ్రహ్మరథం పట్టారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం పింఛన్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. దానికి టీడీపీపై నెపం మోపి కాలవెళ్లబుచ్చుతున్నారన్నారు. ఉత్తుత్తి బటన్లు నొక్కిన సీఎం జగన్ సొంతపార్టీ కాంట్రాక్టర్లకు రూ.13 వేల కోట్లు అక్రమ మార్గాల ద్వారా కట్టబెట్టారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి ఉంటే 1.35 లక్షల సచివాలయ సిబ్బందితో పింఛన్లు ఇంటింటికీ పంపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలీ, కొప్పుల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కనిగిరి బాల వెంకట రమణ, పఠాన్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని బోడపాడు గ్రామ ఎంపీపీ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు గంగిరెడ్డి అనూషారెడ్డి, గోగిరెడ్డి సింధులు నవోదయకు ఎంపికయ్యారు. పాఠశాల ఉపాధ్యాయుడు పిక్కిలి శ్రీనివాసులు ఐదో తరగతి విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకోసం ప్రత్యేక దృష్టి సారించి ఉచితంగా మెలకువలు నేర్పించి విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. నవోదయ పాఠశాలకు ఎంపిక అయ్యేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులును ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సురేఖ అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు లు శ్రీనివాసులు మాట్లాడుతూ. నవోదయ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను మిగిలిన విద్యార్థులకు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూలక్ష్మి, సహాయకులు హనుమంతు, విద్యార్థుల తల్లిదండ్రులు గంగిరెడ్డి మల్లికార్జునరెడ్డి , సుబ్బలక్ష్మీ, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న అధికారులు

వెలిగండ్ల, ఏప్రిల్ 1 : లక్షలు విలువచేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు రియల్టర్లు రాత్రికి రాత్రి చదును చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రిజిస్టర్ భూమిలో వెంచర్ వేశారు. ఆ వెంచర్ లోకి వెళ్లడానికి దారి కోసం ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 349-2లో ఉన్న ప్రభుత్వ భూమిని దానిలో గతంలో కలుపుకున్నారు అప్పుడు కూడా రెవెన్యూ అధికారులు రాళ్లు తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అదును కోసం ఎదురు చుస్తున్న రియల్టర్లు ఆదివారం సాయంత్రం జన సంచారం లేని సమయంలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి వెంచర్‌లోకి వెళ్లేందుకు రోడ్డు వేశారు. స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడకు వచ్చేలోపు రియల్టర్‌లు పారిపోయారు. సోమవారం తహసీల్దార్ డానియేలు, ఎస్‌ఐ శివ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి రోడ్డు కోసం వేసిన కంకరను తొలగించి, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

వడగాడ్పులపై జాగ్రత్త

కనిగిరి, ఏప్రిల్ 1 : వేసవిలో వడగాడ్పులు వీచే సమయంలో విద్యార్థులు జాగ్రత్తలు వహించాలని జేవీవీ నాయకులు కే వెంకటేశ్వర్లు అన్నారు. చింతలపాలెం హైస్కూల్‌లో వేసవి జాగ్రత్తలపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎండలు, వడగాడ్పులు ఎక్కువగా ఉంటాయని విపత్తుల శాఖ ఇప్పటికే హెచ్చరించిందని వెంకటేశ్వర్లు తెలిపారు. వడదెబ్బకు గురైతే తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గుడ్‌హెల్ప్ రమేష్, హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శిలో టీడీపీ దూకుడు

» భారీగా మద్దతు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు » పనిచేయలేమంటూ మద్దిశెట్టికి తేల్చి చెప్పిన అనుచరులు
» కౌన్సిలర్లతోపాటు మండల నేతలు టీడీపీ వైపు

(ఆంధ్రజ్యోతి ఒంగోలు)

దర్శి నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వలసలు జరగబోతున్నాయి. సోమవారం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనుచరులు వైసీపీకి మద్దతు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికే మద్దతు ఇస్తామని ప్రకటించినట్లు తెలిసింది. అంతేగాక నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన వైసీపీలో ఉన్న అసంతృప్తవాదులంతా గొట్టిపాటి లక్ష్మి భర్త అనంత్‌కు టచ్‌లోకి రావడం విశేషం. కొందరు కౌన్సిలర్లు కూడా వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరబోతున్నారు. వివిధరకాల పరిణామాల అనంతరం దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచిటీడీపీ అభ్యర్థిని రంగంలోకి దించిన విషయం తెలిసిందే. దివంగత నేత గొట్టిపాటి నరసయ్య కుమార్తె డాక్టర్ లక్ష్మి అభ్యర్థి కావడంతో టీడీపీ, బీజేపీ, జనసేనలో జోష్ పెరిగింది. నిన్నమొన్నటి వరకూ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అనుచరులు ఏదో పార్టీ నుంచి ఆయన నరంగంలోకి వస్తారని ఎదురుచూశారు. టీడీపీ అభ్యర్థిగా లక్ష్మి రంగంలోకి రావడంతో ఎమ్మెల్యే వేణుగోపాల్ ఈ పర్యాయం ఎన్నికలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే సోదరుడు శ్రీధర్ దర్శి వెళ్లారు. వారి గృహంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా అనుచరులంతా తాము వైసీపీకి మద్దతు ఇవ్వలేమని, టీడీపీ అభ్యర్థికే మద్దతు ఇవ్వాలని భావిస్తున్నామని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన కూడా మీ ఇష్టం అంటూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇప్పటికి అందిన సమాచారం మేరకు.. దర్శి నగర పంచాయతీ పరిధిలోని మద్దిశెట్టి అనుచరులలోని సాంబయ్య అనే నేత మినహా నియోజకవర్గం మొత్తంలో ఆయన అనుచర వర్గం దూరంగా ఉంది. వారిలో కౌన్సిలర్‌తోపాటు ఆయా మండలాల కీలక నేతలు పలువురు టీడీపీ అభ్యర్థి భర్తకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. సోమవారం దర్శిలో టీడీపీ, జనసేన, బీజేపీ పరిచయ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కుమారుడు రాఘవరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ పాల్గొన్నారు. మూడు పార్టీల వారు హాజరు కావడం విశేషం. మాజీ ఎమ్మెల్యే పాపారావుతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

చంద్రబాబు రాక

దర్శి నియోజకవర్గంలో ప్రజాగళం సభలో పాల్గొనేందుకు చంద్రబాబు రానున్నారు. ఆ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని దర్శి, చీరాలలో తన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని బాబు సూచించినట్లు తెలిసింది. ఈ నెల 7వ తేదీన చంద్రబాబు పర్యటన ఖరారయ్యే అవకాశముందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

వైభవంగా శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 1 : దర్శి పట్టణంలో శ్రీ సువర్చలా సమేతా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విఘ్నేశ్వరపూజ, అభిషేకం, లక్షతమలార్చన మహానైవేద్య సమర్పణ తదితర పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నారపుశెట్టి పాపారావు, జిల్లా టీడీపీ తెలుగు యువత నాయకుడు మాగుంట రాఘవరెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా దర్శి పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం వద్ద క్యూలైన్లు కిటకిటలాడాయి. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రిపూట భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రాజకీయ పార్టీలు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయలేదు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.


స్వామికి ఆకు పూజ చేస్తున్న అర్చకులు

నీటి సమస్యను పరిష్కరించిన టీడీపీ నేత



నీటిని అందిస్తున్న టీడీపీ నాయకుడు

దొనకొండ, ఏప్రిల్ 1 : మండలంలోని పెద్దన్నపాలెం పంచాయతీ పరిధిలోని నరసింహనాయునిపాలెం గ్రామ ప్రజల దాహార్తి సమస్యను గ్రామ తెలుగుదేశం పార్టీ యువనాయకుడు శృంగారపు నాగసుబ్బారెడ్డి పరిష్కారంకు సోమవారం శ్రీకారం పలికారు. నరసింహనాయునిపాలెం, ఎస్సీ కాలనీలో బోర్లు అడుగంటి నీటి సమస్య తీవ్రతరమై ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ టీడీపీ నాయకుడు శృంగారపు నాగసుబ్బారెడ్డి తన సొంత నిధులతో ట్యాంకర్ కొనుగోలు చేసి తన ట్రాక్టర్‌తో వ్యవసాయ పొలం నుంచి నీళ్లు తెప్పించి ప్రజలకు అందించే కార్యక్రమం చేపట్టారు. ప్రజల దాహార్తి సమస్యను దాతృత్వంతో పరిష్కరించిన నాగసుబ్బారెడ్డి సేవలను టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నాయకులు నిమ్మకాయల సుబ్బారెడ్డి, కమ్మా నారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, పోతిపోగు చెన్నయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, వల్లపునేని కేశవ, గ్రామస్తులు అభినందించారు. పెద్దన్నపాలెం పంచాయతీలోని పెద్దన్నపాలెం, నరసింహనాయునిపాలెం, ఎస్సీ కాలనీల్లోని ప్రజలకు నీటి సమస్య లేకుండా ప్రతిరోజు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని నాగసుబ్బారెడ్డి వివరించారు.

అక్రమ మద్యం పట్టివేత ఇద్దరు అరెస్టు

పామూరు, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన బార్డర్ చెక్ పోస్టు నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి నుంచి 46 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సోమవారం తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎస్‌ఐ ఎం.సైదుబాబుతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయడంతో 46 బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.1.46 లక్షలు పట్టివేత

ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం చెక్ పోస్టు వద్ద సోమవారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా నరసరావుపేటకు చెందిన పీ శ్రీనివాసరావు, మరో ఇద్దరి వద్ద రూ 1.46 లక్షలు పట్టుబడినట్టు ఎస్‌ఐ పీ అంజనేయులు తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేసేటప్పుడు సంబంధిత డబ్బు వివరాలు సక్రమంగా తెలపక పోవటం వల్ల సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ అంకారావు, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు

పీసీపల్లి, ఏప్రిల్ 1 : ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని తలకొండపాడు, ముద్దపాడు గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ టి.రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రచారానికి ముందస్తు అనుమతి తీసుకోవాలి

దర్శి, ఏప్రిల్ 1 : రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. ఈఆర్‌వో కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని ఈఆర్వో తెలిపారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు

తాళ్లూరు, ఏప్రిల్ 1: ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఉత్తర్వులు అమలు చేయడంలో బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీవో, డీపీవో టి.ఉషారాణి గ్రామ కార్యదర్శులను హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యుత్ బకాయిల చెల్లింపులపై పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చినా కొందరు కార్యదర్శులు పరిశీంచక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ బకాయిల సమాచారం చెప్పక పోవటంపై బొద్దికూరపాడు, బెల్లంకొండవారిపాలెం, మల్కాపురం కార్యదర్శులను మందలించారు. అనంతరం బొద్దికూరపాడు సచివాలయాలన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.యుగకీర్తి, ఈవోఆర్డీ కెజెఎస్‌రాజు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ జట్టుకు శ్రీసరస్వతి విద్యార్థి

తాళ్లూరు, ఏప్రిల్ 1: జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో అండర్-14 విభాగంలో తాళ్లూరు శ్రీసరస్వతి హైస్కూల్ విద్యార్థి జి.ప్రజ్వల్ ఎంపికయ్యాడు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీల్లో శ్రీసరస్వతి విద్యార్థులు రన్నర్స్‌గా విజయం సాధించారు. ఈ జట్టులో జి.ప్రజ్వల్ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. శ్రీ సరస్వతి చైర్మన్ ఏవీ రమణారెడ్డి, హెచ్‌ఎం వి.శ్రీరామమూర్తి, పీఈటీ వికాస్ ప్రజ్వల్‌ను అభినందించారు.

టీడీపీ అభ్యర్థి లక్ష్మిని కలిసిన నేతలు


డాక్టర్ లక్ష్మిని కలిసిన నాయకులు

దొనకొండ, ఏప్రిల్ 1 : దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని టీడీపీ మండల నాయకులు వీరపనేని వెంకన్న చౌదరి నేతృత్వంలో నాయకులు సోమవారం నరసరావుపేట వెళ్లి వెంకటేశ్వరస్వామి చిత్రపటం ఆమెకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, మాజీ ఎంపీపీ నూనె విజయకుమారి, సీనియర్ నాయకులు దుగ్గెంపూడి కాశయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, తోటా వెంకటేశ్వర్లు, షేక్ ముసామియా, వల్లపునేని ఆదినారాయణ, యేగినాటి అల్లూరయ్య, కామేపల్లి నారాయణమ్మ, షేక్ సుభాని, శ్రీరాం యోహన్, జలసూత్రం శ్రీను, ఫణిదపు అనంతరాములు మరికొందరు డాక్టర్ లక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ త్వరలో అన్ని గ్రామాలకు వచ్చి నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలుస్తానని, టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ముండ్లమూరు : టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ముండ్లమూరు సర్పంచ్ ఒద్దిపోగు ఆదిలక్ష్మి గురవయ్యతో పాటు వీరపనేని నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, వెంకటరావు, నవులూరి శ్రీనివాసరావు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

టీడీపీ అభ్యర్థి విజయానికి సైనికుల్లా పనిచేయండి


మండల నాయకులతో రమేష్

దొనకొండ, ఏప్రిల్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కడియాల రమేష్ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి డాక్టర్ లక్ష్మి పరిచయ కార్యక్రమం ఈనెల 4వ తేదీన దర్శిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు రావాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఎన్నికల నేపథ్యంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావుతో రమేష్ చర్చించారు. మండలంలో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు సొంత నిధులతో ట్యాంకర్లను ఏర్పాటు చేశారని తెలిపారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమైందని, ప్రజలు ఆ పార్టీపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. టీడీపీకి మంచి మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునాథరెడ్డి, దుగ్గెంపూడి చెంచయ్య, కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తౌహీద్, విప్పర్ల లక్ష్మీరావు, కమ్మా వెంకటనారాయణ, వల్లపునేని కేశవ, పోతిపోగు చెన్నయ్య, కుందుర్తి లక్ష్మణ్‌సీతాపతి, పరుచూరి రామలింగయ్య పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న పాపారావు

దర్శి, ఏప్రిల్ 1 : టీడీపీ కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు సూచించారు. పీటీఎస్ కల్యాణ మండపంలో దర్శి టీడీపీ నాయకుల, కార్యకర్తల పరిచయ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మి భర్త డా క్టర్ లలిత్‌సాగర్ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థ సేవలందించేందుకే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. జిల్లా తెలుగు యువత నాయకుడు మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంటేశ్వర్లు, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు అంకయ్య, రూబినేని రామారావు, టీడీపీ నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, వెంకట్రామయ్య, నగరపంచాయతీ కౌన్సిలర్ వీసీరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెన్షన్లతో వైసీపీ ఓట్లాట

వెలిగండ్ల, ఏప్రిల్ 1 : ఎన్నికల వేళ పెన్షన్‌పై వైసీపీ పాలకులు రాజకీయం చేస్తున్నారని నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక పింఛన్‌ల బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించాలన్నది కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం. ఇందులో టీడీపీ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. అయినా ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడంతోనే ఈసీ ఈ చర్య తీసుకుందని ప్రజలను నమ్మించి ఓట్లు దండుకోవడానికి వైసీపీ ప్రయత్నిస్తోంది. ఈనెల పింఛన్ ఇచ్చేందుకు 10 రోజులు పడుతుందని వైసీపీయే ప్రచారం చేస్తోంది. పింఛన్ వలంటీర్లు ఇస్తే వైసీపీ ఇచ్చిందని చెప్పుకోవచ్చని భావించిన నేతలు వలంటీర్లను విధుల నుంచి తప్పించడంవల్లే పింఛన్ ఇవ్వలేకపోతున్నామని, దీనికి టీడీపీయే కారణమని తప్పుడు ప్రచారం చేస్తోంది. వైసీపీ దుష్ప్రచారాన్ని టీడీపీ శ్రేణులు ప్రజలకు వివరించాలి. వెంటనే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్‌ను పంపిణీ చేయాలని ఆ ప్రకటలో విజ్ఞప్తి చేశారు.

దూబగుంట ఎంపీటీసీ సభ్యుడు మృతి


బ్రహ్మానందరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పామూరు, ఏప్రిల్ 1 : మండలంలోని దూబగుంట ఎంపీటీసీ సభ్యుడు కోరే బ్రహ్మానందారెడ్డి (69) అనారోగ్యంతో ఆదివారం రాత్రి బెంగళూరులో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని దూబగుంట పంచాయతీ వెంకటాపురానికి తీసుకొచ్చారు. టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు, టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మండ్లా రమణయ్య, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గుత్తి మహేష్ లు మృత దేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం బ్రహ్మారెడ్డి దహన సంస్కారాలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీడీపీలోకి వలసల వెల్లువ

» రోజురోజుకూ వైసీపీని వీడుతున్న గ్రామాలకు గ్రామాలు
» డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన పీసీపల్లి, సీఎస్‌పురం వాసులు


వైసీపీని వీడి టీడీపీలో చేరిన పామూరు మండల ముస్లింలు, గోగులపల్లి గ్రామస్థులు

కనిగిరి, ఏప్రిల్ 1: కనిగిరి తెలుగుదేశం పార్టీలో రోజురోజుకూ వలసల వెల్లువ కొనసాగుతూనే ఉంది. వైసీపీని వీడి గ్రామాలకు గ్రామాలు అభ్యర్థి డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరుతున్నారు. నియోజకవర్గంలోని పామూరు మండలానికి చెందిన 35 ముస్లిం కుటుంబాలు, సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లి ఆరేపల్లికి చెందిన 20 కుటుంబాలు, పీసీపల్లి మండలంలోని మద్దపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు పెద్దఎత్తున వైసీపీని వీడి సోమవారం చేరారు. ఉగ్ర వారికి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉగ్ర మాట్లాడుతూ ముస్లింలకు టీడీపీ సహకారం ఉంటుందన్నారు. బీజేపీతో పొత్తును జీర్ణించుకోలేని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఆ మాటలను ముస్లింపులు నమ్మవద్దన్నారు. అధికారంలోకి వస్తే ఇంటి వద్దకే రూ.4వేలు పింఛన్ అందిస్తామన్నారు. పింఛన్, ఆసరా, చేయూత, విద్యా దీవెన, ఈబీసీ నేస్తం, ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులను మార్చి 16 నుంచి 30లోపు రూ.13వేల కోట్ల రూపాయలను కోడ్‌కు విరుద్ధంగా జగన్‌రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు చెల్లించారన్నారు. సచివాలయ సిబ్బందితో వృద్ధులకు పింఛన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పామూరు, పీసీపల్లి, సీఎస్‌పురం నాయకులు పాల్గొన్నారు.

ఉగ్ర సమక్షంలో చేరిన గోగులపల్లి గ్రామస్థులు

పామూరు, (సీఎస్‌పురం) : మండలంలోని పెద్దగోగులపల్లి, పంచాయతీ పరిధిలోని ఆరెపాలెం, హరిజనవాడలో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ అభ్యర్థి ఉగ్ర సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. చేరిన వారందరినీ కండువాలు కప్పి ఉగ్ర ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారిలో 3వ వార్డు సభ్యుడు గంగాల ధనలక్ష్మి, వార్డు మాజీ సభ్యుడు కనపర్తి లక్ష్మి, దిరిశనల పెద్ద గురవయ్య, లక్ష్మయ్య, నారాయణ, కేరామయ్య, గురవయ్య, కనపర్తి నారాయణ,అంకయ్య, పెద్దక్క, జ్యోతి, వెంగమ్మ, లక్ష్మి, అం జమ్మ, సుమలత, నారాయణమ్మ, బాలయ్య, శివయ్య, చేరిన వారిలో ఉన్నారు. కాగా మం డలంలోని పెద్ద గోగులపల్లి, వెంగనగుంట, కే అగ్రహారం, ఆర్కేపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్‌సీ చినమాలకొండయ్య, పునుగుపాటి రవికుమార్, రామకృష్ణంరాజు, వెంకటాద్రి, వెంకటకొండయ్య, గోగులపల్లి గ్రా మ పార్టీ అధ్యక్షుడు నారాయణ, గల్లా చెన్న య్య, చావా సుబ్బయ్య, శేఖర్, ఓం శివయ్య, తిరుపతిరెడ్డి, మల్లికార్జున, పాల్గొన్నారు.

రూ.1200కోట్లతో అభివృద్ధి పనులు చేశా

» టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
» కనిగిరి ప్రగతి కోసం నరసింహుడు రావాలి
» కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి
» చాకిరాలలో రచ్చబండ » వైసీపీని వీడిన 170 కుటుంబాలు


రచ్చబండలో పార్టీలో చేరిన వారితో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 1 : తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో తాగునీటి కోసం రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చాకిరాల గ్రామంలో సోమవారం రాత్రి ఇంటింటి ప్రచారం అనంతరం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడారు. 2009లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేవలం తాగునీటికే రూ.350 కోట్లు కేటాయించి 550 గ్రామాలకు సరఫరా చేయించానన్నారు. సాగర్ కుడి కాలువను కనిగిరికి తెప్పించలేని అసమర్థులు వైసీపీ పాలకులన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక నిమ్జ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాడుతోనే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. చేతగాని పాలకులు, కబ్జాదారులను గెలిపిస్తే కనిగిరి కనుమరుగేనని ఉగ్ర అన్నారు. ప్రజలంతా ఆలోచించి టీడీపీకి ఓటు వేయాలని ఉగ్ర అభ్యర్థించారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటిస్థలం, కొళాయిలు మంజూరు చేస్తానన్నారు. వసతుల కల్పనలో కేటీఆర్‌కు, చాకిరాల గ్రామస్థులందరికీ తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. చాకిరాల అంటేనే పొగాకు సాగుకు ప్రత్యేకం అన్నారు. కానీ వైసీపీ పాలనలో పొగాకుకు గి ట్టుబాటు ధరలు కూడా కల్పించలే దన్నారు. తన హయాంలో పొగాకు మార్కెట్ యార్డ్‌ను ఏర్పాటు చేశానన్నారు. కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కుందూరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం అభివృద్ధి జరగాలంటే డాక్టర్ ఉగ్ర నరసింహుడు రావాలన్నారు. ప్రజలంద రూ ఉగ్రను గెలిపించుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు ఆగిన పనులు కూడా పూర్తి చేయలేని చేతగానివారు వైసీపీ నేతలన్నారు. పాలనాదక్షత, సేవాగుణం ఉన్న ఉగ్రకు మద్దతుతిచ్చి ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వా ములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఉగ్ర ఓటేస్తే తనకు ఓట్లేసినట్లేనని తిరుపతి రెడ్డి అన్నారు. తొలుత గ్రామ మహిళలు డాక్టర్ ఉగ్రకు హారతులు ఇచ్చి మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈసారి మా ఓటు మీకే నంటూ ప్రతిన బూనారు. కార్యక్రమంలో నాయకులు భేరి పుల్లారెడ్డి, కనిగిరి మండల క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, నారాయణ, మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వైసీపీని వీడి 170 కుటుంబాల టీడీపీలో చేరగా, వారికి కండువాలు కప్పి డాక్టర్ ఉగ్ర ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ అజెండా


చింతలపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రేణులు

» కనిగిరి, హనుమంతునిపాడులో శ్రేణుల ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 1: ప్రజా సంక్షేమమే టీడీపీ ప్రధాన అజెండా అని టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి అన్నారు. సూపర్‌సిక్స్ ప్రచారంలో భాగంగా టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర ఆదేశాలతో పట్టణ సమీపంలోని చింతలపాలెంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసంక్షేమంతో పాలన సాగించాలంటే పాలనా దక్షుడైన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో పథకాలు పేపర్లలో, ప్రచారానికే పరిమితమయ్యాయి తప్ప ఆచరణలో కాలేదన్నారు. అభివృద్ధి అంతా అబద్ధమన్నారు. జగన్‌రెడ్డి పాలనలో పేదలు, మధ్యతరగతి వర్గాలు ఆర్థికంగా చితికిపోయాయన్నారు. ఓటు పవర్ ఏంటో ఎన్నికల్లో చూపించి వైసీపీకి షాక్‌ను ఇవ్వాలన్నారు. డాక్టర్ ఉగ్రతోనే కనిగిరి అభివృద్ధి, ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ యువత అధ్యక్షుడు షేక్ పిరోజ్, అఫ్మా ద్, పెన్నా చిననాగయ్యయాదవ్, ఏనుగు శ్రీనివాసులరెడ్డి, బ్రాక్, తెలుగు మహిళలు మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, శ్రీలత, స్వప్న, దొరసాని, వెంకటలక్ష్మమ్మ, నీ రజ, అమ్మలమ్మ, సౌభాగ్యం, ధనలక్ష్మీ, నారాయణమ్మ, కరిమున్నాసా పాల్గొన్నారు.

వాలిచర్ల గ్రామంలో ..

మండలంలోని వాలిచర్ల గ్రామంలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మాట్లాడుతూ కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు తపించే ఉగ్రను గెలిపించాలని కోరారు. ఉగ్ర గెలవగానే ఇంటింటికీ తాగునీరిస్తారన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ మాజీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, నాయకులు గాయం రామిరెడ్డి, రఘునాథ కాశిరెడ్డి, నరసయ్య, ఉడుముల సుబ్బారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, బసవయ్య, కత్తి దానియేలు, కత్తి సాల్మన్, మోజెస్, డేవిడ్, నాగురాము, జాషువా పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్ర భవిష్యత్


పామూరు : వైసీపీ పాలనతో అధ్వానంగా తయారైన రాష్ట్ర భవిషత్తు తిరిగి గాడిలో పడాలంటే చంద్రబాబు పాలనతోనే సాధ్యం అవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నుచ్చుపొద గ్రామంలో బాబ ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ. మహిళా శక్తి పథకాలను ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర తనయుడు జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉగ్రను అఖండ మెజార్టీతో గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, గ్రామపార్టీ అధ్యక్షుడు ఆరేకొండా హరిప్రసాద్, ఖాజారహంతుల్లా, కొలూరి హనీఫ్, వెంకట్‌చౌదరి, వార్డు మెంబర్ రామకృష్ణ, నారాయణ, నరసింహారావు, సూర్య పాల్గొన్నారు.

టీడీపీదే విజయం

పీసీపల్లి : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి తప్పకుండా అధికారంలోకి వస్తుందని టీడీపీ మండల నాయకులు అన్నారు. మిట్టపల్లి బూత్ పరిధిలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఓబుల్‌రెడ్డి, బల్లయ్య, మాచర్ల, నానిబాబు, గంగయ్య, ప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్లస్టర్‌లవారీగా పింఛన్లు పంపిణీ చేయాలి

పీసీపల్లి, ఏప్రిల్ 1 : ఈనెల 3వ తేదీ నుంచి క్లస్టర్లవారీగా పింఛన్‌లను పంపిణీ చేయాలని ఎంపీడీవో వెంకట సుబ్బారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ క్లస్టర్‌లుగా విభజించుకుని ఏరోజు ఏ క్లస్టర్ పరిధిలో పింఛన్లు పంపిణీ చేస్తారో ముందుగా లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. సచివాలయానికి వచ్చే లబ్ధిదారులకు మజ్జిగ, మంచినీళ్లు అందించాలని ఆయన కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఈవోఆర్డీ మల్లేశ్వరి, కార్యదర్శులు ఉన్నారు.





పన్ను బాదుడు

- పుర పౌరులపై ఆస్తి పన్ను భారం
- వరుసగా నాల్గవసారి పెరగనున్న వైనం
- పెరిగిన పన్ను అమలులోకి..
- మూడు జిల్లాల్లో ఆస్తి పన్ను భారం రూ.50 కోట్లు పైమాటే
- పన్ను చెల్లింపు దారుల నుంచి తీవ్ర వ్యతిరేకత





తాను అధికారంలోకి వస్తే అన్నీ పెంచుకుంటూ పోతానని ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ అన్నారు. ఏ సంక్షేమ పథకాలో.. అభివృద్ధి పనులో అని ప్రజలు భావించారు. తీరా చూస్తే బస్సు.. కరెంటు ఛార్జీలను ఐదేళ్ల పాటు పెంచుకుంటూ పోయారు. ఆస్తి పన్ను, భూముల విలువ పెంచేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చెత్తపన్ను వసూలు చేశారు. ఆఖరికి ఖాళీ స్థలాల పైనా పన్ను వేసి జనాల నడ్డి విరగ్గొట్టారు. పెంచుకుంటూ పోతానంటూ ఆయన ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన మాటల్లో ఇంత అర్థం దాగి ఉందా అని పట్టణ వాసులు వాపోతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం పుర పౌరులపై మరోసారి ఆర్థిక భారం మోపింది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోయింది. ఉన్న పన్నును 15శాతం పెంచేసింది. వరుసగా నాల్గవ ఏడాది పెంచింది. పెంచిన ఆస్తి పన్ను సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తి పన్ను పెంపుదలపై పట్టణ వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే పాలకులే కరువయ్యారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.50 కోట్ల ఆస్తి పన్ను భారం పడింది.

ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వ తీరు తగ్గేదేలే అన్న రీతిన జగన్ సర్కార్ వ్యవహరిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మునిసిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఆస్తి మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నును విధిస్తోంది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా ఆస్తి పన్ను ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అద్దె విలువ, మునిసిపాల్టీలో జోన్‌ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునే వారు. మునిసిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్‌ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనంకు మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, ఒక వేళ భవనం చుట్టు ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధిస్తున్నారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయ వచ్చో మునిసిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియ జేస్తోంది.

- ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతోంది. క్యాపిటల్ వాల్యూ ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తు న్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15శాతం పన్ను పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానం అయ్యేవరకు పన్ను ఆ మాదిరిగా పెరుగుతూనే ఉంటుంది. రూ.100 ఉన్న పన్ను రూ.115కు పెరగనుంది.

ఈ పన్నుల బాదుడు మునిసిపాల్టీలో ఆరంభమే కాని అంతం కాదని చెప్పవచ్చు. ఉదాహరణకు నరసరావుపేట మునిసిపా ల్టీలో పన్ను డిమాండ్ సుమారు రూ.8.59 కోట్లు దీని ప్రకారం 15శాతం పన్ను పెరగడంతో ఈ మునిసిపాల్టీ ఆదాయం దాదాపు మరో రూ.1.28 కోట్లు వరకు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని అన్ని పురపాలక సంఘాలు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.35 కోట్లకు పైగా ఆస్తి పన్ను భారం ప్రజలపై భారం పడనున్నట్లు గణాంకాలు తెలియ జేస్తున్నాయి. పన్నులు తగ్గించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోక పోతుండటంతో ప్రభుత్వంపై పన్ను దారులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.



- ఓ వ్యక్తి తన ఇంటికి ఏటా రూ.690 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా నాల్గవ ఏడాది అస్తి పన్ను పెరుగుతోంది. ఇలా పెంచిన పన్నుతో రూ.690 పన్ను కాస్తా రూ.1210కి పెరిగింది. అంటే నాలుగేళ్లలో రూ.520 పన్ను పెరిగింది. పన్ను పెంపుదలతో పాటు చెత్త పన్ను భారం కూడా జనాలపై వేస్తున్నారు. ఒక్కో ఇంటికి నెలకు 60 చొప్పున సంవత్సరానికి రూ.720 చెత్తకు పన్ను వసూలు చేస్తున్న ఘనత జగనన్న సర్కార్‌కే దక్కడటం విశేషం. మధ్య తరగతి వర్గాలపై ప్రభుత్వం పన్నుల రూపంలో మోయలేని ఆర్థిక భారాన్ని మోపడంలో జగనన్న రికార్డు సృష్టించాడని చెప్పవచ్చు.

ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు..



చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడలేకే మేము ఆందోళన చేపట్టాం. వేతనాలు పెరగడం మాటేమోగాని వచ్చే వేతనం కూడా ఆగిపోయింది. సమ్మెకాలానికి సంబంధించి 42 రోజుల జీతం ఆగిపోవడంతో మేమేం చేయాలి. మా కష్టాలు మరింత పెరిగాయి. ఆర్థికంగా చితికిపోతున్నాం.

- రేఖ, బాపట్ల జిల్లా కార్యదర్శి

- తిరిగి విధుల్లో చేరి రెండు నెలలైనా అందని జీతాలు

సమ్మె కాలానికి వేతనమేది?

- సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన ఉద్యోగులు
- నలభై రోజులకు పైగా సాగిన ఉద్యోగుల పోరాటం
- బెదిరించి, భయపెట్టి ఆందోళనను అడ్డుకున్న ప్రభుత్వం
- తొలగింపు ఆదేశాలతో ఉద్యమంపై ఉక్కుపాదం
- జీతాలు కూడా రాకపోవడంతో నిరాశలో ఉద్యోగులు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్వాడీ ఉద్యోగులకు సమస్యల పరిష్కారం మాటెలా వున్నా వేతనాలు కూడా దక్కని పరిస్థితి వచ్చి పడింది. సమ్మె విరమించి ఇప్పటికి రెండునెలలు పూర్తయినా సమ్మెకాలానికి సంబంధించి వారికి రావాల్సిన వేతనాలు ఈరోజు వరకూ వారికి దక్కలేదు. ఇదుగో.. అదిగో అంటూ రెండు నెలలుగా నెట్టుకొచ్చిన ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వలేక పోయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వారికి వేతనాలు వస్తాయా? రావా? అన్న ఆందోళనలో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు.

సమస్యల మాటేమోగానీ..

అంగన్వాడీ కేంద్రాలను ఏళ్లకేళ్లుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారం కోసం, కనీస వేతనాల కోసం అంగన్వాడీ ఉద్యోగులు కిందటేడాది డిసెంబరు 8న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో దాన్ని డిసెంబరు 12 వరకూ వాయిదా వేసుకున్నారు. చర్చల్లో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో డిసెంబరు 12న సమ్మెకు దిగారు. ఆరోజు నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకూ ప్రభుత్వం, అధికారులు ఎన్ని రకాలుగా భయపెట్టినా, బెదిరించినా, ఎస్మా ప్రయోగించినా వెరువక 42రోజులపాటు సమ్మె చేశారు. ఉద్యమ క్రమంలో చర్చల పేరుతో ఉద్యోగులను పిలిచినా ఒక్క సమస్యపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో ఉద్యమం అంతకంతకూ పెరిగిపోయింది. ఉద్యోగులు ఎంతకీ లొంగి రాకపోవడంతో ప్రభుత్వం ఉద్యోగుల తొలగింపుకు ఆదేశాలు జారీ చేసింది. వాటిని కూడా ఉద్యోగులు లెక్క చేయక తమ ఆందోళనను కొనసాగించారు. ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇళ్లకే పంపించారు. దీంతో ఉద్యోగులు అర్థంతరంగా తమ ఆందోళనను విరమించాల్సి వచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం మరోమారు చర్చలకని పిలిచినా 2024 జూన్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పింది. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న హామీ లభించడం మినహా ఉద్యోగులకు ఏ ఒక్క హామీ కూడా దక్కలేదు. కానీ ఇప్పుడు ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

రెండు నెలలుగా సాచివేత

అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు దాటిపోయింది. ఈ ఏడాది జనవరి 23న వారు సమ్మె విరమించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ వారికి సమ్మెకాలం 42 రోజులకు సంబంధించిన వేతనం మాత్రం దక్కలేదు. వేతనం మీదే ఆధారపడే చిరుద్యోగులు కావడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం 14,500 కంటే మూడు వేలు తక్కువ జీతం, నెలకు 11,500తో సరి పుచ్చుకుంటున్న వారికి 42 రోజుల జీతం ఆగిపోవడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులయింది. జీతాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. ఇదిలా కొనసాగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి జీతాలు ఎప్పుడు అందుతాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

రెండు నెలలైనా జీతాలు రాలేదు:

సమ్మె విరమణ చేసి రెండు నెలలైనా ఇప్పటి వరకూ జీతాలు పడలేదు. ప్రభుత్వం ఎంతో నమ్మకంగా సమ్మెకాలానికి జీతాలు ఇస్తామని చెప్పింది. అవేవీ ఇవ్వకుండానే రెండు నెలలు కాలం గడిపేసింది. ఇది కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని మాకు అనుమానం కలుగుతోంది.



- దీప్తి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల కోడ్ వచ్చాక జీతాలు పడతాయా?:

ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఇక జీతాలు వస్తాయా అనేది అనుమానమే! ప్రభుత్వం ముందుగానే అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలు ఇవ్వాలి. కావాలనే ఎన్నికల కోడ్ వరకూ తాత్సారం చేసింది.



మెటిల్డా, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు

ఆమంచిపై వేటు?



- నేడో రేపో అధిష్ఠానం నిర్ణయం
- వికటించిన టీడీపీలో చేరిక అంశం
- ఇండిపెండెంట్ అంటూ తాజాగా తెరపైకి

చీరాల, ఏప్రిల్ 1: వైసీపీ నేత, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నేడో, రేపో నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం టీడీపీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు వికటించాయనే ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో పార్టీకి నష్టం కలిగిస్తూ తన వ్యక్తిగత ప్రయోజనాలను ఆశిస్తూ, సొంత అజెండాతో ప్రయాణం చేయడం అందుకు కారణమని వైసీపీ శ్రేణులు భావిస్తున్నట్లు తెలిసింది. వైసీపీ అధిష్ఠానం చేపట్టిన మార్పులు, చేర్పుల విషయంలో ఆమంచిని పర్చూరు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి, యడం బాలాజీని నియమించారు. చీరాల అభ్యర్థిగా కరణం వెంకటేశ్ పేరును ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆమంచి తన సన్నిహితులు, శ్రేయోభిలాషులతో దాదాపు ప్రతి రోజు మంతనాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆమంచి టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కొద్దిరోజుల ప్రచారం జరిగింది. తర్వాత కొద్దిరోజులు ఆయన సూచించిన వ్యక్తికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా టిక్కెట్ ఇస్తారని ఆమంచి అనుచరులు ప్రచారం చేశారు. కాగా టీడీపీ చీరాల ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎంఎం కొండయ్య పేరును కూటమి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆమంచి అనుచరులు అప్పటి వరకు ఊహించుకున్న చిత్రం మారింది. ఈక్రమంలో చీరాల వైసీపీ టిక్కెట్ ఆమంచికి ఇవ్వాలంటూ ఆయన అనుయాయులు అక్కడక్కడ సమావేశాలు నిర్వహించారు. జరిగిన, జరుగుతున్న పరిణామాలపై వైసీపీ అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో ఆమంచిని నేడో, రేపో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారనే మాటలు ఆపార్టీ శ్రేణుల ఆంతరంగిక సమావేశాల్లో బలంగా వినిపిస్తున్నాయి.

పాత ఫార్ములా ప్రయోగిద్దాం

2014 ఎన్నికల్లో ఆమంచి ఇండిపెండెంట్‌గా(నవోదయం పార్టీ) గెలుపొందారు. తాజా ఎన్నికల్లో కూడా ఆ పాత ఫార్ములాను తిరిగి ప్రయోగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే 2014 పరిస్థితులకు, 2024 పరిస్థితులకు పొంతన లేదని ఆమంచి అనుచరుల్లోనే పలువురు పెదవి విరుస్తున్నారు. దీంతో అడుగులు ఎలా వేద్దామని విషయమ్మై ఆమంచి అనుచరుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(మంగళవారం)
సహారీ (ఉదయం) 4.45 (బుధవారం)

తమ్ముళ్లలో.. సమరోత్సాహం

- చంద్రబాబు ప్రజాగళం సభ సక్సెస్
- మాజీ ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ
- నేతలతో బస్సులో సమావేశమై దిశానిర్దేశం
- అధినేతకు వీడ్కోలు పలికిన టీడీపీ శ్రేణులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల పర్యటన విజయవంతమైంది. సమస్యలను ఎత్తి చూపడంతో పాటు వాటి పరిష్కారం విషయంలో స్పష్టమైన హామీని ఇవ్వడంతో పాటు బాపట్ల ప్రజలకు నేనున్నా అనే సంకేతాన్ని గట్టిగా వినిపించారు. ప్రజాగళం సభ సక్సెస్ అవడం ద్వారా టీడీపీ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నాయి. ఆదివారం రాత్రి ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేసిన చంద్రబాబు సోమవారం ఉదయం నేతలతో సమీక్షించారు. ఈ క్రమంలో చంద్రబాబు సమక్షంలో బాపట్ల నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ జన్నపు రెడ్డి సుబ్బారావు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. పలు సమస్యలపై వినతులు అందించడానికి చంద్రబాబు బస చేసిన బస్సు వద్ద పలువురు క్యూ కట్టారు. అందరి సమస్యలను విన్న టీడీపీ అధినేత అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు చంద్రబాబు తిరుగు పయనమయ్యారు. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టి పాటి రవికుమార్, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలతో పాటు పెద్దసంఖ్య లో వచ్చిన పార్టీ శ్రేణులు చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు.



విధ్వంసాన్ని వివరించాలి..

బాపట్ల లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులతో టీడీపీ అధినేత చంద్రబాబు రెండు పర్యాయలుగా సమావేశమయ్యారు. తొలుత ఆదివారం రాత్రి నాయకులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఉదయం నేతలతో సమావేశమై ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇదే సమయంలో గెలుపుపై అతి విశ్వాసం వద్దన్నారు. గ్రామ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సేవలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని నేతలకు సూచించారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గతంలో ఎన్నో ప్రాజెక్టుల్లో తనదైన ముద్ర వేశారని, ఆయన ఐపీఎస్‌గా అందించిన సేవలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పదవులు మొదలుకుని అన్ని విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ఓరుగంటి రెడ్లు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఓరుగంటి రెడ్ల సంక్షేమం కోసం టీడీపీ కట్టుబడి ఉందని తెలపడంతో పాటు వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చా రు. ఈ నేపథ్యంలో ఓరుగంటి రెడ్డి సం ఘం నాయకులు సోమవారం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ భద్రత లేక బాధలు పడుతున్నామని, కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని బాపట్ల జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చంద్రబాబుకు వినతి పత్రం అందించారు. అధికారంలోకి రాగానే తమను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని వారు అందులో పేర్కొన్నారు.

విదేశీ విద్యను దూరం చేశారు..

విదేశీ విద్యకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక బాధితులుగా మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం చంద్రబాబును కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో విదేశీ విద్యాధారణ, అంబేద్కర్ విదేశీ విద్య పేరిట స్కాలర్‌షిప్‌లు అందించి పేదలకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం 26 జిల్లాల్లోని 359 మంది పేద విద్యార్థులకు విదేశీవిద్యసాయం అందక అల్లాడిపోతున్నారని వివరించారు. అధికారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



అద్దంకిపై.. బెట్టింగ్‌లు

- టీడీపీ మెజార్టీపై కాయ్ రాజా కాయ్
- ఇతర జిల్లాల నుంచి వచ్చి మరీ పందాలు

అద్దంకి/బల్లికురవ, ఏప్రిల్ 1: ఎన్నికలతో బెట్టింగ్ రాయుళ్లు పండుగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం అద్దంకి నియోజకవర్గంలో మెజార్టీపై జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్ వరుసగా మూడుసార్లు మూడు పార్టీల నుంచి విజయం సాధించడంతో ఈదఫా కూడా అదే పంథాలో గెలుపొందుతారన్న ధీమా అత్యధిక శాతం ఓటర్లలో నెలకొంది. ఈ నేపథ్యంలో గెలుపు, ఓటమిలపై బెట్టింగ్‌లు అత్యల్పంగా జరుగుతున్నాయి. అత్యధిక శాతం బెట్టింగ్‌లు 15 వేల నుంచి 30 వేల వరకు మెజార్టీపైనే ఉంటున్నట్లు తెలుస్తుంది. మరికొందరు టీడీపీ వీరా భిమానులు అయితే ఏకంగా రూ.40 వేల పైచిలుకు మెజార్టీపై కూడా బెట్టింగ్‌లు పెట్టినట్లు తెలుస్తుంది. టీడీపీ వైపు ఎక్కువ మంది బెట్టింగ్‌లకు సిద్ధమవుతుండగా వైసీపీ వైపు నుంచి అతి కొద్దిమంది మాత్రమే ముందుకు వస్తున్నట్లు సమాచారం. అదీ కూడా వైసీపీ తరపున బెట్టింగ్‌లకు వస్తున్న వారిలో అగ్రకు లాల్లోని ఒకే సామాజిక వర్గం వారు కావడం విశేషం. బల్లికురవ మండలంలో ఓ గ్రామ వైసీపీ నేత సైతం టీడీపీ మెజార్టీపై బెట్టింగ్‌కు దిగడం చర్చనీయాంశంగా మారింది. సదరు నేత బెట్టింగ్ సమయంలో ప్రత్యర్థులైన వైసీపీ నేతలతో మాట్లాడుతూ పార్టీ అభిమానం వేరు.. బెట్టింగ్‌లు వేరు.. అన్నట్లు తెలుస్తుంది. ప్రకాశం, పల్నాడు, గుంటూరుకు చెందిన పలువురు అద్దంకిలో మె జార్టీపైనే బెట్టింగ్‌లకు దిగినట్లు తెలుస్తుంది. అద్దంకి పట్టణంలోని రి యల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం బెట్టింగ్‌ల వైపు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. ఇక మండలాలు, గ్రామాలవారీగా కూడా మెజార్టీలపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ విడత సంతమాగులూరులో మెజార్టీపై ఇరువర్గీయులు బెట్టింగ్‌లు పెట్టినట్లు తెలుస్తుంది. పోలీసులు దృష్టి సారిస్తారన్న ఉద్దేశంతో బెట్టింగ్‌లు రహస్యంగా నిర్వహిస్తున్నారు.

3న తెనాలికి పవన్‌కల్యాణ్

తెనాలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి ఈ నెల 3న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారని ఆ పార్టీ పీఏసీ చైర్మన్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పవన్ కల్యాణ్ పర్యటన, బహిరంగ సభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామన్నారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను సోమవారం మనో హర్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్ చేరుకునే పవన్ వారాహి వాహనంలో తెనాలిలో పర్యటిస్తారన్నారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు మార్కెట్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారన్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను మనోహర్ కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో ప్రజల ముందుంచుతారని తెలిపారు.

మండిన ఎండలు

రాష్ట్రంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పీసీపల్లిలో 42.67 డిగ్రీలు నమోదు

పశ్చిమాన చాలాచోట్ల 40 డిగ్రీలపైనే

తల్లడిల్లుతున్న జనం



ఒంగోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వారం క్రితం వరకు జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 నుంచి 38 డిగ్రీల వరకు ఉండగా తర్వాత పెరుగుతూ వస్తున్నాయి. నాలుగురోజుల క్రితం 40 డిగ్రీలు దాటగా సోమవారం మరింతగా పెరిగాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటడమే కాక రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యాయి. ఉదయం పది గంటల నుంచే ఎండతీవ్రత కనిపించగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు తీవ్రత అధికంగా ఉంది. ఈ సమయంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పీసీపల్లి మండలకేంద్రంలో 42.67 డిగ్రీలు నమోదుకాగా బేస్తవారపేట మండలం మోక్షగుండంలో 42.40, మార్కాపురం మండలం దరిమడుగులో 42.30, గుండ్లాపల్లిలో 42.03, దొనకొండలో 41.88, దోర్నాల మండలం వై.చెర్లోపల్లిలో 41.80, ఆకవీడులో 41.84, నందనమారెళ్లలో 41.63, మేకలవారిపల్లిలో 41.43, బొట్లగుడూరులో 41.42, వెలిగండ్లలో 41.25, అమానిగుడిపాడులో 41.23, సంతనూతలపాడులో 41.23, కొమరోలులో 41.11 డిగ్రీలు నమోదయ్యాయి. పశ్చిమప్రాంతంలోని ఎక్కువచోట్ల 40 డిగ్రీలకుపైగా నమోదైంది. ఒంగోలులోనూ ఉష్ణోగ్రతలు పెరిగాయి. వారంరోజులుగా ఇక్కడ 35 నుంచి 36 డిగ్రీలు ఉంటుండగా సోమవారం 37 డిగ్రీలు దాటింది. కాగా జిల్లాలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడమే కాక ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తీవ్రత కొనసాగుతోంది. ఈ పరిస్థితితో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ ఆరంభంలోనే ఈ స్థాయి ఎండలు ఉండటంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

టెంట్ కింద చదువులు

ఇబ్బందులు పడ్డ విద్యార్థులు



టెంట్ల కింద చదువుతున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 1 : స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలు విద్యార్థులు షామియానాల కింద తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డీఆర్ఆర్ఎంలో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. దీంతో ఆ పాఠశాలలో 6 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను స్థానిక సంతపేటలోని వీఎస్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. అయితే ఆ పాఠశాలలో తరగతి గదులు ఖాళీ లేకపోవడంతో పాఠశాల అవరణలోని కొద్దిపాటి ఖాళీస్థలంలో టెంట్లను వేసి విద్యార్థులను కుక్కారు. నాలుగు తరగతులు చదువుతున్న వందలాది మంది బాలబాలికలు ఎండకు చెమటలు కారుకుంటూ షామియానాల కిందే ఇరుకిరుకుగా కూర్చోవాల్సి వచ్చింది. షామియానాల కింద కాలు తీసి కాలు పెట్టేందుకు కూడా చోటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ ఇరుకులోనే మధ్యాహ్న భోజనం కూడా కానిచ్చారు. విద్యార్థులు కార్పెట్ల మీదే కూర్చోవాల్సి వచ్చింది. తరగతి వారీగా వేర్వేరుగా కూర్చోబెట్టేందుకు కూడా టీచర్లు శ్రమించాల్సి వచ్చింది.

టెన్త్ మూల్యాంకనానికి టీచర్లు డుమ్మా

సంజాయిషీ నోటీసులు అందజేత

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 1 : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో ప్రారంభమైంది. మూల్యాంకన విధులకు మొత్తం 1200 మంది హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించారు. వాస్తవ అవసరానికి మించి 20శాతం మందిని అదనంగా నియమించినా లాభం లేకుండా పోయింది. నాలుగు సబ్జెక్టుల్లో కనీస అవసరానికి సరిపడా కూడా టీచర్లు హాజరుకాలేదు. దీంతో మూల్యాంకన విధులకు గైర్హాజరైన టీచర్లతోపాటు టీచర్లను రిలీవ్ చేయని హైస్కూలు హెచ్ఎంలు, ఎంఈవోలకూ మొత్తం 284 మంది సంజాయిషీ నోటీసులు జారీ చేసినట్లు పరీక్షల పరిశీలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ తెలిపారు. తెలుగులో ఏడుగురు, హిందీలో 15 మంది, బయాలజికల్ సైన్స్‌లో 25మంది, సోషల్ స్టడీస్‌లో 15మంది స్కూలు అసిస్టెంట్లు, 121 మంది స్పెషల్ అసిస్టెంట్ల(ఎస్‌జీటీ)కు సంజాయిషీ నోటీసులు జారీచేశారు మూల్యాంకన విధులకు హాజరు విషయంలో అధికారుల హెచ్చరికలు బేఖాతరయ్యాయి. డీఆర్ఆర్ఎం హైస్కూలులోకి ప్రవేశించే ప్రధాన ద్వారం మూసివేసి దూ రంగా ఉన్న మరో ద్వారాన్ని తెరవడంతో టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మూల్యాంకన విధులకు హాజరైన టీచర్లను కార్యక్రమం ముగిసే వరకు కేంద్రం నుంచి బయటకు అనుమతించలేదు. మధ్యాహ్న భోజనం తెచ్చు కున్న వారు మినహా మిగతా వారు కేంద్రంలోని క్యాంటీన్‌లోనే భోజనం చేయాల్సి వచ్చింది. టీచర్లకు కూలింగ్ వాటర్, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య ఆరోగ్యశాఖ బృందాన్ని ఏర్పాటు చేశారు.

ఎంపీ సాక్షిగా బయటపడిన వైసీపీలో వర్గ విభేదాలు

- పార్టీ కండువాలు, జెండాలు ధరించి ప్రార్థనలలో పాల్గొన్న ఎంపీ సురేష్, హనిమిరెడ్డి



ఎంపీ సురేష్ సమక్షంలోనే వాదనకు దిగిన మహిళ

బల్లికురవ, ఏప్రిల్ 1: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పెరపాడు వచ్చిన ఎంపీ నందిగం సురేష్ సమక్షంలోనే వైసీపీలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. ఎంతో పవిత్రంగా భావించే చర్చిలోకి వైసీపీ జెండాలు, కండువాలు ధరించి లోపలికివచ్చి మరి వాదనలకు దిగటం విశేషం. మొట్టమెదటి సారిగా ఎన్నికలలో ప్రచారం ప్రారంభించేందుకు ఎంపీ నందిగం సురేష్, వైసీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డిలు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఉన్న చర్చిలో ప్రార్థనలో పాల్గొనేందుకు వచ్చారు. అయితే, వైసీపీలో ఉన్న రెండు వర్గాలలో ఒక మహిళ మరో వర్గానికి చెందిన ఒక యువనేతను ఇక్కడకి ఎందుకు వచ్చావని ప్రశ్నించారు. అతనిని వెంటనే బయటకు వెళ్లాలని, లేకుంటే మీరు కూడా బయటకు వెళ్లాలని నినాదాలు చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య ఎంపీ సమక్షంలోనే వాదోపవాదనలు జరిగాయి. చర్చిలో గందరగోళం నెలకొనటంతో అక్కడికి వచ్చిన వారు కూడా చర్చిని కూడా రాజకీయం చేశారని ఆరోపించారు. ఎస్సీ కాలనీలో గత కొంత కాలం నుంచి రెండు వర్గాల మధ్య వివాదం ఉంది. ఎంపీని ఎన్నికల ప్రచారానికి తాము తీసుకువచ్చాం అంటే, తాము తీసుకు వచ్చాం అనే విషయమై రెండు వర్గాల మధ్య పంతాలు పెద్దవి అయి వాదనకు దిగారు. ఇరువర్గాల వారికి పెద్దలు నచ్చజెప్పి వారిని చర్చి నుంచి బయటకు పంపటంతో వివాదం సద్దుమణిగింది. ఎస్సీ కాలనీ లో వివాదాలు అటు ఉంచితే ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎంపీ సురేష్, హనిమిరెడ్డిలు చర్చిలోకి పార్టీ కండువాలతో వెళ్లటం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.

రాజకీయ లబ్ధికోసమే టీడీపీపై బురద

మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

ఒంగోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీపై రాజకీయ లబ్ధి కోసం టీడీపీపై బురదజల్లుతూ వైసీపీ చీప్ రాజకీయం చేస్తున్నదని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఆరోపించారు. స్థానిక మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఉన్న నిధులను తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీకావడంతో పింఛన్లు సకాలంలో ఇవ్వలేక వలంటీర్ల పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందన్నారు.

అసమ్మతితో సతమతం

అధికార వైసీపీలో పదిచోట్ల మంటలు

ఫలించని బెదిరింపులు, బుజ్జగింపులు

చెవిరెడ్డి ప్రత్యేక దళంపై ఎమ్మెల్యే అభ్యర్థుల్లో వ్యతిరేకత

కందుకూరుపై లోకేష్ దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఈ సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో అధికార వైసీపీ ముందుంది. ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాల్లో అలాగే జిల్లాతో సంబంధం ఉన్న మూడు పార్లమెంట్ స్థానాలను ప్రకటించింది. టీడీపీ గతం కన్నా మిన్నగా అభ్యర్థుల ఎంపికను స్పీడుగానే పూర్తి చేసింది. అభ్యర్థుల ఎంపికలో అధికార వైసీపీలో సమస్యలు అధికంగా ఎదురుకాగా తెలుగుదేశం పార్టీ ఆ విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకుంది. స్థానికంగా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలపై ఉన్న వ్యతిరేకతలను నివారించే ఉద్దేశంతో వైసీపీ ఎక్కువమంది అభ్యర్థులను మార్పుచేసింది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి మినహా మిగిలిన ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలకు వారు ప్రాతినిధ్యం వహించే స్థానాల్లో ఎక్కడా సీట్లు ఇవ్వలేదు. ముగ్గురు ఎమ్మెల్యేలను పూర్తిగా పక్కనపెట్టగా మరో నలుగురు ఎమ్మెల్యేలకు స్థానచలనం కల్పించింది. చీరాల ఎమ్మెల్యే స్థానంలో ఆయన కుమారుడిని రంగంలోకి తేగా సంతనూతలపాడు, అద్దంకి నియోజకవర్గాలకు గుంటూరు జిల్లా నాయకులను దిగుమతి చేసింది. స్థానికంగా ఉన్న అసమ్మతులను, విభేదాలను సవరించుకునే లక్ష్యంతో ఆ కొత్త ప్రక్రియను వైసీపీ చేపట్టగా అది ఆచరణలో ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. పది స్థానాల్లో అసమ్మతి నేతలతో వైసీపీ అభ్యర్థులు సతమతమవుతుండటం అందుకు నిదర్శనం. ఇక టీడీపీ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు ఎనిమిది స్థానాల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న వారినే రంగంలో దింపింది. ఒక్క కందుకూరులో కొద్దిపాటి సమస్యలు మినహా ఆ పార్టీ అభ్యర్థులకు ఇంక ఎక్కడా ఇతరత్ర సమస్యలు ఎదురుకాకపోవటం విశేషం.

జిల్లాలో

ఎన్నికల ప్రచారంతోపాటు అసమ్మతివాదుల అలజడి ఊపందుకుంటుంది. క్రమేపీ అసమ్మతులు తగ్గుతాయని భావించిన వైసీపీ నాయకత్వం ఊహ తల్లకిందులవుతుంది. అసలే అసంతృప్తివాదుల అలకలతో అలజడిలో ఉన్న అభ్యర్థులకు ఎంపీ అభ్యర్థి వ్యక్తిగత బృందాలు మరింత తలనొప్పిగా తయారయ్యాయి. వారిని నియోజకవర్గాలకు పంపించటాన్ని అభ్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులను అసమ్మతి బెడద వేధిస్తుండగా, ప్రతిపక్ష టీడీపీకి ఒక్కస్థానంలో అలాంటి పరిస్థితి ఉంది. ఇప్పటికీ పన్నెండు అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులను వైసీపీ ప్రకటించి రంగంలో పంపగా టీడీపీ కూడా ఆ కసరత్తును పూర్తిచేసింది. ఆయా పార్టీల అధినాయకులు ప్రచార కార్యక్రమానికి శ్రీకారం పలికి జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులపై రెండు పార్టీల అధినాయకులు ఆరా తీస్తున్నారు.

వైసీపీలో లుకలుకలు

వైసీపీలో ప్రస్తుతానికి ఒంగోలు, మార్కాపురం మిగిలిన పది స్థానాల్లో అభ్యర్థులు అసమ్మతివాదుల బెడదకు గురవుతున్నారు. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు వర్గం వారి నుంచి ఆశించిన సహకారం అభ్యర్థి నాగార్జునరెడ్డికి లభించటం లేదు. నిన్నటికి నిన్న కంభం, అర్థవీడు మండలాల నుంచి టీడీపీలో చేరిన స్థానిక సంస్థల ప్రతినిధులు, వైసీపీ నాయకులంతా గతంలో అన్నా రాంబాబుతో నడిచిన వారే. ఇక అనూహ్యంగా స్థానికేతరులు అన్న సమస్యను నాగార్జునరెడ్డి భారీగా ఎదుర్కొంటున్నారు. వైసీపీ టికెట్ ఆశించి భంగపడిన వారిలో ఒకరిద్దరు నాయకులు అంటీముట్టనట్లు తిరుగుతుండగా, ఐదుగురు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. ఎర్రగొండపాలెంలో గతంలో మంత్రి సురేష్ అనుకూలంగా, వ్యతిరేకంగా వ్యవహరించిన గ్రూపుల వారు కలిసి పయనించేందుకు ససేమిరా అంటున్నారు. అభ్యర్థి చంద్రశేఖర్ ఒకరిని చేరదీస్తే మరొకరు గుడ్‌బై చెబుతున్నారు. చివరకు చంద్రశేఖర్ మంత్రి సురేష్ వ్యతిరేక వర్గం వారితో సన్నిహితంగా ఉండగా సన్నిహిత వర్గం వారు పోలోమని టీడీపీలో చేరుతున్నారు. పుల్లలచెరువు మండలంలో కీలకమైన ఆ పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డితోపాటు అన్నీ గ్రామాల్లోని ఆయన అనుచరులు టీడీపీలో చేరటం అందుకు నిదర్శనం. దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వర్గీయులు అభ్యర్థి శివప్రసాద్‌రెడ్డికి దూరంగానే ఉన్నారు. ఒకరిద్దరు కలిసిపోయినా ఆయన నుంచి సరైన ఆదరణ లభించటం లేదంటూ తిరుగుముఖం పడుతున్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి కూడా శివప్రసాద్‌రెడ్డి విషయంలో రాజీ లేదనే సంకేతం ఇవ్వటంతో అనేక గ్రామాల్లో మద్దిశెట్టి అనుచరులు శివప్రసాద్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

కనిగిరి, కొండపిలో దూరందూరం

కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రాను మర్యాద కోసమైన వైసీపీ అభ్యర్థి దద్దాల ప్రచారానికి ఆహ్వానించలేదు. దీంతో మధుసూదన్‌యాదవ్ అనుచరులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. నిన్న మొన్నటివరకు ఎమ్మెల్యే బుర్రాకు వ్యతిరేకంగా చక్రంతిప్పిన కొందరు నాయకులే ప్రస్తుత అభ్యర్థిపై పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో దాదాపు అన్నీ గ్రామాల్లో ఎమ్మెల్యే అనుచరులు అభ్యర్థికి దూరంగా ఉండిపోయారు. ఎమ్మెల్యే కందుకూరులో పోటీలో ఉన్నందున కొందరు నాయకులు పేరుకు సమావేశాలకు వెళ్తున్న మనస్ఫూర్తిగా మద్దతు ఇవ్వటం లేదని దద్దాల ఇప్పటికే అధినాయకులకు ఫిర్యాదు చేశారు. దద్దాల కూడా అప్పుడే గెలిచానన్న అహంభావంతో వ్యవహరిస్తూ చిన్నచూపు చూస్తున్నారని ఎమ్మెల్యే అనుచరులు ఫిర్యాదు చేశారు. కొండపిలో మంత్రి సురేష్‌కు అందరూ సహకరిస్తున్నట్లు కనిపిస్తున్నా మండల, గ్రామస్థాయిలోని చాలామంది నాయకులు దూరంగా ఉంటున్నారు. మాజీ ఇన్‌చార్జి వెంకయ్య ప్రచారంలో కనిపించకపోగా ఆయన అనుచరులు కూడా గ్రామాల్లో పట్టున్నా ముందుకు రావటం లేదు. ఇటీవల మరో మాజీ ఇన్‌చార్జి అశోక్ వర్గీయులు కూడా కొన్ని గ్రామాల్లో సురేష్ ప్రచారానికి దూరంగా కనిపించారు. టీడీపీలో చేరిన ఎంపీ మాగుంటతో బలమైన నాయకులు కొందరు టీడీపీలో చేరిపోయారు. ఎస్ఎన్‌పాడులో మంత్రి నాగార్జునతో కలిసి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఇంతవరకు ప్రచారంలో పాల్గొనలేదు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి ఆయన్ను ఒంగోలు లోక్‌సభలోని కొన్ని ప్రాంతాల్లో ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. చీమకుర్తి మండలంలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి వ్యతిరేకవర్గం దగ్గరకు రాలేదు. పైగా కొందరు నాయకులతో మీరు మాట్లాడినా తాను ఒప్పుకోనని శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించినట్లు సమాచారం. ఎన్‌జీపాడు మండలంలో ఒక గ్రూపు నాయకులు నాగార్జున ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉన్నారు.



కలవని గ్రూపులు, వర్గాలు

అద్దంకి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గరటయ్య ఆయన కుమారుడు చైతన్యతో పాటు వారి గ్రూపు అంతా టీడీపీలోకి వెళ్లిపోయారు. గతంలో టీడీపీ అభ్యర్థి రవికుమార్‌తో ఉండి గత మూడేళ్లలో వైసీపీలో చేరిన వారంతా నేరుగా రవికుమార్ దగ్గరకు వెళ్లి మద్దతు ప్రకటిస్తున్నారు. ఇక అభ్యర్థి హనిమిరెడ్డి దూకుడు మనస్తత్వం, దురుసు మాటతీరును భరించలేక ఇటీవల అనేక గ్రామాల్లో నాయకులు ప్రచారానికి దూరమయ్యారు. పర్చూరులో ఒక వర్గం నాయకులు వారి అనుచరులంతా అభ్యర్థి బాలాజీకి దూరంగానే ఉన్నారు. బాలాజీ అభ్యర్థిగా రాగానే గతంలో ఉన్న గ్రూపులకతీతంగా ఆయన వద్దకు వెళ్లిన నాయకులకు ఎదురైన చేదు అనుభవాలతో సైలెంట్ అయిపోయారు. చీరాలలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి ఆయన అనుచరులు వైసీపీ అభ్యర్థి వెంకటేష్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. బీసీ నాయకులు, మాజీ మంత్రి పాలేటి రామారావు గుడ్‌బై చెప్పటం కూడా ఆ పార్టీకి శాపంగా మారింది. కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తనను కలిసిన వైసీపీ నాయకులు, అభ్యర్థి బుర్రాకు మాటలు చెప్పి పంపటమే తప్పా ఇంతవరకు ప్రచారానికి హాజరుకాలేదు. ఆయన వర్గీయుల్లో చాలామంది ఇప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండగా తటస్థవాదులు, కొన్ని గ్రామాల్లోని నాయకులు టీడీపీలో చేరిపోయారు.

కందుకూరుపై అధిష్ఠానం దృష్టి

టీడీపీ విషయం కొస్తే కందుకూరు నియోజకవర్గంలో ఆ పార్టీ అసమ్మతి, అసంతృప్తుల సమస్యలను ఎదుర్కొంటుంది. అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు తాను సహకరించబోనని చెప్పటమే కాక స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ ప్రకటించి తిరుగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా టీడీపీ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే కేడర్‌ను కలుపుకొని పోవటంలో అభ్యర్థి సఫలీకృతులయ్యారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆ నియోజకవర్గంపై దృష్టిసారించారు. రాజేష్‌ను గురువారం హైదరాబాద్ పిలిచి మాట్లాడారు. చీరాలలోను టీడీపీలోని ఒక వర్గం నాయకులు అలకబూని ఉండగా లోకేష్ వారితో మాట్లాతున్నారు.

అరకొరగానే రేషన్ పంపిణీ

కందిపప్పును మర్చిపోతున్న పేదలు

గోధుమపిండిని తీసుకునేందుకు నిరాకరిస్తున్న డీలర్లు

గ్రామీణ ప్రాంతాల్లో సర్వర్ సమస్య

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : జిల్లాలో రేషన్ పంపిణీ అరకొరగానే ప్రారంభమైంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలు కందిపప్పును మర్చిపోయారు. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి మొబైల్ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించగా కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. గత పది నెలల నుంచి ప్రభుత్వం జిల్లాకు కందిపప్పు కేటాయింపు అరకొరగానే చేస్తుండటంతో డీలర్లు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. జిల్లాకు



రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

666 టన్నులు కందిపప్పు రావాల్సి ఉండగా కేవలం వంద టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో డీలర్లు కొద్దిమేర తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. రేషన్ పంపిణీ సమయంలో కొంతమంది కార్డుదారులకు కందిపప్పు ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వకపోతే ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో డీలర్లు కందిపప్పు కోసం డీడీలు తీయడమే మానేశారు. మరోవైపు గోధుమపిండిని కూడా తీసుకునేందుకు డీలర్లు సుముఖత చూపడం లేదు. పంపిణీ సమయంలో కొంతమంది కార్డుదారులు గోధుమపిండిని తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. మిగిలిన పిండిని మరుసటి నెలలో ఇచ్చే సమయంలో డ్యామేజి వస్తుండటంతో నష్టపోతున్నామని డీలర్లు దానిని తీసుకోవడం లేదు. కాగా జిల్లా వ్యాప్తంగా సోమవారం సరుకుల పంపిణీ ప్రారంభం కాగా సాయంత్రం ఐదు గంటల సమయానికి కేవలం 4శాతం మంది కార్డుదారులకే రేషన్ అందింది. జిల్లాలో 6,70,571 తెల్లరేషన్ కార్డులు ఉండగా సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయానికి కేవలం 26,842 మందికే మాత్రమే రేషన్ అందాయి. అంటే రేషన్ పంపిణీలో రాష్ట్రంలో 22వస్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో కార్డుదారులు గంటల తరబడి వాహనాల వద్దనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రతినెల ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సర్వర్‌ను వేగం పెంచడంలో రాష్ట్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఇంటి వద్దకే పింఛన్?

సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి

ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం

సెల్‌ఫోన్లను అప్పగించిన వలంటీర్లు

మూడవ తేదీ నుంచి పంపిణీకి ఏర్పాట్లు

నేటికి జిల్లాకు విడుదల కాని నిధులు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 1 : ప్రభుత్వం మళ్లీ నిర్ణయం మార్చుకుంది. సచివాలయ సిబ్బందిఓ లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేయాలని ఆదేశించినట్లు సమాచారం. జిల్లాలో ఈనెల మూడవ తేదీ నుంచి సచివాలయాల్లో పింఛన్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్మును పంపిణీ చేయించవద్దంటూ, అసలు సంక్షేమ పథకాల అమల్లో వారిని భాగస్వాములను చేయవద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జిల్లాలోని వలంటీర్లు సోమవారం నాడు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను, ట్యాబ్‌లు, బయోమెట్రిక్ పరికరాలను తిరిగి సచివాలయాలకు అప్పగించారు. పింఛన్ పంపిణీ బాధ్యతను అక్కడి సిబ్బందికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సిబ్బందికి పింఛన్ల పంపిణీ లాగిన్ ఇచ్చి లబ్ధిదారులకు సచివాలయాల్లోనే పంపిణీ చేయాలని చెప్పింది. ఈనెల మూడో తేదీ నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం మార్చిలోనే నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 2,94,888 పింఛన్లు ఉండగా వీరికి పంపిణీ చేసేందుకు జిల్లాకు రూ.88.22 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులు ఇంకా జిల్లాకు రాలేదు. కాగా దీనిపై ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి లేఖరాశారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ సొమ్మును పంపిణీ చేయాలని కోరారు. దీంతో ప్రభుత్వం సోమవారం పింఛన్ల పంపిణీపై మరో నిర్ణయం చేసేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సచివాలయం సిబ్బందినే లబ్ధిదారుల ఇళ్లకు పంపించి పింఛన్లను అందజేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలు మంగళవారం ఉదయం రావచ్చని డీఆర్‌డీఏ, వైకేపీ అధికారులు భావిస్తున్నారు. కాగా ప్రభుత్వం మూడో తేదీనే బ్యాంకులకు నిధులను జమ చేయనుంది. వాటిని సచివాలయం సిబ్బంది డ్రా చేసుకుని వచ్చి పంపిణీని ప్రారంభించాల్సి ఉంది. బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని వచ్చి పంపిణీని ప్రారంభించేసరికి ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అది కూడా ప్రభుత్వం మూడో తేదీన బ్యాంకులకు జమచేస్తేనే ఆ సొమ్మును పింఛన్ల పంపిణీకి డ్రాచేసుకునే అవకాశం కలుగుతుంది. నిధులు విడుదల చేయటంలో జాప్యం జరిగితే మూడో తేదీన, లేదా నాలుగో తేదీన కూడా పంపిణీ జరిగే అవకాశం ఉండదని అంటున్నారు.

దర్శిలో టీడీపీ దూకుడు

భారీగా మద్దతు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

వైసీపీకి చేయలేమంటూ మద్దిశెట్టికి తేల్చి చెప్పిన అనుచరులు

కౌన్సిలర్లతోపాటు మండల నేతలు టీడీపీ వైపు

(ఆంధ్రజ్యోతి ఒంగోలు)

దర్శి నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వలసలు జరగబోతున్నాయి. సోమవారం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనుచరులువైసీపీకి మద్దతు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికే మద్దతు ఇస్తామని ప్రకటించినట్లు తెలిసింది. అంతేగాక నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన వైసీపీలో ఉన్న అసంతృప్తవాదులంతా గొట్టిపాటి లక్ష్మి భర్త అనంత్‌కు టచ్‌లోకి రావడం విశేషం. కొందరు కౌన్సిలర్లు కూడా వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరబోతున్నారు. వివిధరకాల పరిణామాల అనంతరం దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచిటీడీపీ అభ్యర్థిని రంగంలోకి దించిన విషయం తెలిసిందే. దివంగత నేత గొట్టిపాటి నరసయ్య కుమార్తె డాక్టర్ లక్ష్మి అభ్యర్థి కావడంతో టీడీపీ, బీజేపీ, జనసేనలో జోష్ పెరిగింది. నిన్నమొన్నటి వరకూ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అనుచరులు ఏదో పార్టీ నుంచి ఆయన నరంగంలోకి వస్తారని ఎదురుచూశారు. టీడీపీ అభ్యర్థిగా లక్ష్మి రంగంలోకి రావడంతో ఎమ్మెల్యే వేణుగోపాల్ ఈ పర్యాయం ఎన్నికలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. సోమవారం



లక్ష్మికి స్వామి పటం బహూకరిస్తున్న టీడీపీ నేత

సాయంత్రం ఎమ్మెల్యే సోదరుడు శ్రీధర్ దర్శి వెళ్లారు. వారి గృహంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా అనుచరులంతా తాము వైసీపీకి మద్దతు ఇవ్వలేమని, టీడీపీఅభ్యర్థికే మద్దతు ఇవ్వాలని భావిస్తున్నామని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన కూడా మీ ఇష్టం అంటూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సమాచారం. అందిన సమాచారం మేరకు.. దర్శి నగర పంచాయతీ పరిధిలోని మద్దిశెట్టి అనుచరులలోని సాంబయ్య అనే నేత మినహా నియోజకవర్గం మొత్తంలో ఆయన అనుచర వర్గం దూరంగా ఉంది. వారిలో కౌన్సిలర్‌తోపాటు ఆయా మండలాల కీలక నేతలు పలువురు టీడీపీ అభ్యర్థి భర్తకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. సోమవారం దర్శిలో టీడీపీ, జనసేన, బీజేపీ పరిచయ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కుమారుడు రాఘవరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ పాల్గొన్నారు. మూడు పార్టీల వారు హాజ రు కావడం విశేషం. మాజీ ఎమ్మెల్యే పాపారావుతోపాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

చంద్రబాబు రాక

దర్శి నియోజకవర్గంలో ప్రజాగళం సభలో పాల్గొనేందుకు చంద్రబాబు రానున్నారు. ఆ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని దర్శి చీరాలలో తన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని బాబు సూచించినట్లు తెలిసింది. ఈ నెల 7వ తేదీన చంద్రబాబు పర్యటన ఖరారయ్యే అవకాశముందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

చెక్‌పోస్టు వద్ద అక్రమ మద్యం పట్టివేత.. ఇద్దరు అరెస్టు

పామూరు, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన బోర్డర్ చెక్‌పోస్టు నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి నుంచి 46 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సోమవారం తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎస్ఐ ఎం.సైదు బాబుతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద చూడగా అక్రమంగా తీసుకెళ్తున్న 46 బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.1.46 లక్షలు పట్టివేత

ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం చెక్ పోస్టు వద్ద సోమవారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా నరసరావుపేటకు చెందిన పీ శ్రీనివాసరావు, మరో ఇద్దరి వద్ద రూ 1.46 లక్షలు పట్టుబడినట్టు ఎస్ఐ పీ అంజనేయులు తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేసేటప్పుడు సంబందిత డబ్బు వివరా లు సక్రమంగా తెలపక పోవటం వల్ల సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ అంకారావు, సిబ్బంది ఉన్నారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ రాజకీయం


ఏలూరి సాంబశివరావు


గొట్టిపాటి రవికుమార్

» రాజకీయ లబ్ధి కోసమే టీడీపీపై బురద » వలంటీర్లను రాబోయే ప్రభుత్వంలో కొనసాగిస్తాం » సచివాలయ సిబ్బందితో లబ్ధిదారులకు అందజేయాలి

పర్చూరు, ఏప్రిల్ 1: పెన్షన్ల పంపిణీపై వైసీపీ దురుద్దేశపూర్వకంగానే రాజకీయం చేస్తుందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. నిధులన్నింటినీ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారన్నారు. నేడు నిధుల కొరతతో ఖజానా ఖాళీ కావటంతో పెన్షన్ ఇవ్వలేక కొత్త రాజకీయానికి తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. సోమవారం పర్చూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఏలూరి మాట్లాడారు. పింఛన్ సొమ్ముతోపాటు, ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు మార్చి 16 నుంచి 30 తేదీల మధ్య ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పెన్షన్ దారులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటివద్దే పెన్షన్లు పంపిణీ చేసేవిధంగా యుద్ధప్రాతిపతికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకటో తేదీన పెన్షనర్‌లకు ఇవ్వాల్సిన డబ్బును, జనవరి 23న బటన్ నొక్కిన ఆసరా డబ్బును, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన చేయూత డబ్బును, ఫిబ్రవరి 19న పామర్రులో బటన్ నొక్కిన విద్యా దీవెన డబ్బును, మార్చి 14న బటన్ నొక్కిన ఈబీసీ నేస్తం డబ్బును, ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా రూ.13వేల కోట్లు మార్చి 16 నుంచి 30వ తేదీ లోపల తన అనుకూల కాంట్రాక్టర్‌లకు అప్పనంగా దోచిపెట్టారని విమర్శించారు. తన దుర్మార్గాన్ని కప్పిపెట్టుకోవటానికి వైసీపీ నేతలు టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. వలంటీర్లను ప్రజాసేవా కార్యక్రమాలకు కాకుండా వైసీపీ కార్యక్రమాలకు వినియోగించి వందల మంది వలంటీర్లు క్రిమినల్ కేసుల బారిన పడటానికి జగన్‌మోహన్‌రెడ్డి కారకులయ్యారన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవటానికి కారణం నిధులు కొరతే గాని ఎన్నికల కమిషన్ కాదన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని మార్చి 28న అధికార పార్టీ దినపత్రికలో వైసీపీ ప్రభుత్వం చెప్పిన వార్తను ప్రచురితం కావడం ఆపార్టీ నేతలకు కనిపించలేదా? అని ఏలూరి ప్రశ్నించారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజాసేవ మాత్రమే చేసే వలంటీర్లను రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి పింఛన్లను సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తుందని ఏలూరి పేర్కొన్నారు.

ఖజానా ఖాళీ చేసి నగదులేక టీడీపీపై అసత్య ప్రచారం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జగన్‌రెడ్డికి చేతగాక టీడీపీపై అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు.

సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతేగాని ఎన్నికల కమిషన్, తెలుగుదేశం పార్టీ కాదన్నారు. ఖజానాలో నిధులులేకనే జగన్‌రెడ్డి ఒకటో తేదీ పింఛన్ల పంపిణీకి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. 1.3 లక్షల సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ సాధ్యమేనని చెప్పారు. సీఎం జగన్ స్వార్థ రాజకీయం వలనే పింఛన్ దారులు నష్టపోతున్నారన్నారు. పింఛన్లు ఆపమని ఎలక్షన్ కమిషన్ ఎక్కడా చెప్పలేదన్నారు. ఒకటో తేదీ పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించిందన్నారు. పింఛన్లు పంపిణీ చేయాల్సిన నగదును జగన్‌రెడ్డి తన అనుకూల కాంట్రాక్టర్‌లకు దోచిపెట్టారన్నారు. దీంతో ఖజానాలో డబ్బులు లేక వైసీపీ ప్రభుత్వం కొత్తనాటకానికి తెర లేపిందని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు.

పింఛన్ల పంపిణీకి మేము వ్యతిరేకం కాదన్నారు. పింఛన్లను పెంచింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. జగన్‌రెడ్డిలా దశలవారీగా పింఛన్ల పెంపు చేయలేదని పేర్కొన్నారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పింఛన్‌ను ఎటు వంటి ఆంక్షలు లేకుండా ఇస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల చేత ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ చేశారు.


ఇంకొల్లు శివాలయం బజారులో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వృథాగా పోతున్న నీరు

ఇంకొల్లు, ఏప్రిల్ 1: ఇంకొల్లు పంచాయతీలో తాగునీరు వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. నిత్యం రద్దీగా ఉండే ఇంకొల్లు శివాలయం బజారులో గంగవరం రోడ్డుకు సమీపంలో రక్షిత నీరు సరఫరా జరిగే పైపులైను వారం రోజులు క్రితం పగిలిపోయి నీరు వృథాగా పోతూ కాలువను తలపిస్తోంది. వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వెంటనే పంచాయతీ అధికారుల స్పందించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అమ్మ ఆశ్రమ భవన నిర్మాణానికి విరాళం

మార్టూరు, ఏప్రిల్ 1: మార్టూరులోని కొణిదెన రోడ్డులో నిర్మాణం జరుగుతున్న అ మ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి హైదరాబాదులోని వెస్సో సంస్థ రూ.51,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం హైదరాబాదులోని కోటి సెంటరులోగల బీసీ భవనంలో ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు సంబంధిత చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వెస్సో సంస్థ అధ్యక్షుడు బంగారు తాతారావు, కార్యదర్శి బంగారు శ్రీనివాస్, గురజాపు వరప్రసాద్, డాక్టర్ దాకోజు కశ్యప్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మగుండం వద్ద ప్రత్యేక పూజలు


కొణిదెన బ్రహ్మగుండం వద్ద ప్రత్యేక హోమాలలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, ఏప్రిల్ 1: మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న ప్రసిద్ధ బ్రహ్మగుండం వద్ద సోమవారం నవగ్రహ పూజ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. 41 రోజుల క్రితం బ్రహ్మగుండం వద్ద గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదిత్యాది నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా 41 రోజుల పండుగ వేడుకలు నిర్వహించారు. నవగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రేణుకమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పంగులూరు, ఏప్రిల్ 1: పంగులూరులో నూతనంగా నిర్మించనున్న రాయిణి వంశదేవర రేణుకమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా వేద పండితులు వేముల శ్రీహరి, త్రినాథ్‌లు శాస్త్రోక్తంగా పూజలు, హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని క్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరు, చందలూరు, దుద్దుకూరు, చీరాల పరిసర ప్రాంతాలకు చెందిన రాయిణి వంశస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మృతి చెందిన శ్రీకాంత్

అద్దంకి టౌన్, ఏప్రిల్ 1: గోతుల రోడ్డు ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. అద్దంకి మండలంలోని కుంకుపాడుకు చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్(29) గత నెల 19వ తేదీ రాత్రి మోటర్ సైకిల్‌పై తాళ్ళూరు వైపు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు పై గోతులను గుర్తించకపోవడంతో మోటర్ సైకిల్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి తరువాత రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

ఎండ వేడిమికి కార్మికుడు మృతి

మార్టూరు, ఏప్రిల్ 1: ఎండ వేడిమికి కొమ్మూరి వెంకటేశ్వర్లు(55) అనే కార్మికుడు సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు మార్టూరులోని పడమర బజారున నివసిస్తున్నాడు. కుటుంబసభ్యుల కథనంమేరకు .. నాగరాజుపల్లి రోడ్డులోని ఓ పొగాకు కంపెనీలో ఆయన పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో వ్యక్తిగత పని నిమిత్తం మార్టూరు సెంటరులో తిరుగుతూ ఉండగా ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక షాపు ముందు సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు అతని ముఖంపై నీటిని చల్లినప్పటికీ తేరుకోక సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అతని భార్య గతంలోనే చనిపోగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు.

యువకులపై కేసు నమోదు

పర్చూరు, ఏప్రిల్ 1: వాట్సప్ మెసేజ్ పురస్కరించుకుని జరిగిన దాడికి సంబంధించి ఐదుగురు యువకులపై పర్చూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం హత్యాయత్నంతోపాటు, ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుని బంధువుకు వీరన్నపాలెం గ్రామానికి చెందిన భాను అనే యువకుడు పంపిన వాట్సప్ మెసేజ్‌తో వివాదం చోటుచేసుకుంది. ఇది కాస్త ఘర్షణగా దారితీసింది. చాకుతో దాడిచేసి కులంపేరుతో దూషించారన్న ఫిర్యాదుతో గౌస్‌తోపాటు, మరో నలుగురు యువకులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ప్రజాగళం విజయవంతం

బాపట్ల, ఏప్రిల్ 1 : బాపట్లలో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఈవిషయమై టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో అపూర్వస్వాగతం పలుకుతూ ప్రజానీకం తరలిరావటంతో అన్నిరోడ్లు బ్లాక్ అయ్యాయన్నారు. సభ కొంత ఆలస్యమైనప్పటికి అభిమానులు కార్యక్రమం ముగిసేవరకు ఉండటం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఐక్యంగా కలిసి రావటం సంతోషదాయకమన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

గంజాయి కేసులో 20ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్1: గంజాయి రవాణా కేసులో నిందితులకు 20 సంవత్సరాల జైలుశిక్ష, లక్షరూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా చోడవరం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయి, విశాఖపట్నం రూరల్ జిల్లా నర్సీపట్నం గ్రామానికి చెందిన టీ.వెంకట సత్యనారాయణ, బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన గుంజి నాగరాజు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. 2021లో ఖమ్మం రూరల్ పోలీసులు కోదాడ క్రాస్‌రోడ్‌లో తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను తనఖీ చేశారు. వారి నుంచి 170 కేజీల 190గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేసు నమోదుచేసి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువుకావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు వాదించగా, కోర్టు కానిస్టేబుల్ కె.తిరుమలరావు, లైజన్ ఆఫీసర్ భద్రునాయక్, శ్రీనివాసరావు, హోంగార్డు యం.డి.ఆయ్యూబ్ సహకరించారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల


విద్యుత్ దీపాలంకరణలో వీరాంజనేయస్వామి

మార్టూరు, ఏప్రిల్ 1: మండలంలోని వలపర్ల గ్రామంలో సాగర్ కాలువ పక్క ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఏటా ఈదేవాలయంలో వానరం పేరుతో తిరునాళ్లను జరపడం ఆనవాయితీగా వస్తుంది. అందులోభాగంగా దేవాలయ కమిటీ సభ్యులు ఈఏడాది కూడా తిరునాళ్ల నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను అందంగా అలంకరించారు. ఆలయానికి సమీపంలో విద్యుత్ దీపాలంకరణతో ఏర్పాటుచేసిన వీరాంజనేయస్వామి బొమ్మ భక్తులను ఆకట్టుకుంది. ఎన్నికల కోడ్ ఉండటంతో విద్యుత్ ప్రభలు, తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేయలేదు. రాత్రి స్వామి వారి జెండాను దేవాలయం నుంచి ఊరేగింపుగా గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కోలాటం ప్రదర్శించారు. రాత్రి తిరునాళ్లలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఏఎస్ఐలు సైదా, మహబూబ్ బాషా, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, బల్లికురవ స్టేషన్‌కు చెందిన సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌పై కోర్టుకెళతాం!


అప్రూవల్ ఆర్డర్‌ను చూపుతున్న పాలేటి

చీరాల, ఏప్రిల్ 1 : వేటపాలెం మండలం కొత్తపేట పరిధిలో పార్కు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కలెక్టర్ ఇచ్చిన అప్రూవల్ ఆర్డర్‌పై తాము కోర్టుకు వెళతామని టీడీపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు చెప్పారు. స్థానిక డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణను పాలేటి తన సహచరులతో సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కుందేరు స్థలంలో జరిగిన పార్కు నిర్మాణాన్ని వెంటనే పగుల గొట్టాలని డిమాండ్ చేశారు. పార్కు నిర్మాణంతో కుందేరు నీటి ప్రవాహం సక్రమంగా జరగదని చెప్పారు. భవిష్యత్‌లో జనావాసాలు పెరిగి పారుదలలేక ముంపు సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందుకు చెన్నై, ముంబయి, హైదరాబాద్‌లలో పరిస్థితులను వివరించారు. ఈనేపథ్యంలో పాలేటి, ఈఈ మురళీకృష్ణ మధ్య ఒకింత వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో పంచారాజ్‌శాఖకు కలెక్టర్ అప్రూవల్ ఆర్డర్ ఇచ్చారని, ఆ నిర్మాణాన్ని పగులగొట్టే అధికారం తనకు లేదని ఈఈ చెప్పారు. దీంతో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌పై కోర్టుకు వెళతామని పాలేటి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కటకం శ్రీనివాసరావు, నాగేశ్వరరెడ్డి, గుమ్మడి ఏసురత్నం, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 1: వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాయిపాలెంకు చెందిన బుచ్చమ్మ(55) మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని అక్కయిపాలెంకు చెందిన పలువురు మహిళలు వేరుశనక్కాయల మిషన్ ట్రాక్టర్‌పై అక్కాయిపాలెం నుంచి పాపాయిపాలెంకు వెళుతున్నారు. ట్రాక్టర్‌కు ఇరువైపులా అమర్చిన రేకులపై వారు కూర్చున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలో ఒకవైపు రేకు విరిగి దానిపై కూర్చున్నవారు కింద పడిపోయా రు. స్థానికులు అందించిన సమాచారం మేరకు క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. వారిలో బుచ్చమ్మ(55) మృతి చెందింది. మిగిలిన వారిలో బుర్ల శారద, మరో ఇద్దరు మహిళలకు బలమైన గాయాలయ్యాయి. వీరితో పాటు మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కూటమి అభ్యర్థి కొండయ్య ఏరియా వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటా మని భరోసా కల్పించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు చెప్పారు.

అలాగే, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌లు ఏరియా వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాల అండగా ఉంటా మని భరోసా కల్పించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అం దించాలని చెప్పారు.

పర్చూరులో కూటమి ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

పర్చూరు, ఏప్రిల్ 1: టీడీపీ జనసేన సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రచార కార్యక్రమం హోరందుకుంది. పెద్ద ఎత్తున యువకులు, మహిళలు పాల్గొని మద్దతుగా నిలుస్తున్నారు. సోమవారం పర్చూరులోని పలుప్రధాన కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తంగెళ్ళ మల్లికార్జునరావు, కొండ్రగుంటి సుబ్బారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పఠాన్ మీరావలి, శ్రీరాం వెంకటసుబ్బారావు, ఉప్పుటూరి నరేంద్ర, కోటగిరి ప్రసాద్, బేత కిషోర్, ఊటుకూరి నిర్మల, శివాలశెట్టి రమాదేవి, కొల్లా సుబ్బాయమ్మ, కొల్లా చౌదరి, జనసేన ప్రతినిధులు కారంపూడి సందీప్‌తేజ, బాలు, తోట మణి, కందా సరేంద్రబాబు, కొసనా యశ్వంత్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కవాతు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అద్దంకి పట్టణ సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కోటికలపూడి గ్రామాల్లో సీఐ ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్ బలగాలు, అద్దంకి పోలీససిబ్బందితో కవాతు నిర్వహించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

» టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం
» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


టీడీపీ సూపర్ సిక్స్ పథకాల వివరాలను అందజేస్తున్న రవికుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం అద్దంకి మున్సిపాలిటీలోని 20వ వార్డులో ఇంటింటికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్, మ్యానిఫెస్టోలోని పథకాలను తెలియజేసే కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ ప్రచారం నిర్వంహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆడబిడ్డలను మహాశక్తిగా రూపొందించేందుకు తెలుగుదేశం పార్టీ మహాశక్తి ప్రథకం ద్వారా అనేక పథకాలను మహిళలకోసం రూపొందించిందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పారు. 18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500లతో పాటు ఇంటిలో ఎంత మంది చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామన్నారు. యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, కుళాయి ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు, పూర్ టూ రిచ్ పేరుతో పేదలను ధనికులను చేసే పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు.

అద్దంకి పట్టణంలోని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పన, నూతన గృహాలు, డ్రైనేజి, కాలువల నిర్మాణం వంటివి కల్పించడంతోపాటు తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ప్రజలందరూ నష్టపోయారన్నారు. అధికారంలోకి రాగానే ప్రజా వేదికను కూల్చారని అన్నారు. రాజధానికి రైతులు ఇచ్చిన 50 వేల ఎకరాల్లో రూ.10 వేల కోట్లతో అప్పటి టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి నాశనం చేసిందన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసివేసిందన్నారు. చెత్త మీదకుడా పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌రెడ్డిదేనని చెప్పారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం ఏమైందని రవికుమార్ ప్రశ్నించారు. ఐదేళ్లలో కరెంటు చార్జిలు 9 సార్లు పెంచారని, మద్యంపై పెద్ద ఎత్తున్న దోపిడీ చేస్తున్నారన్నారని ధ్వజమెత్తారు.

అద్దంకి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన శాశ్వత మంచినీటి పథకానికి తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.84 కోట్లు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేయకుండా బాధ్యతారాహిత్యం వ్యహరించిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లను పేదలకు అందించడంతో పాటు, మంచినీటి పథకాన్ని పూర్తిచేసి పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కోనేటి అనీల్, కోనేటి శ్రీనివాసరావు, తదితరులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. నగదుతో పరారీ

» పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు
» బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్

పర్చూరు, ఏప్రిల్ 1: ఓ యువకుడిపై దాడి చేసి నగదుతో పరారైన సంఘటన సోమవారం పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పర్చూరుకు చెందిన ఆకుల మధుబాబును ఆదివారం రాత్రి పర్చూరు - చిలకలూరిపేట ఆర్‌అండ్‌బీ రహదారిలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అతని వద్దఉన్న రూ.40 వేల నగదుతోపాటు, సెల్‌ఫోన్‌తో పరారయ్యారు. దుండగుల దాడిలో గాయపడిన క్షతగాత్రుడు స్నేహితుల సహకారంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పర్చూరు సీఐ సీతారామయ్య, ఎస్సై రమేష్ తన సిబ్బందితో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. విచారణ అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమో దు చేశారు.

యువకుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించారు. సోమవారం పర్చూరులోని బాధితుడు ఆకుల మధుబాబు నివాసానికి వెళ్ళి పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించినవారిలో ఏలూరితోపాటు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

» కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య
» ఊపందుకున్న ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 1: అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలసి సూపర్ సిక్స్ , బీసీ డిక్లరేషన్‌తో ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నేతన్నల సమస్యల పరిష్కారం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అందుకనుగుణంగా స్థానికంగా ఓటు రూపేణా తనను ఆశీర్వదించాలని కోరారు.

అంతకుముందు పార్టీ కార్యాలయంలో చేనేత కార్మిక మిత్రమండలి ప్రతినిధి గుద్దంటి సుబ్బారావు, వేటపాలెం మండలం రామనగర్‌కు చెందిన మధుసూదనరావు, గోపాల్, శ్యామ్ మురళి, పిట్టువారిపాలెంకు చెందిన యేసయ్య తదితరులు కొండయ్యను కలసి తమ మద్దతు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

» ఎమ్మెల్యే గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్


టీడీపీ పథకాల కరపత్రాలను అందజేస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు(అద్దంకి టౌన్), ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాలు లేక వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. సోమవారం సంతమాగులూరు మండలం పత్తేపురం గ్రామంలో రవికుమార్‌కు మద్దతుగా ఆయన తనయుడు హర్షవర్ధన్ ఇంటింటికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రవికుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాని కోరారు. వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను వచ్చించిందని అన్నారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ నమ్మబలికిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినతర్వాత నిరుద్యోగులను నిలువున మోసం చేశారన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ లేక, రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుండి సహకారం లేక యువత భవిషత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసౌకర్యానికి తావులేకుండా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

పర్చూరు, ఏప్రిల్ 1: ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలనికి తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని పర్చూరు మండల ఏఆర్వో, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక క్రీడా వికాస కేంద్రంలో బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పర్చూరు మండల పరిధిలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో బూత్ లెవెల్ అధికారులు, ఎలక్షన్ డీటీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చేసింది మోసం..

చెప్పేది అబద్ధం!

అసత్య ప్రచారాలకు తెరలేపిన వైసీపీ

ప్రజలకు భారీగా లబ్ధి అంటూ కరపత్రాల పంపిణీ

సీఎం జగన్మోహన్‌రెడ్డి సంతకంతో ఇంటింటికీ అందజేత


ఇవ్వని నగదు కూడా ఇచ్చినట్లు లెక్కలు

మోసంతో గెలవాలని కుట్ర




● దగదర్తికి చెందిన ఓ వ్యక్తి చదువు పూర్తి చేసుకొని ఐదేళ్ల నుంచి బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆ వ్యక్తికి వైసీపీ ప్రభుత్వంలో విద్యాదీవెన కింద రూ.31,246 అందజేసినట్లు సచివాలయ ఉద్యోగులు అందించిన కరపత్రంలో పేర్కొన్నారు. అసలు తనకు విద్యాదీవెన ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా లెక్కలు చూపించడంతో ఆ వ్యక్తి ఆశ్చర్యపోయాడు.

● నెల్లూరు బీవీనగర్‌కు చెందిన ఓ కుటుంబానికి రూ.9.79 లక్షలు సాయం అందించినట్లు చూపించారు. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు రుణం ఇచ్చి తిరిగి కట్టించుకున్నా ఈ పథకం కింద రూ.20 వేలు సాయం అందించినట్లు లెక్క రాశారు. అక్కచెరువుపాడులో ఆరు అంకణాల స్థలం ఇచ్చినట్లు చెబుతూ దాని విలువను రూ.6 లక్షలుగా చూపించారు. వాస్తవానికి ఈ వ్యక్తికి పట్టా ఇచ్చారు గానీ క్షేత్రస్థాయిలో మాత్రం స్థలం లేదు. ఆ స్థలం కోర్టు కేసులో ఉంది. ఇక స్థలమే లేకపోతే అక్కడ ఇల్లు నిర్మించినట్లుగా చూపిస్తూ మరో రూ.2.50 లక్షలు సాయం అందించినట్లు అబద్ధాలను కరపత్రాల రూపంలో అందించారు.




ఏం చెప్పినా ప్రజలు గుడ్డిగా నమ్మేస్తారులే.. మనం చెప్పిందే వేదం.. అన్న రీతిలో వైసీపీ వ్యవహరిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కోడ్‌కు ముందు సచివాలయ సిబ్బంది 'గడప గడపకూ సంక్షేమం' పేరుతో ముద్రించిన కరపత్రాలను ప్రతి కుటుంబానికి పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరాలను లెక్కలతో సహా చూపించారు. అదంతా ఉచితంగా ఆ కుటుంబానికి ప్రభుత్వం అందజేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రచార క్రమంలోనే ఇచ్చినవి, ఇవ్వనవి అన్నింటినీ లెక్కల్లో కలిపేశారు. రుణం కింద ఇచ్చిన వాటిని కూడా ఉచితంగా సాయం కింద ఇచ్చినట్లు చూపించడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. ఈ కరపత్రాల్లోని లెక్కలను వివరిస్తూ ఇప్పుడు వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంతకంతో రూపొందించిన ఈ కరపత్రాల్లోని లెక్కలు పచ్చి అబద్ధాలతో కూడుకున్నాయి. కొన్ని పథకాలను ఆ కుటుంబాలకు ఇవ్వకున్నా ఇచ్చినట్లు భారీగా లెక్కలు చూపించారు. చాలా చోట్ల ఇంటి స్థలం ఇచ్చినా ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. నాలుగేళ్ల నుంచి అదిగో.. ఇదిగో ఇళ్లు అంటూ ఆశ చూపి పేదలను మోసం చేశారు. కానీ ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు సాయం చేసినట్లు అబద్ధాలు ముద్రించారు. ఇంటి స్థలం విలువను మూడు, నాలుగు రెట్లు అధికంగా ధర చూపించి కరపత్రాల్లో లెక్కలు చూపించారు. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు ఇచ్చి, దాన్ని తిరిగి కట్టించుకున్నారు. అయితే ఇది కూడా ఉచితంగా అందజేసినట్లు కరపత్రాల్లో ముద్రించారు. డ్వాక్రా రుణాలను తీసుకున్న మహిళలు తిరిగి నెలసరి వాయిదాల్లో చెల్లిస్తున్నారు. ఆ మొత్తాన్ని కూడా ఏదో సాయంగా అందించినట్లు లెక్కలు చూపించడంతో మహిళలు ఆశ్చర్యపోతున్నారు. పొందని లబ్ధిని కూడా పొందినట్లు జగన్ సంతకంతో ముద్రించిన కరపత్రాల్లో చూపించారంటే, ఆయన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ నిజంగా ఈ లెక్కలు నిజమైతే ఆ లెక్కల్లోకి రాని డబ్బులను ఎవరు తినేసినట్లు.. అంటూ పెదవి విరుస్తున్నారు. ఇలా అసత్యపు ప్రచారాలు చేసుకుంటూ, ప్రజలను మభ్యపెట్టి వచ్చే ఎన్నికల్లో గెలవాలని వైసీపీ కుట్రలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

\- నెల్లూరు, ఆంధ్రజ్యోతి



● మనుబోలుకు చెందిన ఓ కుటుంబానికి గత ఐదేళ్లలో రూ.7.49 లక్షల లబ్ధి చేకూర్చినట్లు కరపత్రంలో పేర్కొన్నారు. ఆ కుటుంబం సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోగా అందుకు రూ.1.50 లక్షలు అందించినట్లు చూపించారు. అయితే మరో రూ.2.50 లక్షలు ఇల్లు నిర్మించుకోవడానికి ఇచ్చినట్లు పచ్చి అబద్ధాలను లెక్కల్లో పేర్కొన్నారు. దీంతో ఆ రూ.2.50 లక్షలు ఎవరు తీసుకున్నారబ్బా.. అంటూ ఆ కుటుంబం ఆశ్చర్యపోయింది.

కుటుంబ లబ్ధిపై ఇంటింటికి వైసీపీ కరపత్రాలు





దామవరం ఎయిర్‌పోర్టు భూముల్లో సీఎంగా గతంలో చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన శిలాఫలకం పైలాన్

ఏమి చెప్తిరి..

ఏమి చెప్తిరి..

విజయసాయిరెడ్డి మాటలపై విస్మయం

ఐదేళ్లు మిన్నకుండి ఇప్పుడు విమానాశ్రయం మాట!

గెలిస్తే అంతర్జాతీయస్థాయిలో నిర్మిస్తామని ప్రగల్భాలు

కావలి, ఏప్రిల్ 1 : ఏమి చెప్తిరి.. ఏమి చెప్తిరి విజయసాయిరెడ్డి. వినే వారుంటే చెప్పేవాళ్లకు కొదవ అన్నట్టుంది ఆయన మాటలు. ఇటీవల దగదర్తి మండలంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి అక్కడ విమానాశ్రయం గుర్తుకు వచ్చినట్లు ఉంది. ఇంకేముంది.. ఏది చెప్పినా ప్రజలు నమ్ముతారని విజయసాయి కట్టుకథలు అల్లారు. ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులతో కలిసి పాల్గొన్న సభలో విమానాశ్రయం గురించి విజయసాయి కల్లిబొల్లి మాటలు చెప్పారు. విమానాశ్రయ నిర్మాణాన్ని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆపించారని, వైసీపీ మరలా అధికారంలోకి వస్తే గన్నవరం, విశాఖలా కాకుండా హైదరాబాద్‌లోని అంతర్జాతీయ స్థాయిలో దగదర్తిలో విమానాశ్రయం నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. గడిచిన ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీకి గుర్తుకురాని విమానాశ్రయ నిర్మాణం ఇప్పుడు ఎన్నికల సమయంలో గుర్తుకు రావటం ఏమిటంటూ ప్రజలు విస్తుపోయారు. అమ్మకు అన్నం పెట్టలేనోడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిస్తానన్నట్లుగా గతంలో శంకుస్థాపన చేసిన విమానాశ్రయాన్నే రద్దు చేసి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో విమానాశ్రయం నిర్మిస్తామని చెప్పడం చూస్తే నమ్మటానికి తామేమి అమాయకులు కామంటూ ప్రజలు అంటున్నారు. ఐదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దామవరం వచ్చి విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభానికి అవసరమైన భూములను కూడా కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు.

అయితే, అంతలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావటంతో చంద్రబాబు శంకుస్థాపన చేసిన విమానాశ్రయ నిర్మాణ కాంట్రాక్ట్‌ను రద్దు చేయించారు. మరలా టెండర్ పిలుస్తారని ప్రజలు భావిస్తున్న తరుణంలో అసలు ఇక్కడ విమానాశ్రయమే లేదని, దానిని కందుకూరు నియోజకవర్గంలోని తెట్టు వద్ద నిర్మిస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం ప్రకటన చేసింది. అయితే అక్కడ భూసేకరణ కష్టంగా ఉండటంతో దానిని గాలికి వదిలేసింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావటం.. టీడీపీ ప్రభుత్వం వస్తే దగదర్తిలో విమానాశ్రయ నిర్మాణం చేపడతామని ఆ పార్టీ నాయకులు చెప్పారు. దీంతో వైసీపీ దీని ప్రభావం తమపై ఎక్కడ పడుతుందోనని భావించి కొత్త నాటకానికి తెరతీసింది. దగదర్తి ప్రచారంలో ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తన ప్రసంగంలో గతంలో దీనిని చంద్రబాబు ఆపించారని, వైసీపీ మరలా అధికారంలోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో విమానాశ్రయం నిర్మిస్తామని చెప్పారు. ఇప్పటివరకు గుర్తుకు రాని విమానాశ్రయం ఎన్నికలప్పుడు గుర్తుకు రావటం ఎన్నికల స్టంట్ లో భాగమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



విమానాశ్రయ భూముల్లో గ్రావెల్ కోసం తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గుంతలు

● విస్తృతంగా గ్రావెల్ తవ్వకాలు

విమానాశ్రయం కోసం సేకరించిన భూములను కూడా వైసీపీ నాయకులు ఆదాయ వనరుగా మలుచు కున్నారు. అక్కడున్న భూముల్లో భారీ ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వి గ్రావెల్‌ను అమ్మి సొమ్ము చేసుకున్నారు. దీనిని అడ్డుకున్న వారిపైనా కేసులు పెట్టారు. అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాంటి గోతులన్న భూముల్లో విమానాశ్రయ నిర్మాణం ఎలా సాధ్యమవుతుందనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. నిజంగా విమానాశ్రయం కట్టాలనే ఆలోచన అధికార పార్టీ నాయకుల్లో ఉంటే ఆ భూములలో పెద్ద పెద్ద గోతులు తీసి గ్రావెల్ తరలించే వారు కాదు. కేవలం ఎన్నికలలో మభ్యపెట్టడానికే ఉత్తుత్తి హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మి మోసపోయే స్థితిలో ఈ ప్రాంత ప్రజలు లేరని చెబుతున్నారు.

టీచరుపై కేసు నమోదు

వరికుంటపాడు, ఏప్రిల్ 1: వింజమూరు మండలం నందిగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుడు జక్కం మోహన్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తీరుపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కోడ్ ఉన్నా.. డోంట్‌కేర్ కథనానికి స్పందించారు. అందులో భాగంగా మండల ఎంసీసీ నోడల్ అధికారి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయించారు.

సోమశిలలో 9.712 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి ప్రాజెక్టులో 9.712 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 300, డెల్టాకు 920, దక్షిణ కాలువకు 220 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



పలుకూరులో జరిగిన రోడ్‌షోలో ఎడ్లబండి పై నుంచి అభివాదం చేస్తున్న అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు

నెల్లూరులోనే ఉండి సేవ చేస్తా..

ఆయన గెలిస్తే ఢిల్లీకి ఎక్స్‌పోర్ట్ అవుతారు!

● కందుకూరు ప్రచారంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 1 : 'నన్ను గెలిపిస్తే గెలిచాక ఆఫ్రికా, దుబాయ్‌లలో ఉంటానని ప్రచారం చేస్తున్నారు. అయితే నేనెక్కడికీ పోయేవాడిని కాదు.. నెల్లూరులోనే ఉండి ప్రజలకు సేవ చేస్తా"నని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సోమవారం కందుకూరు మండలం పలుకూరు గ్రామంలో రోడ్‌షో నిర్వహించి ప్రసంగించారు. తమ ట్రస్టు తరఫున నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నానని, 150 గ్రామాలలో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఢిల్లీ నుంచి ఇంపోర్ట్ అయ్యాడని, ఆయన్ను గెలిపిస్తే మళ్లీ ఢిల్లీకి ఎక్స్‌పోర్టు అవుతాడని విమర్శించారు. జిల్లాలో తన సేవల గురించి తెలియని వారు లేరని అలాంటిది నెల్లూరు మొహమే తెలియని విజయసాయి తనను విమర్శిస్తుండటం చోద్యంగా ఉందని అన్నారు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయమని ప్రత్యామ్నాయంగా పంపిణీకి ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం టీడీపీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పలుకూరులో తాగునీరు, ఇతర సమస్యలపై గ్రామస్థులు వారి దృష్టికి తీసుకురాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రథమ ప్రాధాన్యంగా పరిష్కరిస్తామని అన్నారు.

● నేను పక్కా లోకల్ : ఇంటూరి

అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 'నేను పక్కా లోకల్.. ఇక్కడే పుట్టాను ఇక్కడే పెరిగాను. వైసీపీ తరఫున పోటీచేస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్ నాన్ లోకల్ అభ్యర్థి. కనిగిరిలో ఆయన చేసిన ఘనకార్యాలతో అక్కడ గెలవరని ఇక్కడికి పంపించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణమైన పరిస్థితుల గురించి మనందరికీ తెలుసు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి శుభం జరుగుతుందని' అన్నారు. వీరభద్రస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పలుకూరు బీసీ కాలనీ, వెంకన్నపాలెంకు చెందిన పలువురు టీడీపీలో చేరారు.

పది మూల్యాంకనం ప్రారంభం

● 1,095 మంది విధులకు హాజరు ● ఉపాధ్యాయుల డుమ్మా యత్నాలు

ఈ మూల్యాంకనం కోసం 169 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 1055 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 375 స్పెషల్ అసిస్టెంట్లు, విద్యాశాఖ సిబ్బంది 50 మంది కలిపి మొత్తం 1649 మందిని మూల్యాంకన విధులకు నియమించారు. అయితే తొలిరోజు 1,095 మంది మాత్రమే విధులకు హాజరై 14,300 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. ప్రతి రోజూ ఉదయం 8.45 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు మూల్యాంకనం జరగనుంది. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు కనీసం 35 నుంచి 40 జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుంది.

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 : నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం మొదలైంది. ఈనెల 8వతేదీ వరకు ఇది కొనసాగనుంది. వివిధ జిల్లాలకు చెందిన 1,80,393 లక్షల సమాధాన పత్రాలు జిల్లాకు చేరడంతో వీటిని కట్టుదిట్టమైన భద్రత నడుమ మూల్యాంకనం చేసేందుకు విద్యాశాఖ 1,599 మంది సిబ్బందిని నియమించింది. ఎండవేడిమి తీవ్రంగా ఉండడం, ఇతర కారణాలతో అత్యధిక శాతం మంది ఉపాధ్యాయులు గైర్హాజరయ్యేందుకు ప్రయత్నించారు. వీరిలో కొంతమందిని అధికారులు రిలీవ్ చేయగా మరికొంత మంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరు కావాల్సి వచ్చింది. హాజరైన సిబ్బందికి మెస్ సౌకర్యం, షామియానాలు ఏర్పాటు చేయకపోవడంతో అందరూ చెట్లకిందనే డ్యూటీలు వేసే వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మెస్ వసతి కల్పించకపోవడంతో ఉపాధ్యాయులంతా చెట్లనీడన, పాఠశాల ప్రాంగణంలో భోజనాలు చేస్తూ కనిపించారు.



టీచర్లనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో రామారావు, పక్కన ఆర్జేడీ రామలింగం

● కట్టుదిట్టమైన చర్యలు : డీఈవో

మూల్యాంకనానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. సిబ్బంది పనితీరు, మూల్యాంకనం చేసే విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరేట్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. మూల్యాంకన సమయంలో మొబైల్ ఫోన్లను కూడా అనుమతించమని, ఒకవేళ మొబైల్‌లో మాట్లాడుతూ ఉపాధ్యాయులు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాధాన పత్రాలు దిద్దే ఎగ్జామినర్ల నియామకంలో పదో తరగతికి మూడేళ్ల బోధించిన అనుభవం ఉన్నవారికే అవకాశం కల్పించామన్నారు. నిర్దేశించిన సంఖ్య మేరకు మూల్యాంకనం పూర్తికాకపోతే అదనపు సమయమైనా తీసుకుని పని పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. విధులకు హాజరయ్యే సిబ్బంది ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తప్పనిసరిగా వేయాలని సూచించారు.

ప్రజలను మోసం చేయడమే

● దళిత సంఘర్షణ సమితి ఆగ్రహం

దామవరం విమానాశ్రయం మరలా తెస్తానని ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. సోమవారం కావలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దగదర్తిలో ఆదివారం జరిగిన ప్రచారంలో అంతర్జాతీయ విమానాశ్రయం తెస్తామని విజయసాయి చెప్పడం జిల్లావాసులను మోసం చేయడమేనన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఆ ప్రాంతంలో నిర్మించిన ఫ్యాక్టరీలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా రొయ్య పొట్టు తీసేందుకు ఈ ప్రాంతవారిని కూలీలుగా వాడుకున్నారని మండిపడ్డారు. కారుచౌకగా ప్రభుత్వ భూమిని కొట్టేసి ఫ్యాక్టరీలు నిర్మించి ఈ ప్రాంతవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవటం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయరత్నం, వెంకటరత్నం, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' ప్రవేశాల ఫలితాలు విడుదల

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 : జిల్లాలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించిన వివరాలను విద్యాలయ నోటీస్‌బోర్డులో అందుబాటులో ఉంచామని, త్వరలో తల్లిదండ్రులకు కూడా సమాచారం అందచేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8985007588 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మరమ్మతులకు నోచని వంతెనలు

- ఏళ్ల నాడు నిర్మించిన వాటిపైనే వాహనాల రాకపోకలు
- పర్యవేక్షణ చేయని అధికారులు
- వంతెనల వద్ద కూలిన సైడ్ వాల్స్


తూర్పుబోయమడుగుల సమీపంలో ప్రహరీ లేని వంతెన


భోగ్యంవారిపల్లి వద్ద ఇనుప సువ్వలు తేలిన వంతెన

వరికుంటపాడు, ఏప్రిల్ 1: జిల్లాకేంద్రానికి శివారులోని మండలం. గ్రామాల రహదారుల్లోని వంతెనలు మాత్రం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోయి ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు, వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట వాగులు, వంకలపై నిర్మించిన వంతెనలు ఇవి. వీటి పర్యవేక్షణను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారులతో పాటు గ్రామీణ రహదారుల పరిస్థితి అలాగే ఉన్నది. మండలంలోని పలు గ్రామాల మీదుగా 565జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడంతో వాహనాల రద్దీ మరీంతగా ఎక్కువగా ఉంది. ప్రధానంగా నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతమైన భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఉప్పువాగుపై నిర్మించిన వంతెన దారి పొడవునా ఉన్న రోడ్డు గుంతలమయంగా మారినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. ప్రతినిత్యం ఆ మార్గంలో విజయవాడ, కడప, బెంగళూరు, విజయవాడ, నెల్లూరు, చెన్నై, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో పాటు ఇతర ప్రాంతాలకు అధిక సంఖ్యలోనే ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు వెళుతుంటాయి. భారీ వాహనాల సంగతి అటుంచి ఆటోలు, మోటారు బైకులు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఫుట్‌పాత్‌పైన నడిచే అవకాశం కూడా లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. తూర్పుబోయమడుగుల సమీపంలోని గండిపాళెం ప్రాజెక్టు పరిధిలోని 5వ నంబరు కాలువపై నిర్మించిన వంతెన ఓ వైపున రక్షణగోడ కూలిపోయింది. మలుపు ప్రాంతం కావడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి బోల్తా పడే ప్రమాదం ఉంది. ఉదయగిరి-వరికుంటపాడు మండలాల సరిహద్దులోని జీ.కొత్తపల్లి సమీపంలోని ప్రధానరోడ్డుపై నిర్మించిన వంతెన పూర్తిస్థాయిలో ధ్వంసం అయ్యింది. యర్రంరెడ్డిపల్లి గ్రామ సమీ పంలోని కాలువపై నిర్మించిన వంతెనపై పగలు ఎలాగోలా రాకపోకలు సాగించినా రాత్రి సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రధాన రహదారుల సంగతే ఇలా ఉండే ఇక మారుమూల అంత ర్గత రహదారుల పరిస్థితి ఎలా ఉంటుందో అధికా రులకే ఎరుక. ఏళ్ల తరబడి ఇలాంటి ఈ తంతే కొనసాగుతున్నా తమ గోడు వినేవారే కనిపించ డం లేదనే విమర్శలు ప్రజలు, వాహనదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వంతెనలకు మరమ్మతులు చేపట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కందుకూరులో టీడీపీ అభ్యర్థుల రోడ్‌షో!

కందుకూరు, ఏప్రిల్ 1 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి మండలంలోని పలుకూరు గ్రామం నుంచి ఆయన ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. గ్రామంలో ఎడ్లబండిపై రోడ్‌షో నిర్వహించి మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థులుగా బరిలో దిగుతున్న తమను గెలిపించటం ద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో సింగరాయకొండ వద్దకు చేరుకున్న వేమిరెడ్డికి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు పార్టీల ముఖ్యనేతలంతా ఘన స్వాగతం పలికి ర్యాలీగా పలుకూరుకు చేరుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మ గుడిలో పూజలు అనంతరం వేమిరెడ్డి, ఇంటూరిలకు హారతులతో స్వాగతం పలికి ఎడ్లబండిపై తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నార్నెరోశయ్య, కొండలరావు, శ్రీనివాసరావు, వెంకటనరసింహ్మం, కూనం సుబ్బారెడ్డి, సుధాకర్, చిరంజీవిరెడ్డి, శ్రీనివాసరావు, మాలకొండయ్య, మాతయ్య, బాబూరావు, చంద్రయ్య, స్వర్ణ శ్రీను, షేక్ నాగూర్, తలారి మాలకొండయ్య, హరిబాబు, ఉన్నం భాస్కరరావు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

పెదపట్టపుపాలెంలో ఆత్మీయ సమావేశం

ఉలవపాడు మండలం పెదపట్టపుపాలెం గ్రామస్థులతో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు సోమవారం సాయంత్రం ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. అంతకుముందు రెడ్డిపాలెం బస్టాండ్ సెంటర్‌లోనూ స్థానికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు ఆవుల రఘు, నాయకులు ఆవుల సోమయ్య, కొండూరి జయరాం, ప్రళయకావేరి రామమూర్తి, పుల్లా వెంకట్, పుల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పెదపట్టపుపాలెం ఆత్మీయ సమావేశంలో వేమిరెడ్డి, ఇంటూరి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్సై ఎం.బాజీబాబు, సిబ్బంది దాడులు చేసి ఉప్పుటేరులో ఇసుక నింపుకొని వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

టీడీపీలో చేరిక

లింగసముద్రం : మండలంలోని ఆర్ఆర్ పాలెంకు చెందిన వైసీపీ నేత కిలారి మల్లికార్జున సోమవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నేత కేతినేని మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు


సమంతకు కేక్ తినిపిస్తున్న ఎంఈవో బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు

కలువాయి, ఏప్రిల్ 1: నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించిన తెలుగురాయపురం పాఠశాల విద్యార్థి గుంజి సమంతను సోమవారం ఎంఈవో బాలకృష్ణారెడ్డి, ఎంఈవో-2 శేషగిరిరావు అభినందించారు. ఎంఈవో కార్యాలయంలో విద్యార్థినికి కేక్ కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. జీవీ.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఆర్‌వీ కృష్ణారెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఉదయగిరి, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. దీనికోసం 08620-293077 నెంబర్‌లో కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కాల్ సెంటర్ 24గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల నిర్వహణలో మార్పులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: వేసవి దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయాలను మార్పు చేసినట్లు సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి మే 31వ తేదీ వరకు కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మే 1 నుంచి 15వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు, 16 నుంచి 31వరకు ఆయాలకు వేసవి సెలవులు ఉంటాయన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కె.రమేష్, రాజమోహన్, నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సోమవారం రూ.15వేల ప్రింటర్‌ను సోమవారం హెచ్‌ఎం సుబ్బారెడ్డికి అందేశారు. భవిష్యత్తులో విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు చేయూత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్‌బాషా, ప్రశాంతకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం, ఏప్రిల్ 1: దువ్వూరు, మర్రిపాడులో జనసేన నాయకులు నిరుపేద ఒంటిరి వృద్ధులకు సోమవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. నెలరోజులకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె అందచేశారు. అనంతరం పెరమనకు చెందిన కొంతమంది యువకులు పార్టీ మండలాధ్యక్షుడు రాకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి తరుపున సూపర్ సిక్స్ పతకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాను కిరణ్, అనిల్ కుమార్, చదలవాడ హరీష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బెంచీల వితరణ


ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బెంచీలు

అనంతసాగరం, ఏప్రిల్ 1: స్థానిక పీహెచ్‌సీలో రోగుల సౌకర్యార్థం ఆత్మకూరుకు చెందిన వైద్యులు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర ప్రజావైద్యశాల అధినేత ప్రణిత్ సోమవారం మూడు బెంచీలను వితరణగా ఇచ్చాడు. చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది ఆయనకు ప్రతేక ధన్యవాదాలు తెలిపారు.



జోరుగా టీడీపీ ఎన్నికల ప్రచారం


క్యాలెండర్, కరపత్రాలను పంపిణీ చేస్తున్న బూత్ లెవెల్ ఇన్‌చార్జ్‌లు

సీతారామపురం, ఏప్రిల్ 1: కోటవీధి, అల్లికవీధి, తోట వీధి, మైయిన్ బజార్ ప్రాంతాల్లో సోమవారం తెలుగుదేశం బూత్‌లెవెల్ ఇన్‌చార్జ్‌లు తోట మాల్యాద్రి, తోట మనోజ్, నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పార్టీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తుకు సీఎంగా చంద్రబాబు నాయుడుని గెలిపించు కోవాలని కోరారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తోట నవీన్‌కుమార్, జగదీష్, తోట నరసింహులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: స్థానిక ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించే సీతారామపురం, ఉదయగిరి మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమనికి నెల్లూరు ఎంపీ, ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్ హాజరవుతారన్నారు. వారివెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొంటారన్నారు.

తెలుగుదేశం కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం..!


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వింజమూరు, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలకు తెలుగుదేశంద కార్యకర్తలు, నాయకులు బెదరని ధైర్యంతో ఉంటారని టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథ రెడ్డి తెలిపారు. కాటేపల్లి ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తం స్వగృహంలో మండల బోర్డు కన్వీనర్ వనిపెంట వెంకటసుబ్బారెడ్డిలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన ఎంపీటీసీ సభ్యుడి దిష్టిబొమ్మను స్థానిక వైసీపీ నాయకులు తగలబెట్టడం దారుణమన్నారు. వైసీపీ నచ్చకపోవడం వలన పార్టీ మారాల్సి వచ్చిందని, దాన్ని వైసీపీ నాయకులు వేరే విధంగా ఊహించి దిష్టిబొమ్మను తగలబెట్టడం దారుణం అన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిదికాదని తెలిపారు. సమావేశంలో మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, పెదరాఘవరెడ్డి, గంగిరెడ్డి, బీసీ సెల్ నాయకులు వేణుగో పాల్, కొండపల్లి వెంకటేశ్వరనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపే లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ నాయకులు

వింజమూరు, ఏప్రిల్ 1: పట్టణంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ కాకర్ల సురేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబునాయుడు అంగీకారం తెలపడంతో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు మందా సుజాత, ఎమ్మార్పీఎస్ నాయకులు మోహన్‌రావు, సుధాకర్, కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మష్కూరియా దర్గాలో ఇఫ్తార్ విందు

అనంతసాగరం, ఏప్రిల్ 1: స్థానిక బస్టాండ్ సెంటర్ లో వెలసిన హజరత్ మష్కూర్ అలిషా ఖాదరీ దర్గాలో సోమవారం రంజాన్ ఉపవాసదీక్ష చేసిన ముస్లింలకు నిర్వాహకులు సానీసాహెబ్, మజీద్‌సాహెబ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

1ఏటీకె1: ట్రాఫిక్ సమస్యలపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ట్రాఫిక్ సమస్యపై సీపీఎం నిరసన



ట్రాఫిక్ సమస్యలపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 1: పట్టణంలో అర్ధాంతరంగా నిలిపివేసిన రహదారులతో నిత్యం ట్రాఫిక్స్ సమస్య ఏర్పడుతుందని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఫ్లెక్సీలు చేతపట్టి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీధుల్లో తిరుగుతూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె డెవిడ్ రాజు మాట్లాడారు. రోడ్డు ఏర్పాటుకు బాధితులకు నష్ట పరిహారం ప్రకటించి ఇప్పటికీ చెల్లించక పోవడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో జి.లక్ష్మిపతి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నందాని, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వరికుంటపాడు, ఏప్రిల్ 1: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఉదయగిరి సీఐ గిరిబాబు తెలిపారు. సోమవారం వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపుపై చర్యలు శూన్యం


డ్రమ్ముల్లో తరలిస్తున్న కోడి వ్యర్థాలు

అనంతసాగరం: శంకరనగరం, రేవూరు, పాతదేవరా యపల్లి, గౌరవరం గ్రామాల్లో చేపల గుంతలు వెలిశాయి. చేపల దాణాగా చికెన్‌షాపుల్లో దొరికే కోళ్ల వ్యర్థాలను వేస్తూ పెంపకందారులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. సంబంధిత అధికారులు మామూళ్లకు తలొగ్గి ఈ వ్యాపారాన్ని పోత్సహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సోమ శిల, అనంతసాగరంతో పాటు బద్వేల్ చికెన్ షాపుల నుంచి కోళ్ల వ్యర్థాలను డ్రమ్ముల్లో నింపి వాహనాలతో తరలిస్తుండగా వాహనాలు వెళ్లే సమయంలో గ్రామాల వద్ద భరించలేని దుర్వాసనతో ప్రజ లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చేపలను బుచ్చి, నెల్లూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు.

కష్టపడి పనిచేసి విజయం సాధించాలి : బీద


టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో రవిచంద్ర

అల్లూరు, ఏప్రిల్ 1 : ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పిలుపునిచ్చారు. అల్లూరు పట్టణ పరిధిలోని వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ గతంలో ఇదే ప్రాంతంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి గెలుపు సాధించామన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో గెలుస్తామని తేలిగ్గా తీసుకోవద్దని, శక్తికి మించి కష్టపడితేనే గెలుపు సాధ్యమన్నారు. ఎన్నికలలోపు ప్రతి ఓటరును పదిసార్లు కలిసి ఓటును అభ్యర్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమిరెడ్డి కోటారెడ్డి, బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులురెడ్డి, కొండూరు పాలుశెట్టి, నలగట్ల శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసుల రెడ్డి, అరగల రమణయ్య, మేడా శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, తిరువీధి అనూరాధ, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

70 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక : అల్లూరు పట్టణ పరిధిలోని హరిజనవాడ, తూర్పువీధి, మండలంలోని గ్రద్దగుంట, బోగోలు మండలం జువ్వలదిన్నె నుంచి దాదాపు 70 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు, బీద రవిచంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాను కప్పి స్వాగతించారు.

సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- 22వ వార్డులో కావ్య ఎన్నికల ప్రచారం


22వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 1: సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ 22వ వార్డులో సోమవారం సాయంత్రం స్థానిక వార్డు ఇన్‌చార్జి కుందుర్తి కిరణ్, క్లస్టర్ ఇన్‌చార్జి మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రం గాడిలో పడాలన్నా, పాత సంక్షేమ పథకాలు ఆగకుండా, సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలన్నా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్ రెడ్డి అభివృద్ధిని విస్మరించి దొరికిన కాడికి దోచుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, టీడీపీ నేతలు ఇమ్రాన్, వసంతరావు, దేవరకొండ మధు, జనసేన నేత షమీ, బీజేపీ నేత ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంను చేసుకుందాం : వంటేరు


బీకే అగ్రహారంలో పార్టీ నాయకులతో వంటేరు

జలదంకి, ఏప్రిల్ 1: అభివృద్ధికి మారుపేరైన చంద్రబాబునాయుడని రాష్ట్రానికి సీఎంను చేసుకోవడమే సంకల్పంగా ముందుకు సాగి ఎంపీ, ఎమ్మెల్యేలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయ న మండలంలోని హనుమకొండపాలెం, బ్రాహ్మణక్రాక, 9వమైలు, బికె అగ్రహారం గ్రామాల్లో పర్యటించి పార్టీ నేతలు, సానుభూతిపరుల నివాసాలకు వెళ్లి టీడీపీ అభ్యర్థుల వి.యానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ఎంవీ రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డి, నాయకులు మందపల్లి మాల్యాద్రియాదవ్, తెలుగుయువత రాష్ట్ర నేత గుర్రం ప్రవీణ్‌బాబు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి : సీపీఎం

కావలిటౌన్, ఏప్రిల్ 1: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు పెరిగి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయన్నారు. కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం లాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. కాలువలు శుభ్రం చేయక దోమలకు నిలయాలుగా మారి ప్రజలపై దాడి చేస్తుండడంతో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, చర్మ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. అనేక ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్‌రావు, తిరుపాల్, బోగిశెట్టి కృష్ణయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది : మాలేపాటి


స్థానికులతో మాట్లాడుతున్న మాలేపాటి

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 1: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం కొత్తపల్లి కౌరుగుంట పంచాయతీ సున్నపు బట్టి, దళితవాడల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళితవాడలోని ప్రధాన సమస్యలపై స్థానికులతో చర్చించారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగల్ల సుధాకర్, వల్లపు మల్లి, బెల్లంకొండ శీను, దశయ్య, హనుమతరావు, శ్రీహరినాయుడు, పులి శీనయ్య, కాండ్ర వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, ఇంటూరిలకు ఎమ్మార్పీఎస్ మద్దతు

కందుకూరు, ఏప్రిల్ 1: తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ మాదిగలు తెలిపారు. సోమవారం కందుకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యకర్తలు రావినూతల ముత్తు, కిట్టు, రావినూతల ఐజాక్, వినయ్, తాటిపర్తి రవీంద్ర, సందీప్, సిహెచ్ శ్రీనాథ్, రవీంద్ర, జలదంకి రమేష్, గొడపేరు అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 1: నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లు మంగళవారం విం.మూరులో టీడీపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

5లోగా పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 1: పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం నిర్వహించే పాలీసెట్‌కు అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.మస్తానయ్య తెలిపారు. పాలీసెట్‌కు హాజరుకాదలచిన విద్యార్థుల కోసం కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ ఉచిత శిక్షణ ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

లింగసముద్రం, ఏప్రిల్ 1 : మండలంలోని వెంగళాపురం, లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూతులను కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి సోమవారం పరిశీలించారు. ఇక్కడి వసతులను తహసీల్దారు జీ.శ్రీచరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ టీ.ప్రసాద్, వీఆర్వోలు షేక్ మస్తాన్‌వలి, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలు

కందుకూరు, ఏప్రిల్ 1: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనను ప్రత్యేకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపగా కళాశాల ఆవరణలో నర్సింగ్ విద్యార్థినులు, అధ్యాపకుల సమక్షంలో ఆయన కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల అధ్యాపకులు, సిబ్బందికి విందు ఏర్పాటు చేశారు.

కూటమి గెలుపు రాష్టానికి అనివార్యం

అల్లూరు, ఏప్రిల్ 1 : కూటమి గెలుపు రాష్టానికి అనివార్యమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు వినాయకనగర్, ప్రధాన రహదారి, పాతబస్టాండు సెంటరు తదితర ప్రాంతాల్లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి కోటారెడ్డి, వేమిరెడ్డి సందీప్‌రెడ్డి, వాకాటి వినీత్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, తిరువీధి అనూరాధ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల నుంచి ఫోన్లు, డివైజ్‌ల స్వాధీనం

లింగసముద్రం, ఏప్రిల్ 1 : భారత ఎన్నికల సంఘం పింఛన్లు పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టాలని ఆదేశించిన నేపథ్యంలో మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 187 మంది వలంటీర్ల నుంచి ఫోన్లు, డివైజ్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎంపీడీవో యు శేషబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి సచివాలయాల వద్దనే పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు లేదా పింఛను ఐడీ నంబరు తీసుకురావాలని చెప్పారు. పింఛను పుస్తకం తీసుకొని రావద్దని చెప్పారు.

ఆర్ఎస్ఆర్‌లో కార్నివాల్ 2కే 24

బిట్రగుంట, ఏప్రిల్ 1: బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కార్నివాల్ 2కే 24 పేరుతో యూత్ హంగామా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన జ్యూక్ బాక్స్, ఫ్లవర్ స్టాల్, కాయిన్ ఇన్ ది బకెట్, హిట్ ది గ్లాస్, రింగ్ రాజా ఫుడ్ కోర్ట్, జ్యూస్ స్టాల్‌లను ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, కార్నివాల్ కన్వీనర్ వీ.సునీల్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థుల వంటావార్పు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆర్వీ రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ఎవరూ చేరలేదు..

లింగసముద్రం, ఏప్రిల్ 1 : మండలంలోని విశ్వనాథపురంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు ఎవరూ వైసీపీలో చేరలేదని ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉన్నం రమేష్, సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు ఉన్నం వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. గ్రామంలోని వైసీపీకి చెందిన వారికే కండువాలు వేసి వైసీపీలో చేరారని ప్రకటించడం సరికాదన్నారు.

పెన్షన్ పంపిణీపై అవగాహన

కలిగిరి, ఏప్రిల్ 1: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో రంగసుబ్బరాయుడు అవగాహన కల్పించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెన్షన్ లబ్ధిదారులకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బాలకిషోర్, ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ప్రతి అధికారి పనిచేయాలని ఎంపీడీవో జమీఉల్లా అన్నారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో మండల, పంచాయతీ స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లు పెన్షన్ పంపిణీలో పాల్గొనవద్దని సూచించిన నేపథ్యంలో వారి నుంచి మొబైల్ ఫోన్, సిమ్‌కార్డు, ఫింగర్ ప్రింట్ స్కానర్ వంటి పరికరాలను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో 3వ తేదీ నుంచి పింఛన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరత్నం, ఏవో గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.